www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

రూ.200 లోపు ఖర్చుతో హైదరాబాద్‌లో
ఎక్కడి నుంచైనా.. ఎయిర్‌పోర్టుకు..!

మెట్రో రైలులో సాఫీగా ప్రయాణం

మొదటి దశ కారిడార్లతో

అనుసంధానంగా నాగోల్-శంషాబాద్ లైన్

మియాపూర్, రాయదుర్గం, జేబీఎస్..

3 కారిడార్ల ద్వారా విమానాశ్రయానికి

3



సోమవారం | 29-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 30 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం, తిథి: పంచమి ఉ. 7.58 తదుపరి షష్ఠి; నక్షత్రం: పూర్వాషాఢ తె. 4.42 తదుపరి ఉత్తరాషాఢ వర్జ్యం: మ. 2.22-3.57; దుర్ముహూర్తం: మ. 12.37-1.28, మ. 3.09-3.59; అమృతఘడియలు: రా. 11.55-1.30; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.31

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మోదీ ఉద్యోగాన్ని ఊడగొట్టాలి!

లేకపోతే దేశాన్ని అదానీ, అంబానీలకు తాకట్టు పెడతారు

రిజర్వేషన్లు రద్దు చేసి ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తారు

పాలమూరు-రంగారెడ్డికి జాతీయహోదా ఎందుకు ఇవ్వలేదు?

కాజీపేట, బయ్యారం ఫ్యాక్టరీలు, ఐటీఐఆర్‌ను ఎందుకు రద్దు చేశారు?

జవాబులు చెప్పాకే ప్రధాని మోదీ తెలంగాణకు రావాలి

దేవుడి ఫొటో చూపి అడుక్కునే వాళ్లలాగ బీజేపోళ్లు ఓట్లడుగుతున్నరు

బీజేపీ-బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందం.. మేడ్చల్ ఎమ్మెల్యే మాటలే సాక్ష్యం

మల్కాజిగిరి నియోజకవర్గ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



12

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీకి ఓటేస్తే రైల్వేను, ఎల్‌ఐసీని అదానీ, అంబానీలకు అమ్మేస్తారని.. కాబట్టి, ఆయా సంస్థల్లో పని చేసే వారికి ఉద్యోగాలు ఉండాలంటే మోదీ ఉద్యోగాన్ని ఊడగొట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోదీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని హెచ్చరించారు. రిజర్వేషన్లు లేకుండా చేసి దేశాన్ని అదానీ, అంబానీలకు తాకట్టు పెడతారని విమర్శించారు. రైల్వేలు, ఎల్‌ఐసీ, ఎయిర్‌పోర్టు, బీఎస్ఎన్ఎల్, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఐడీపీఎల్, డిఫెన్స్ ఫ్యాక్టరీలను తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించి ఉద్యోగాలను కాంగ్రెస్ కల్పించిందని, ఆ సంస్థలను అందులో ఉద్యోగాలను కాపాడుకోవాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అన్నారు. ఆదివారం మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలో సీఎం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వనస్థలిపురం, కౌకుర్ల వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని ప్రసంగించారు. తెలంగాణకు వస్తున్న నరేంద్ర మోదీ.. రిజర్వేషన్లు ఎందుకు రద్దు చేస్తున్నారో జవాబు చెప్పి రావాలని సీఎం నిలదీశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదో.. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ప్రాజెక్టులను ఎందుకు రద్దు చేశారో ఈ ప్రాంత ప్రజలకు సమాధానం చెప్పాలని, ఆ తర్వాతే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ తెలంగాణ ఏర్పాటును తప్పుబట్టిన మోదీ ఏవిధంగా ఓట్లు అడుగుతారని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీవాళ్ల మాటలు చూస్తే మూడు ఎడ్లు.. 36 దొడ్లు అన్నట్లుగా ఉందని విమర్శించారు. మతాన్ని అడ్డం పెట్టుకొని ఓట్లు కొల్లగొట్టి దేశంలో అధికారంలోకి రావాలని

మిగతా 12వ పేజీలో...

భూ యజమానితోపాటు కౌలురైతుకూ భరోసా

ఎవరికి ఇవ్వాల్సింది వారికి వేర్వేరుగా ఇస్తాం

గ్రామసభల ద్వారా కౌలురైతులను గుర్తిస్తాం

5 ఎకరాలకుపైగా భూమి 4లక్షల కుటుంబాలకే

92 శాతం మంది రైతులు 3 ఎకరాలలోపువారే

ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు చేసేవారిని

50 లక్షల మంది యువత చూసుకుంటారు

క్లీన్ ఇమేజ్ ఉన్నవారినే పార్టీలో చేర్చుకుంటున్నాం

రిజర్వేషన్లు ఎత్తివేయడమే బీజేపీ కోర్ అజెండా

ఎడ్యుకేషన్ పాలసీపై కమిషన్ వేస్తాం: రేవంత్‌రెడ్డి

కాళేశ్వరం కహానీ



ఈ ప్రాజెక్టు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఇంజనీరింగ్ తప్పిదమే

తుమ్మిడిహట్టి వద్ద 165 టీఎంసీలు లేవని సీడబ్ల్యూసీ

చెప్పిందంటూ బీఆర్‌ఎస్ సర్కార్ అబద్ధాలు

తెరపైకి మేడిగడ్డ.. హడావుడిగా డీపీఆర్ తయారీ

జియోటెక్నికల్ పరిశోధన ఓచోట.. బ్యారేజీలు మరోచోట

మేడిగడ్డ కుంగుబాటు కచ్చితంగా మానవ నిర్మిత విపత్తే

ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల కాదు.. విఫల పథకం

కాళేశ్వరం లోపాలపై కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు

వెదిరె శ్రీరామ్ వరుస కథనాలు.. ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

"2014 కంటే ముందు నీళ్ల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయం మీద అందరం కొట్లాడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నాం! కానీ.. గత పదేళ్లలో ప్రజలు ఎన్నుకున్న తెలంగాణ ప్రభుత్వం గోదావరి, కృష్ణా నదుల నీళ్లు, ప్రాజెక్టుల విషయంలో చేసిన నిర్వాకాలు.. మరీముఖ్యంగా గోదావరి నదిపై నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు తెలంగాణకు శాపంగా మారాయి. మేడిగడ్డ బ్యారేజీ

14



కుంగుబాటు.. రాష్ట్ర ప్రజలను కుంగుబాటుకు గురి చేసింది. ఆ ప్రాజెక్ట్ వైఫల్యం కేవలం కుంగుబాటు సంఘటనతోనే బయటపడిందా? అంటే.. కానే కాదు. ఈ వైఫల్యం గురించి అప్పటి ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు ముందే తెలుసు. తెలిసీ ఈ విషయాన్ని ఎందుకు తొక్కి పెట్టారోగానీ, అది తెలంగాణకు అతి భారంగా పరిణమించింది" అని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ అంటున్నారు. కాళేశ్వరం నిర్మాణ లోపాలపై, ప్రాజెక్టు వైఫల్యంపై 'ఆంధ్రజ్యోతి'కి ఆయన రాసిన వరుస కథనాలు నేటినుంచి..



హనుమకొండలో బస్సులోంచి కేసీఆర్ అభివాదం

వచ్చేది హంగ్.. మనమే కింగ్

ఈ మోకాను వదలొద్దు.. 14-15 సీట్లివ్వండి

కేంద్రంలో చక్రం తిప్పేది మనమే

పేగులు తెగేదాకా కొట్లాడేది మనమే

జైళ్లకు.. తోకమట్టకు నేను భయపడతానా?

భయపడి ఉంటే తెలంగాణ వచ్చేదా??

నా గుడ్లు పీకుతాడట.. చెడ్డీ లాక్కొంటాడట

ఇదేనా సీఎం మాట్లాడే భాష?

వరంగల్ రోడ్‌షోలో బీఆర్‌ఎస్ చీఫ్ కేసీఆర్

ఘన్‌పూర్‌కు మూణ్నెల్లలో ఉప ఎన్నికని వ్యాఖ్య

బీజేపీ చెప్పినట్లు అచ్చేదిన్ కాదు.. సచ్చేదిన్

గోదావరి నీళ్లను తరలించే కుట్ర.. మోదీపై ఫైర్

14

ఏడాదిలోగా కేసీఆర్ శాసిస్తారు

తోకాడిస్తున్న అధికారులూ.. మన మాట వింటారు

అధికారం పోవడంతో ఊళ్లో సుంకరీ పలకట్లే

హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చే కుట్ర

ఇలాంటి కుట్రల నుంచి కాపాడేది బీఆర్‌ఎస్సే

మళ్లీ మోదీ సర్కారు వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుంది

రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌ల మ్యాచ్ ఫిక్సింగ్

రాముడు అందరి వాడు..

మనమూ జైశ్రీరామ్ అందాం: కేటీఆర్

వేములవాడ, కరీంనగర్‌లో

పార్టీ కార్యకర్తలతో భేటీ

14

రిజర్వేషన్లను ఆరెస్సెస్ వ్యతిరేకించింది

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయాలన్నది బీజేపీ, ఆరెస్సెస్‌ల విధానం

తెలంగాణలో బీజేపీతో చేతులుకలిపిన బీఆర్‌ఎస్‌ను గద్దె దించాం: రాహుల్ గాంధీ

డామన్, కటక్, ఏప్రిల్ 28: రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని ఆరెస్సెస్ ఇప్పుడు చెబుతున్నా.. గతంలో ఆ సంస్థ వాటిని వ్యతిరేకించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. కాంగ్రెస్‌కు, ఆరెస్సెస్-బీజేపీకి మధ్య ఉన్న పోరాటం సైద్ధాంతికమైనదని.. వాళ్లు దేశ రాజ్యాంగాన్ని నిర్మూలించాలనుకుంటే తాము కాపాడాలని కోరుకుంటున్నామని చెప్పారు. 'భారతదేశానికి రాజ్యాంగం పునాదిలా నిలిచింది. ఆరెస్సెస్-బీజేపీ వాళ్లు దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేయాలని కోరుకుంటున్నారు. దేశాన్ని రాజుల్లాగా ఏలుదామనుకుంటున్నారు' అని విమర్శించారు. తాము రిజర్వేషన్లకు వ్యతిరేకం కామని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ చెప్పిన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రపాలిత ప్రాంతం డయ్యూ డామన్‌లోని డామన్‌లో, ఒడిసాలోని కటక్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల సభల్లో రాహుల్ ప్రసంగించారు. ఎన్నికల పోరులో బీజేపీ, బీజేడీ పైకి పోరాడుతున్నట్లు కనిపిస్తున్నా.. లోపల కలిసే ఉన్నాయని ఆరోపించారు. మోదీ శత కోటీశ్వరుల కోసం పని చేస్తుంటే.. ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ కొందరి కోసమే పని చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీతో చేతులు కలిపిన బీఆర్‌ఎస్‌ను తాము అధికారంలో నుంచి దించేశామని చెప్పారు. ఒడిసాలో మే 13 నుంచి నాలుగు దశల్లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరగనున్నాయి.

రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

మాపై సోషల్ మీడియా గూండాల దుష్ప్రచారమది

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఆరెస్సెస్ రిజర్వేషన్లకు మద్దతిస్తోంది

అర్హులకు రిజర్వేషన్లు అందాలి.. అసమానతలు తొలగేవరకూ కొనసాగాలి: భాగవత్

హైదరాబాద్ సిటీ/ సరూర్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో రిజర్వేషన్లకు తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. అర్హులైన వారికి రిజర్వేషన్లు అందాలని, అసమానతలు తొలగేవరకూ అవి కొనసాగాలని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఆరెస్సెస్ రిజర్వేషన్లకు మద్దతు ఇస్తూనే ఉందని తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగించి సోషల్ మీడియా గూండాలు దుష్ప్రచారం చేసి, విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లకు సంఘ్ వ్యతిరేకం అంటూ సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. ఆదివారం ఆయన నాదర్‌గుల్‌లో 'విద్యా భారతి విజ్ఞాన కేంద్రాన్ని' చినజీయర్‌స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగవత్ మాట్లాడుతూ.. 1952లో ఒక చిన్న గదిలో 15 మంది విద్యార్థులతో ప్రారంభమైన శ్రీ సరస్వతి శిశు మందిర్

మిగతా 12వ పేజీలో...

రిజర్వేషన్ల రద్దు.. పెద్ద అబద్ధం

కాంగ్రెస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తోంది

12

కేంద్ర మంత్రి షా ప్రసంగాన్ని మార్ఫింగ్ చేశారు

అబద్ధాలే కాంగ్రెస్ గ్యారెంటీ: జి.కిషన్‌రెడ్డి

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల రద్దు అని దుష్ప్రచారం

'మత' రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్సే

మేం అధికారంలోకి రాగానే రద్దు: బండి

రుతురాజ్ షో

త్రుటిలో శతకం మిస్ । చెన్నై ఘనవిజయం

పేసర్ తుషార్‌కు నాలుగు వికెట్లు
సన్‌రైజర్స్‌కు మరో ఓటమి





తుషార్ దేశ్‌పాండే 4/27

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: కోల్‌కతా
కోల్‌కతా x ఢిల్లీ

చెన్నై: రెండు వరుస ఓటములతో డీలా పడిన చెన్నై సూపర్ కింగ్స్ అద్భుతంగా పుంజుకుంది. చెపాక్‌లో ఆల్‌రౌండ్ షోతో ఆధిపత్యం చూపుతూ సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 78 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. బ్యాటింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ (54 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 98) త్రుటిలో శతకం కోల్పోగా.. బౌలింగ్‌లో పేసర్ తుషార్ దేశ్‌పాండే (4/27) రైజర్స్ వెన్నువిరిచాడు. అటు ఎస్‌ఆర్‌హెచ్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నిరాశపరిచి, పట్టికలో నాలుగో స్థానానికి పడిపోగా.. సీఎస్‌కే మూడో స్థానానికి చేరింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 3 వికెట్లకు 212 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ (32 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 52), శివమ్ దూబే (20 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 39 నాటౌట్) రాణించారు. ఉనాద్కట్, భువనేశ్వర్, నటరాజన్‌లకు ఒక్కో వికెట్ లభించింది. ఆ తర్వాత ఛేదనలో సన్‌రైజర్స్ 18.5 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. మార్‌క్రమ్ (32), క్లాసెన్ (20) మాత్రమే ఆకట్టుకున్నారు. పతిరన, ముస్తాఫిజుర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రుతురాజ్ నిలిచాడు.

బౌలర్ల హవా: ఫోర్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన రైజర్స్ జట్టు పేసర్ తుషార్ ధాటికి పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో ఏ దశలోనూ పోటీలోకి రాలేకపోయింది. మిడిలార్డర్‌లో మార్‌క్రమ్ కాస్త పోరాడినా.. 17 పరుగుల తేడాతో చివరి ఐదు వికెట్లు కోల్పోవడం దెబ్బతీసింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ హెడ్ (13), అన్మోల్‌ప్రీత్ (0) వికెట్లతో పేసర్ తుషార్ షాకిచ్చాడు. అలాగే మరో ఓపెనర్ అభిషేక్ (15)ను సైతం తన తర్వాతి ఓవర్‌లోనే అవుట్ చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 53/3 స్కోరుతో నిలిచింది. అనంతరం సీఎస్‌కే బౌలర్లు పరుగులను పూర్తిగా నియంత్రించారు. దీంతో 7-11 ఓవర్ల మధ్య ఒక్క బౌండరీ కూడా రాలేదు. స్పిన్నర్ జడేజా తొమ్మిదో ఓవర్‌లో నితీశ్ (15) వికెట్ తీయగా, ఓపిగ్గా ఆడుతున్న మార్‌క్రమ్‌ను పేసర్ పతిరన యార్కర్‌తో బౌల్డ్ చేయడంతో రైజర్స్ కష్టాలు ఆరంభమయ్యాయి. ఈ దశలో క్లాసెన్, సమద్ (19) ఆదుకునే ప్రయత్నం చేసినా.. భారీ షాట్లు ఆడలేకపోవడంతో రన్‌రేట్ పెరిగిపోయింది. దీంతో ఒత్తిడికి లోనైన క్లాసెన్ 16వ ఓవర్‌లో సిక్సర్‌కు ప్రయత్నించి పతిరనకు చిక్కాడు. అక్కడి నుంచి వరుస ఓవర్లలో సమద్, కమిన్స్ (5), షాబాజ్ (7), ఉనాద్కట్ (1)ల వికెట్లు టపటపా కోల్పోవడంతో 18.5 ఓవర్లలోనే రైజర్స్ ఆట ముగిసింది.

రుతురాజ్-మిచెల్ అండగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రుతురాజ్, డారిల్ మిచెల్ కీలక ఇన్నింగ్స్‌తో మెరిశారు. చివర్లో శివమ్ దూబే మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అయితే రైజర్స్ బౌలర్లు చివరి రెండు ఓవర్లలో 20 పరుగులే ఇవ్వడంతో చెన్నై స్కోరు 220లోపే ముగిసింది. ఓపెనర్ రహానె (9)ను మూడో ఓవర్‌లోనే భువనేశ్వర్ అవుట్ చేశాడు. కానీ మధ్య ఓవర్లలో రుతురాజ్‌కు అండగా డారిల్ మిచెల్ నిలిచాడు. ఈ సీజన్‌లో ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్న మిచెల్ ఆరంభంలో నెమ్మదిగానే ఆడినా కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించాడు. తొలి 12 బంతుల్లో 11 రన్స్ చేసినా.. మొత్తంగా 29 బంతుల్లోనే ఐపీఎల్‌లో తొలి ఫిఫ్టీని పూర్తి చేశాడు. 27 బంతుల్లో సిక్సర్‌తో రుతురాజ్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత వరుస ఫోర్లతో చెలరేగిన మిచెల్‌ను 14వ ఓవర్‌లో ఉనాద్కట్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో రెండో వికెట్‌కు 107 పరుగుల శతక భాగస్వామ్యం ముగిసింది. ఇక ఆ తర్వాత దూబే రాకతో చెన్నై రన్‌రేట్ ఎక్కడా తగ్గలేదు. 17వ ఓవర్‌లో అతడి రెండు సిక్సర్లతో 17 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లోనూ అతడు 6,4తో మెరిశాడు. కానీ 19వ ఓవర్‌లో ఉనాద్కట్ కేవలం 8 పరుగులతో కట్టడి చేశాడు. అలాగే చివరి ఓవర్‌లో రుతురాజ్ సెంచరీ కోల్పోయినా.. ధోనీ (5 నాటౌట్) ఫోర్, దూబే సిక్సర్‌తో 12 పరుగులే వచ్చాయి.

ఐపీఎల్‌లో పరుగుల పరంగా హైదరాబాద్‌కు ఇదే అతిపెద్ద ఓటమి	ఈ లీగ్‌లో 150 మ్యాచ్‌లు గెలిచిన తొలి ప్లేయర్‌గా ఎంఎస్ ధోనీ	ఓ ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో ఎక్కువ క్యాచ్‌లు (5) పట్టిన ఫీల్డర్‌గా నబీతో సమంగా నిలిచిన మిచెల్

0 చెపాక్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడిన హైదరాబాద్

1 టీ20ల్లో ఎక్కువ (35) 200+ స్కోరు సాధించిన జట్టు చెన్నై సూపర్ కింగ్స్

2 ఒకే వేదికలో ఎక్కువ మ్యాచ్ (50)లు గెలిచిన రెండో జట్టుగా చెన్నై. వాంఖడేలో ముంబై 51 సార్లు గెలిచింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	8	5	3	0	10	0.972
చెన్నై	9	5	4	0	10	0.810
హైదరాబాద్	9	5	4	0	10	0.075
లఖ్‌నవూ	9	5	4	0	10	0.059
ఢిల్లీ	10	5	5	0	10	-0.276
గుజరాత్	10	4	6	0	8	-1.113
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	9	3	6	0	6	-0.261
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (సి) షాబాజ్ (బి) భువనేశ్వర్ 9, రుతురాజ్ (సి) నితీశ్ (బి) నటరాజన్ 98, మిచెల్ (సి) నితీశ్ (బి) ఉనాద్కట్ 52, దూబే (నాటౌట్) 39, ధోనీ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు : 9 ; మొత్తం (20 ఓవర్లలో) 212/3 ; వికెట్లపతనం :** 1-19, 2-126, 3-200 ; **బౌలింగ్ :** భువనేశ్వర్ 4-0-38-1, నితీశ్ కుమార్ 1-0-8-0, షాబాజ్ అహ్మద్ 3-0-33-0, నటరాజన్ 4-0-43-1, ఉనాద్కట్ 4-0-38-1, కమిన్స్ 4-0-49-0.

సన్‌రైజర్స్ : హెడ్ (సి) మిచెల్ (బి) తుషార్ 13, అభిషేక్ (సి) మిచెల్ (బి) తుషార్ 15, అన్‌మోల్‌ప్రీత్ (సి) మొయిన్ (బి) తుషార్ 0, మార్‌క్రమ్ (బి) పతిరన 32, నితీశ్ (సి) ధోనీ (బి) జడేజా 15, క్లాసెన్ (సి) మిచెల్ (బి) పతిరన 20, సమద్ (సి) సబ్ సమీర్ (బి) శార్దూల్ 19, షాబాజ్ (సి) మిచెల్ (బి) ముస్తాఫిజుర్ 7, కమిన్స్ (సి) మిచెల్ (బి) తుషార్ 5, భువనేశ్వర్ (నాటౌట్) 4, ఉనాద్కట్ (సి) మొయిన్ (బి) ముస్తాఫిజుర్ 2, **ఎక్స్‌ట్రాలు : 3 ; మొత్తం (18.5 ఓవర్లలో) 134 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-21, 2-21, 3-40, 4-72, 5-85, 6-117, 7-119, 8-124, 9-132 ; **బౌలింగ్ :** దీపక్ చాహర్ 3-0-22-0, తుషార్ దేశ్‌పాండే 3-0-27-4, ముస్తాఫిజుర్ 2.5-0-19-2, జడేజా 4-0-22-1, శార్దూల్ 4-0-27-1, పతిరన 2-0-17-2.

దుమ్మురేపిన ధీరజ్



ధీరజ్



దీపిక

తెలుగు ఆర్చర్‌కు స్వర్ణ, కాంస్యాలు
ఒలింపిక్ చాంపియన్ కొరియాకు భారత్ షాక్
ఆర్చరీ వరల్డ్ కప్

షాంఘై : వరల్డ్ కప్ స్టేజ్-1లో తెలుగు ఆర్చర్లు అమోఘంగా రాణించారు. జ్యోతి సురేఖ ఏకంగా హ్యాట్రిక్ స్వర్ణాలతో ఔరా అనిపిస్తే..నేడు మరో తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర పసిడి, కాంస్య పతకాలతో సత్తా చాటాడు. భారత రికర్వ్ పురుషుల జట్టు ఏకంగా ఒలింపిక్ చాంపియన్ దక్షిణ కొరియాకి షాకిచ్చి విజేతగా నిలవడం విశేషం. మిక్స్‌డ్ టీమ్‌లో ధీరజ్ జోడీ కాంస్యం అందుకోగా, వ్యక్తిగత విభాగంలో దీపికా కుమారి రజతం సాధించింది. ఆదివారం నాటి పోటీల్లో రికర్వ్ ఆర్చర్లు స్వర్ణం, రజతం, కాంస్యం సహా మూడు పతకాలు సొంతం చేసుకున్నారు. రికర్వ్ పురుషుల టీమ్ విభాగం ఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్ త్రయం 5-1తో కిమ్ ఊజిన్, కిమ్ జే డోక్, లీ ఊ సోక్‌తో కూడిన బలమైన దక్షిణ కొరియాను చిత్తు చేసి చారిత్రక బంగారు పతకం చేజిక్కించుకుంది. 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వరల్డ్ కప్ రికర్వ్ కేటగిరీలో భారత్ స్వర్ణం దక్కించుకుంది. 2010లో ఇదే షాంఘైలో జరిగిన ప్రపంచ కప్ స్టేజ్-4లో మనోళ్లు చివరిసారి పసిడి పతకాన్ని ముద్దాడారు. అలాగే ఈ విభాగంలో తిరుగులేని దక్షిణ కొరియాను మన ఆర్చర్లు మట్టికరిపించారు. జూన్‌లో అంటాల్యాలో జరిగే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి ముందు కొరియాపై గెలుపు భారత ఆర్చర్ల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయనుంది. ఈ విజయం మన ర్యాంకింగ్ పాయింట్లనూ పెంచనుంది. ఇక..రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అంకితా భక్త్ జతగా ధీరజ్ 6-0తో మెక్సికో ద్వయం వాలెన్సియా/మతియాస్‌ను ఓడించి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. రికర్వ్ మహిళల వ్యక్తిగత కేటగిరీ తుది పోరులో దీపికా కుమారి 6-0తో హాంగ్జౌ ఆసియా క్రీడల చాంపియన్ లిమ్ సిహ్ యోన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓటమితో రజత పతకంతో సరిపెట్టుకుంది. స్టేజ్-1 ప్రపంచ కప్‌ను భారత్ కాంపౌండ్, మిక్స్‌డ్ విభాగాల్లో కలిపి ఐదు స్వర్ణ, రెండు రజత, ఒక కాంస్యం సహా మొత్తం ఎనిమిది పతకాలతో ముగించింది.

క్వార్టర్స్‌లో భారత మహిళలు
ఉబెర్ కప్ బ్యాడ్మింటన్

చెంగ్డూ (చైనా) : యువ షట్లర్లతో కూడిన భారత మహిళల జట్టు ఉబెర్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఆదివారం సింగపూర్‌తో జరిగిన పోరులో మన అమ్మాయిలు 4-1తో విజయం సాధించారు. ఆసియా చాంపియన్ అయిన భారత్..తొలి పోరులో 4-1తో కెనడాను చిత్తు చేసిన విషయం విదితమే. సింగపూర్‌తో మొదటి సింగిల్స్‌లో అష్మితా చలిహా ఓడినా..దానిని నుంచి కోలుకున్న భారత్ అద్భుత ప్రదర్శన చేసింది. ఇక.. గ్రూప్ 'ఎ'లో చైనా 3-0తో కెనడాపై నెగ్గిన నేపథ్యంలో..భారత్‌తోపాటు ఆతిథ్య మహిళల జట్టుకూడా రౌండ్-8కు క్వాలిఫై అయింది. రెండు వరుస విజయాలతో ప్రస్తుతం చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో నిలిచింది. సింగపూర్‌తో.. మొదటి సింగిల్స్ మ్యాచ్‌లో 53వ ర్యాంకర్ చలిహా 15-21, 18-21తో వరల్డ్ నెం. 18 యో జియా మిన్ చేతిలో ఓడింది. అయితే డబుల్స్‌లో..జాతీయ చాంపియన్లు ప్రియ/శ్రుతి 21-15, 21-16తో హెంగ్/జిన్‌పై గెలవడంతో స్కోరు 1-1తో సమమైంది. అనంతరం రెండో సింగిల్స్‌లో ఇషా రాణి 21-13, 21-16తో ఇన్సిరా ఖాన్‌పై నెగ్గి భారత్ ఆధిక్యాన్ని 2-1కి పెంచింది. ఆపై సిమ్రన్/రితిక 21-8, 21-11తో టింగ్/జాన్‌ని చిత్తు చేయడంతో మనోళ్లు 3-1తో తిరుగులేని స్థితిలో నిలిచారు. మూడో సింగిల్స్‌లో అన్మోల్ 21-15, 21-13తో లీని ఓడించడంతో భారత్ ఆధిక్యం మరింత పెరిగింది. ఇక థామస్ కప్‌లో..డిఫెండింగ్ చాంపియన్ భారత పురుషుల జట్టు సోమవారం ఇంగ్లండ్‌ను ఢీకొంటుంది.

జాక్స్ విధ్వంసం

- అదరగొట్టిన కోహ్లీ
- బెంగళూరు 9 వికెట్ల గెలుపు
- గుజరాత్ చిత్తు



అహ్మదాబాద్: విల్ జాక్స్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్స్‌లతో 100 నాటౌట్) వీరవిహారంతో.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా రెండో విజయం సాధించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 200/3 స్కోరు చేసింది. సాయి సుదర్శన్ (49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లతో 84 నాటౌట్), షారుక్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 58) శ్రమ వృథా అయింది. ఛేదనలో బెంగళూరు 16 ఓవర్లలో వికెట్ నష్టానికి 206 పరుగులు చేసి గెలిచింది. కోహ్లీ (44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70 నాటౌట్) హాఫ్ సెంచరీ సాధించాడు. అలసటతో కొన్ని మ్యాచ్‌లకు దూరమైన మ్యాక్స్‌వెల్ మళ్లీ జట్టులోకొచ్చాడు. శతకంతో చెలరేగిన జాక్స్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

అలవోకగా బాదుతూ..: జాక్స్, కోహ్లీ రెండో వికెట్‌కు అజేయంగా 74 బంతుల్లో 166 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో బెంగళూరు సునాయాసంగా నెగ్గింది. ఛేదనలో ఓపెనర్లు కోహ్లీ, డుప్లెసి (24) ధనాధన్ ఆరంభాన్నిచ్చారు. అయితే, డుప్లెసిని కిషోర్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన జాక్స్ కుదురుకోవడానికి కొంత సమయం తీసుకొన్నా.. ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగి పోయాడు. 10 ఓవర్‌లో బౌండ్రీతో విరాట్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. టీమ్ స్కోరు వందకు చేరువైంది. చివరి 36 బంతుల్లో 53 పరుగులు కావాల్సి ఉండగా.. జాక్స్ ఒక్కసారిగా శివాలెత్తాడు. 15వ ఓవర్‌లో మోహిత్ బౌలింగ్‌లో 4,6,6,6,4తో ఏకంగా 29 పరుగుల పిండుకొన్న విల్.. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. రషీద్ వేసిన ఆ తర్వాతి ఓవర్‌లో 6,6,4,6,6,6తో 29 పరుగులు రాబట్టిన జాక్స్ ఔరా అనిపించే రీతిలో సెంచరీ మార్క్ చేరుకోవడమే కాకుండా.. మరో 24 బంతులు మిగిలుండగానే జట్టును గెలుపు గీత దాటించాడు. 15వ ఓవర్లో హాఫ్ సెంచరీని చేరుకున్న జాక్స్ 16వ ఓవర్లో సెంచరీ చేయడం చూస్తే...అతని విధ్వంసం ఏ రీతిన సాగిందో అర్ధమవుతుంది. ఓ దశలో 16 బంతుల్లో 16 పరుగులే చేసిన జాక్స్ తర్వాతి 25 బంతుల్లో 84 రన్స్ సాధించాడు.



ముందుగా షారుక్..: బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన షారుక్ ఖాన్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగా.. సాయి సుదర్శన్ తుది కంటా క్రీజులో నిలవడంతో గుజరాత్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. సుదర్శన్, షారుక్ మూడో వికెట్‌కు 45 బంతుల్లో 86 పరుగులతో ఆదుకొన్నారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్.. తొలి ఓవర్‌లోనే సాహా (5) వికెట్‌ను చేజార్చుకొంది. గిల్ (16), సుదర్శన్ జాగ్రత్తగా ఆడడంతో.. తొలి ఆరు ఓవర్లు ముగిసే సరికి గుజరాత్ 42/1తో నిలిచింది. అయితే, ఏడో ఓవర్‌లో మ్యాక్సీ బౌలింగ్‌లో గిల్ వెనుదిరిగాడు. ఈ దశలో షారుక్ రాకతో స్కోరుబోర్డు ఊపందుకొంది. అర్ధ శతకంతో ప్రమాదకరంగా మారిన షారుక్‌ను సిరాజ్ బౌల్డ్ చేసి జట్టుకు బ్రేక్ ఇచ్చాడు. అనంతరం మిల్లర్ (26 నాటౌట్)తో కలసి సుదర్శన్ 69 పరుగుల అభేద్యమైన భాగస్వామ్యం నెలకొల్పడంతో.. గుజరాత్ అనూహ్యంగా 200 మార్క్‌ను తాకింది.

2 ఐపీఎల్‌లో బెంగళూరుకు ఇది రెండో అత్యధిక ఛేదన. 2010లో పంజాబ్‌పై 204 పరుగులు స్కోరును ఛేజ్ చేసింది.


1 కేవలం 10 బంతుల్లోనే జాక్స్ 50 నుంచి 100 పరుగుల మార్క్‌ను అందుకోవడం ఐపీఎల్‌లో ఇదే ప్రథమం. అంతకుముందు గేల్ 13 బంతుల్లో ఈ ఫీట్ సాధించాడు.

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (బి) కర్ణ్ (బి) స్వప్నిల్ 5, గిల్ (సి) గ్రీన్ (బి) మ్యాక్స్‌వెల్ 16, సుదర్శన్ (నాటౌట్) 84, షారుక్ (బి) సిరాజ్ 58, మిల్లర్ (నాటౌట్) 26; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 200/3; వికెట్ల పతనం:** 1-6, 2-45, 3-131; **బౌలింగ్:** స్వప్నిల్ 3-0-23-1, సిరాజ్ 4-0-34-1, యశ్ 4-0-34-0, మ్యాక్స్‌వెల్ 3-0-28-1, కర్ణ్ శర్మ 3-0-38-0, గ్రీన్ 3-0-42-0.

బెంగళూరు: కోహ్లీ (నాటౌట్) 70, డుప్లెసి (సి/సబ్) శంకర్ (బి) సాయి కిషోర్ 24, జాక్స్ (నాటౌట్) 100; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 16 ఓవర్లలో 206/1; వికెట్ల పతనం:** 1-40; **బౌలింగ్:** అజ్మతుల్లా 2-0-18-0, సందీప్ వారియర్ 1-0-15-0, సాయి కిషోర్ 3-0-30-1, రషీద్ 4-0-51-0, నూర్ 4-0-43-0, మోహిత్ 2-0-41-0.

పాకిస్థాన్ జట్టు కోచ్‌లుగా కిర్‌స్టెన్, గిలెస్పీ



కరాచీ: పాకిస్థాన్ వన్డే, టీ20 జట్లకు గ్యారీ కిర్‌స్టెన్ (దక్షిణాఫ్రికా) కోచ్‌గా వ్యవహరించనున్నాడు. అలాగే టెస్టు ఫార్మాట్‌లో జేసన్ గిలెస్పీ (ఆస్ట్రేలియా) ఈ బాధ్యతలు తీసుకోనున్నాడు. ఇక న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన టీ20 సిరీస్‌కు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించిన అజర్ మహమూద్‌ను ఈ మూడు ఫార్మాట్లకూ అసిస్టెంట్ కోచ్‌గా నియమిస్తున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పేర్కొంది. వీరంతా రెండేళ్లపాటు పదవుల్లో ఉంటారు. వచ్చే నెల పాక్ టీమ్ ఇంగ్లండ్‌తో ఆడే నాలుగు టీ20ల సిరీస్‌కు గ్యారీ జట్టులో చేరనున్నాడు. గ్యారీ ప్రస్తుతం ఐపీఎల్‌లో గుజరాత్ జట్టుకు బ్యాటింగ్ కోచ్/మెంటార్‌గా ఉన్నాడు.



షూటింగ్‌లో మరో ఒలింపిక్ బెర్త్
స్కీట్‌లో మహేశ్వరికి రజతం

న్యూఢిల్లీ : పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ విభాగంలో భారత్‌కు మరో బెర్త్ లభించింది. దోహాలో జరిగిన షాట్‌గన్ ఒలింపిక్ చివరి క్వాలిఫికేషన్ టోర్నీ స్కీట్ విభాగంలో మహేశ్వరి చౌహాన్ రజత పతకం దక్కించుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో మహేశ్వరి 3-4తో ఫ్రాన్సిస్కా క్రొవేటో చేతిలో పరాజయంతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ రజత పతకం ద్వారా పారిస్ క్రీడల షూటింగ్ విభాగంలో భారత్‌కు 21వ బెర్త్ లభించింది. మహిళల స్కీట్‌లో మాత్రం రెండో కోటా స్థానమిది.

తొలి టీ20 మనదే
44 పరుగులతో ఓడిన బంగ్లా



రేణుక

సిల్హట్: పేసర్లు రేణుకా సింగ్ (3/18), పూజా వస్త్రాకర్ విజృంభించడంతో.. బంగ్లాదేశ్ టూర్‌లో భారత మహిళల జట్టు బోణీ చేసింది. ఆదివారం జరిగిన తొలి టీ20లో భారత్ 44 పరుగుల తేడాతో బంగ్లాపై నెగ్గింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 145/7 స్కోరు చేసింది. యాస్తిక (36), షఫాలీ వర్మ (31), హర్మన్‌ప్రీత్ (30) రాణించారు. రబియా 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో బంగ్లా ఓవర్లన్నీ ఆడి 101/8 స్కోరు మాత్రమే చేసింది. రేణుకా సింగ్ 3, పూజ 2 వికెట్లు పడగొట్టారు.

గుకేష్‌కు రూ.75 లక్షలు
- అందజేసిన సీఎం స్టాలిన్



చెన్నై (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిన దొమ్మరాజు గుకేష్‌కు రూ.75 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందజేశారు. ఇటీవల టొరంటోలో జరిగిన క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన ఈ చెన్నై టీనేజర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు క్వాలిఫై అయిన పిన్నవయస్సు ఆటగాడిగా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. గుకేష్ తన తల్లిదండ్రులతో కలిసి సీఎం క్యాంప్ కార్యాలయంలో స్టాలిన్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా గుకేష్‌ను శాలువతో సత్కరించి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం తరపున అతడికి రూ. 75 లక్షలతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో క్రీడామంత్రి ఉదయనిధి కూడా పాల్గొన్నారు.

'సమూహ' సదస్సుపై ఏబీవీపీ దాడి!

- కేయూ క్యాంపస్‌లో రగడ
- సభావేదికపైకి దూసుకొచ్చి బ్యానర్ల చించివేత
- అసభ్యపదజాలంతో రచయితలపై దూషణ
- పలువురు రచయితలపై దాడి



సదస్సును అడ్డుకుంటున్న ఏబీవీపీ శ్రేణులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 28: హనుమకొండ, కాకతీయ విశ్వవిద్యాలయంలోని సెనెట్‌హాల్‌లో ఆదివారం ఘర్షణ వాతావరణం నెలకొంది. 'లౌకిక విలువలు- సాహిత్యం' అనే అంశంపై సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సును ఏబీవీపీ కార్యకర్తలు, పలువురు విద్యార్థులు అడ్డుకున్నారు. సదస్సు జరుగుతుండగా సెనెట్‌హాల్‌లోకి దూసుకొచ్చి రచయితల ప్రసంగాలను అడ్డుకున్నారు. సదస్సు నిర్వహణకు ఎవరు అనుమతి ఇచ్చారంటూ నిర్వాహకులను నిలదీశారు. సభావేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్లను చించేశారు. ఈ క్రమంలో సమూహ కోకన్వీనర్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, నరేశ్‌కుమార్ సూఫీ, కవయిత్రి మెర్సీ మార్గరేట్‌ను అసభ్య పదజాలంలో దూషించి వాగ్వాదానికి దిగారు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు ఏబీవీపీ శ్రేణులను అక్కడి నుంచి బయటికి పంపించారు. ఆపై, సదస్సును ముగించుకుని రచయితలు బయటికి వస్తుండగా అక్కడే వేచి ఉన్న ఏబీవీపీ శ్రేణులు మరోమారు వారిని అడ్డగించారు. రచయితల వద్ద ఉన్న పుస్తకాలను గుంజుకున్నారు. సమూహ బాధ్యులు నరేశ్‌కుమార్ సూఫీ మెడ పట్టి లాగారు, చొక్కాను గుంజారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో పసునూరి రవీందర్, నరేష్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, ఏబీవీపీ శ్రేణులు చేసిన ఈ దాడిని సమూహ సదస్సు కో కన్వీనర్లు ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, మెట్టు రవీందర్ తీవ్రంగా ఖండించారు. ఇది భావ ప్రకటన స్వేచ్ఛపై జరిగిన దాడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సదస్సులోకి చొరబడిన ఫాసిస్టు మూక అల్లరి సృష్టించిందని, దాడికి పాల్పడి ముగ్గురు కవులను గాయపర్చిందని తెలిపారు. దేశంలో లౌకిక విలువలను కాపాడుకోవాలని, రాజ్యాంగ స్ఫూర్తితో సదస్సు జరుపుతుండగా ఫాసిస్టు మూక దాడులకు దిగడం భావ ప్రకటన స్వేచ్ఛ మీద దాడి చేయడమేనని పేర్కొన్నారు. ప్రగతిశీల ఉద్యమాలకు కేంద్రమైన వరంగల్‌లో కవులపై దాడి జరగడాన్ని ఖండించాలని కోరారు. ఎన్నికల్లో ఫాసిస్టు శక్తులను అడ్డుకోవాలని కోరారు.

లౌకిక శక్తులను అడ్డుకోవడం సరికాదు


కలిసి మెలిసి జీవించే లౌకిక శక్తులను అల్లరి మూకలు అడ్డుకోవడం సరైంది కాదు. కాకతీయ యూనివర్సిటీ వేదికగా సమూహ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆదివారం పాల్గొన్న కవులు, రచయితలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులను ఏబీవీపీ విద్యార్థులు అప్రజాస్వామికంగా అడ్డుకుని సదస్సు పోస్టర్లను చించడం, భౌతిక దాడులకు దిగడాన్ని అందరూ ఖండించాలి.

- పసునూరి రవీందర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

దాడులకు పాల్పడడం సమంజసమేనా?

భావజాలంపై చర్చించే ప్రజాస్వామ్యవాదులపై దాడులకు పాల్పడం ఎంత వరకు సమంజసం. రచయితలు, కవులు, ప్రజాస్వామికవాదులపై దాడులను ఖండించాలి. భావజాలంపై స్వేచ్ఛాయుత చర్చలు చేయాలే కానీ దాడులకు దిగడం, సదస్సులో పోస్టర్లను చించడం మంచిదికాదు. నన్ను అసభ్య పదజాలంతో దూషించారు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలి.

- మెర్సీ మార్గరేట్, ప్రముఖ రచయిత్రి



సాయిచరణ్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

శభాష్ సాయిచరణ్

- సాహస బాలుణ్ని అభినందించిన సీఎం
- శాలువా కప్పి సన్మానించిన రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/నందిగామ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలోని అలెన్ ఔషధ పరిశ్రమలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో తెగువ చూపి, ఆరుగురు కార్మికులను ప్రమాదం నుంచి కాపాడిన పదో తరగతి విద్యార్థి సాయిచరణ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ఉదయం సాయిచరణ్‌ను కుటుంబ సమేతంగా సీఎం నివాసానికి తీసుకెళ్లి, మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, సాయిచరణ్‌కు శాలువా కప్పి సన్మానించారు. అతడి ధైర్యసాహసాలను మెచ్చుకున్నారు. సాయిచరణ్ తెగింపు, ధైర్య సాహసాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని చెప్పారు. "ఈ నెల 26న హైదరాబాద్ శివారులో ఒక పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదం నుంచి ఆరుగురిని కాపాడిన బాలుడు సాయిచరణ్ ఈ రోజు నన్ను కలిశాడు. ఎంతో సాహసోపేతంగా వ్యవహరించిన సాయిచరణ్ ధైర్య సాహసాలను అభినందించడం జరిగింది. ఆ బాలుడికి మంచి భవిష్యత్ ఉండాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ సీఎం రేవంత్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. సీఎంను కలిసిన వారిలో సాయిచరణ్ తల్లితండ్రులు రేణుక, వెంకటేష్ ఎంపీటీసీలు కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు ఉన్నారు.

శంషాబాద్ విమానాశ్రయం వద్ద చిరుత కలకలం!

- ఓ ఎయిర్ క్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ వద్ద సంచారం
- బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ అధికారులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద చిరుతపులి కలకలం సృష్టించింది. విమానాశ్రయం పరిధిలో ఓ చిరుత సంచరిస్తున్నట్టు అధికారులు శనివారం సాయంత్రం గుర్తించారు. అటవీశాఖ, ఎయిర్‌పోర్టు అధికారుల కథనం ప్రకారం.. ఎయిర్‌పోర్టు పరిధిలోని ఓ ఎయిర్ క్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ వద్ద శనివారం సాయంత్రం గస్తీ తిరుగుతున్న సమయంలో పెట్రోలింగ్ సిబ్బందికి చిరుత పులి కనిపించింది. దీంతో అప్రమత్తమైన విమానాశ్రయ అధికారులు వెంటనే అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. చిరుత కనిపించిన ప్రాంతంలో అటవీ శాఖ సిబ్బంది గాలించగా చిరుత జాడ తెలియలేదు. ఈ క్రమంలో విమానాశ్రయ పరిధిలోని గొల్లపల్లి ప్రాంతంలో ఆదివారం ఉదయం చిరుతపులిని చూశామని ఆ గ్రామ ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడ చిరుత పులి పాదముద్రలను అధికారులు గుర్తించి.. విమానాశ్రయం, పరిసర ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. చిరుతను బంధించేందుకు ఎయిర్‌పోర్టు పరిసరాల్లో బోన్లు ఏర్పాటు చేశారు. చిరుత జాడను గుర్తించేందుకు సీసీ కెమెరాల పుటేజీని కూడా పరిశీలిస్తున్నారు. చిరుత సంచారం నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సమీపంలోని గొల్లపల్లి, చిన్నగోల్కొండ, బహదూర్‌గూడ, సంఘీగూడ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులోకి చిరుత వచ్చిందనే వార్త గతంలోనూ ఓసారి కలకలం రేపింది. అయితే అది చిరుత కాదు అడవి పిల్లి అని తేల్చిన అధికారులు అందుకు సంబంధించిన ఫొటోలను కూడా విడుదల చేశారు.



చిరుతను బంధించేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద బోను ఏర్పాటు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

నేడు, రేపు వడగాలులు!

- ఇవ్వాళ కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు
- వడదెబ్బతో ముగ్గురి మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో రెండ్రోజుల పాటు వడగాలులు వీచే అవకాశముందని.. సోమ, మంగళవారాల్లో 41-46 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో సోమవారం వడగాలులు వీచే అవకాశముందని వివరించింది. ఈ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే కొన్ని జిల్లాల్లో ఆ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లిలో అత్యధికంగా 45.4 నమోదవగా.. దామరచర్ల, త్రిపురారం, కట్టంగూరు, హాలియా, నాంపల్లి మండలాల్లో 45 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రత రికార్డయింది. ఇక ములుగు జిల్లా మంగపేట, భద్రాద్రి జిల్లా అశ్వాపురంలో 45.3, భూపాలపల్లి జిల్లా కొత్తపల్లెగోరి, ములుగు జిల్లా ధర్మవరంలో 45.2, వనపర్తి జిల్లా పనగల్‌లో 45.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, రాష్ట్రంలో వడదెబ్బతో ముగ్గురు చనిపోయారు.

కేంద్ర సాహిత్య అకాడమీకి
చలనచిత్ర పురస్కారం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీకి మణిపూర్ రాష్ట్ర చలనచిత్ర పురస్కారం లభించింది. సుప్రసిద్ధ మణిపురి రచయిత ప్రకాశ్ సింగ్ జీవిత సాహిత్యాలపై అకాడమీ రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రానికి ఉత్తమ జీవిత చరిత్ర, కళా సాంస్కృతిక చిత్రాల విభాగంలో ఈ అవార్డు అందుకొంది. ఇంఫాల్‌లో అత్యంత వైభవంగా జరిగిన మణిపూర్ రాష్ట్ర చలనచిత్ర పురస్కారాల మహోత్సవంలో అక్కడి రాష్ట్ర గవర్నర్ అనుసూయా ఉయికే.. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి. డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. కాగా, సాహిత్య అకాడమీ డాక్యుమెంటరీకి దర్శకత్వం వహించిన ప్రముఖ రచయిత ఆరిబమ్‌శర్మకు ఉత్తమ డైరెక్టర్ అవార్డు, చోంగ్ తమ్ కమలాకు ఉత్తమ వాయిస్ ఓవర్ అవార్డును స్వీకరించారు. వివిధ భారతీయ భాషలకు చెందిన సాహితీ ప్రముఖుల జీవన ప్రస్థానంపై సాహిత్య అకాడమీ ఇప్పటివరకు 172 డాక్యుమెంటరీలు నిర్మించింది. అయితే అకాడమీ డాక్యుమెంటరీకి ఒక రాష్ట్ర ప్రభుత్వం తరపున చలనచిత్ర పురస్కారం దక్కడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.



శ్రీవారి సేవలో
తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్ జ్యుడిషియల్ మెంబర్ జస్టిస్ పుష్ప సత్యనారాయణ ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు.

200లోపు ఖర్చుతో..
ఎట్నుంచైనా ఎయిర్‌పోర్టుకు!

మెట్రో రైలులో సాఫీగా ప్రయాణం మొదటి దశ కారిడార్లతో అనుసంధానంగా నాగోల్-శంషాబాద్ లైన్

- మియాపూర్, రాయదుర్గం, జేబీఎస్.. 3 కారిడార్ల ద్వారా విమానాశ్రయానికి



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని ఇన్నర్ రింగ్‌రోడ్‌లో.. ఎక్కడి నుంచైనా రూ.200లోపు ఖర్చుతో మెట్రోలో శంషాబాద్‌కు వెళ్లేలా హెచ్ఎంఆర్ఎల్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేలా 29 కి.మీ. మేర నిర్మించనున్న మెట్రోలైన్‌ను.. ఇప్పటికే అందుబాటులో ఉన్న మొదటి మూడు దశల కారిడార్లు- మియాపూర్-ఎల్బీనగర్, రాయదుర్గం-నాగోల్, జేబీఎస్-ఎంజీబీఎస్(ఓల్డ్‌సిటీ పనులు జరుగుతున్నాయి)తో అనుసంధానం చేయాలని నిర్ణయించారు. దీనివల్ల.. ప్రయాణికులు మొదటి దశలోని ఏ మెట్రో స్టేషన్‌లో రైలెక్కినా.. ఎయిర్‌పోర్టుకు చేరుకోవచ్చు. అందుకు అనుగుణంగా అధికారులు రెండో దశలోని మెట్రో రూట్‌మ్యాప్‌ను ఖరారు చేశారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా..

ఎయిర్‌పోర్టు మెట్రో లైన్‌లో భాగంగా ఇతర స్టేషన్లను కూడా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో చాంద్రాయణగుట్ట స్టేషన్ ప్రాధాన్యతను సంతరించుకోనుంది. ఈ స్టేషన్‌లో కాన్‌కోర్స్ లెవల్స్‌లో ప్లాట్‌ఫారాలను అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న మూడు కారిడార్లు ఇన్నర్ రింగ్ రోడ్డు లోపలే ఉండడంతో.. ఏ ప్రాంతం నుంచైనా నేరుగా ఎయిర్‌పోర్టుకు ప్రయాణించే సదుపాయాన్ని కల్పించడం సులభతరమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఒక్క హైదరాబాద్, జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రయాణికులే కాకుండా.. ఇతర జిల్లాల నుంచి వచ్చే వారికీ ఎయిర్‌పోర్టు ప్రయాణం సమయం, ఖర్చును ఆదా చేస్తుందని వివరిస్తున్నారు. ఉదాహరణకు విజయవాడ, నల్లగొండ వంటి ప్రాంతాల నుంచి వచ్చేవారు ఎల్బీనగర్‌లో ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్కొచ్చు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్ వైపు నుంచి వచ్చేవారు నేరుగా జేబీఎస్ మెట్రో ద్వారా సేవలు పొందొచ్చు. కాగా.. ఎయిర్‌పోర్టు మెట్రో టికెట్ ప్రయాణ దూరాన్ని బట్టి గరిష్ఠంగా రూ.200గా ఉంటుందని అధికారులు తెలిపారు.

ఇదీ.. అధికారుల ప్రణాళిక..!

రెండో దశలో మొత్తం ఆరు కారిడార్లలో 70 కి.మీ. మేర మెట్రోలైన్ పనులను ప్రతిపాదించారు. ఇందులో మొదటి దశలో పూర్తయిన జేబీఎస్-ఎంజీబీఎస్ లైన్‌కు మిగిలిన పని(ఫలక్‌నుమా వరకు 5.5కి.మీ)ని పూర్తి చేస్తారు. అంతేకాకుండా.. ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట జంక్షన్ వరకు(1.5 కి.మీ) పనులను రెండో దశలో కొత్తగా చేర్చారు. ఈ లైన్ పూర్తయితే..ప్రయాణికులు జేబీఎస్-చాంద్రాయణగుట్ట కారిడార్‌లో ఏ స్టేషన్‌లో మెట్రో ఎక్కినా.. ఎయిర్‌పోర్టుకు చేరుకోవచ్చు. ఇందుకోసం చాంద్రాయణగుట్ట స్టేషన్‌ను అమీర్‌పేట్ ఇంటర్‌చేంజ్(రెడ్‌లైన్) మాదిరిగా తీర్చిదిద్దనున్నారు. అదేవిధంగా.. రాయదుర్గం-నాగోల్ కారిడార్ ప్రయాణికులు కూడా.. నాగోల్-ఎయిర్‌పోర్ట్ కొత్త కారిడార్ మీదుగా విమానాశ్రయానికి చేరుకునే వీలుంటుంది.

ప్రభుత్వంపైనా భారం తక్కువే!

నిజానికి గత బీఆర్ఎస్ సర్కారు కూడా రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టుకు 31 కి.మీ. మేర మెట్రో రైల్ పనులను ప్రతిపాదించింది. అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రూట్‌ను రద్దు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా అధికారులతో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఐటీ కారిడార్‌లో మెట్రో కోసం భూసేకరణకు భారం తడిసి మోపెడవుతుందని సీఎం భావించారు. అందుకే.. నాగోల్-చాంద్రాయణగుట్ట-ఎయిర్‌పోర్టు మార్గాన్ని ఎంచుకున్నారు. పైగా.. రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు మార్గం వల్ల కేవలం ఐటీ కారిడార్ పరిసరాల్లోని ప్రయాణికులకే ఉపయుక్తంగా ఉంటుందనే అభిప్రాయాలున్నాయి. నిజానికి ఈ ప్రాంతాల వారు ఎక్కువగా సొంత వాహనాల్లోనే ఔటర్ మీదుగా ఎయిర్‌పోర్టుకు వెళ్తుంటారు. దాంతో మెట్రోకు పెద్దగా ఆదరణ ఉండకపోవచ్చని రేవంత్ సర్కారు భావించినట్లు తెలుస్తోంది. నాగోల్-ఎయిర్‌పోర్టు కారిడార్‌తో అన్ని ప్రాంతాల వారికీ మెట్రోసేవలు అందుబాటులో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఓల్డ్‌సిటీ వంటి ప్రాంతాల నుంచి కూడా నిత్యం విదేశాలకు వెళ్తుంటారని, అలాంటి వారికి కొత్త కారిడార్ ఉపయుక్తంగా ఉంటుందని వివరిస్తున్నారు.

పెళ్లికి నిరాకరించారని ప్రేమ జంట ఆత్మహత్య

- సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో ఘటన



సంజయ్, నాగజ్యోతి (ఫైల్)

ఆత్మకూరు(ఎస్), ఏప్రిల్ 28: ప్రేమ పెళ్లికి నిరాకరించటంతోపాటు భౌతిక దాడులకు పాల్పడుతుండటంతో మనస్తాపంతో ఓ జంట ఆత్మహత్య చేసుకుంది. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండలం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన గుండగాని సంజయ్(25), దాని ఆవాస గ్రామం కృష్ణ సముద్రం (డబుల్ బెడ్ రూమ్ కాలనీ)లో ఉండే సల్లగండ్ల నాగజ్యోతి(24) ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం గతంలోనే అమ్మాయి ఇంట్లో తెలియగా... ఆమె తండ్రి శ్రీను పెళ్లికి నిరాకరించాడు. ఈ నేపథ్యంలో నాగజ్యోతి తరపు బంధువులు సంజయ్‌పై దాడి చేశారు. దీంతో సంజయ్, నాగజ్యోతి శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. తమ ఆత్మహత్యకు కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై నాగజ్యోతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. సల్లగండ్ల శ్రీను (నాగజ్యోతి తండ్రి), సల్లగండ్ల అజయ్, మల్లయ్య, శ్రీను, ఉప్పలయ్య అలాగే బెల్లంకొండ నారాయణ, ఆరె లతారెడ్డిల పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాగజ్యోతి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. సంజయ్‌కి తండ్రి లేడు. తల్లే కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. నాగజ్యోతి ఎస్సీ(మాదిగ)కాగా, సంజయ్ బీసీ(గౌడ).

కీసర డీఈపై సస్పెన్షన్ వేటు

- ఓ మాజీ మంత్రి హాజరైన కార్యక్రమంలో పవర్ కట్
- అనుమతిలేకుండా ఎల్‌సీ జారీ చేయడంపై చర్యలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అనుమతిలేకుండా ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) ఇచ్చారంటూ కీసర డీఈని విద్యుత్‌శాఖ అధికారులు సస్పెండ్ చేశారు. నాగారంలో అనుమతి లేకుండా ఎల్‌సీ ఇవ్వడంతో శనివారం ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తింది. అదే సమయంలో ఓ మాజీమంత్రి హాజరైన కార్యక్రమంలో విద్యుత్ సరఫరా లేకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై విచారణ చేపట్టిన డిస్కం అధికారులు అనుమతి లేకుండా ఎల్‌సీ తీసుకొని పనులు చేస్తున్నట్లు గుర్తించి డీఈపై చర్యలు తీసుకున్నారు. కాగా, మేడ్చల్‌జోన్ పరిధిలోని మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్లలో కొంతమంది అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. వారిపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

20 రోజులు కూడా జరగలేదు!

2023లో తెలంగాణ, ఏపీ అసెంబ్లీ సమావేశాల తీరిదీ.. ఏడు రాష్ట్రాల్లో ఆరు నెలలకు పైగా కొనసాగిన సమావేశాలు

- 500కి పైగా బిల్లులు, రూ.53లక్షల కోట్లకు పైగా బడ్జెట్లకు ఓకే
- పీఆర్ఎస్ఎల్ లెజిస్లేటివ్ సంస్థ నివేదికలో గణాంకాలు వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో 2023 అసెంబ్లీ సమావేశాలు పట్టుమని 20 రోజులు కూడా జరగలేదు. ఈ విషయాన్ని తాజాగా విడుదలైన పీఆర్ఎస్ఎల్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అనే మేధో సంస్థ నివేదిక వెల్లడించింది. దేశ వ్యాప్తంగా గతేడాది అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు సగటున 22 రోజుల పాటు సమావేశమయ్యాయి. ఈ సమావేశాలు జరిగిన సగటు కాలవ్యవధి 5 గంటలుగా నమోదైంది. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒక్కసారైనా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి. గతేడాది దేశంలోని ఏడు రాష్ట్రాలు ఆరు నెలలకు పైగా సమావేశాలను వాయిదా వేయకుండా, సెషన్ల మధ్య సుదీర్ఘ విరామంతో నడిపాయి.

నివేదికలోని కొన్ని కీలక అంశాలివీ...

- గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ అత్యధికంగా 41 రోజులు, పశ్చిమ బెంగాల్ 40, కర్ణాటక అసెంబ్లీ 39 రోజులు సమావేశమయ్యాయి. ఏపీ, హరియాణా, మధ్యప్రదేశ్, పంజాబ్, తెలంగాణ అసెంబ్లీలు 20రోజుల కంటే తక్కువగా, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, ఉత్తరాఖండ్‌లో 10 రోజుల కంటే తక్కువ సమయం మాత్రమే జరిగాయి.
- ఢిల్లీలో మార్చి నుంచి డిసెంబరు వరకూ 14 సిటింగ్‌లతో ఒకే సెషన్ కొనసాగింది.
- మార్చి నుంచి అక్టోబరు వరకూ 10 సిటింగ్‌లతో అసెంబ్లీ సెషన్ నిర్వహించారు. బడ్జెట్ సమావేశాలను గవర్నర్ పిలవలేదంటూ 2023 ఫిబ్రవరిలో పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.
- రాజస్థాన్‌లో అసెంబ్లీ సమావేశాలు జనవరి నుంచి ఆగస్టు వరకూ కొనసాగాయి. 2020, 2021లలో రాజస్థాన్ అసెంబ్లీ సెషన్ జనవరి నుంచి డిసెంబరు వరకూ కొనసాగడం విశేషం.
- పశ్చిమ బెంగాల్‌లో జూలైలో ప్రారంభమైన సెషన్‌ను 2024 మార్చి వరకూ వాయిదా వేయలేదు. రాష్ట్ర బడ్జెట్‌ను ఆమోదించడానికి ఫిబ్రవరిలో నిర్వహించిన సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం కాలేదు.
- సిక్కిం, తమిళనాడు, తెలంగాణల్లో ఏడాదికి పైగా సమావేశాలు కొనసాగాయి. సిక్కింలో 2022 మార్చిలో ప్రారంభమైన సమావేశాలు 2023 ఏప్రిల్‌లో వాయిదా పడ్డాయి. తెలంగాణలో 2021 సెప్టెంబరు నుంచి 2023 ఆగస్టులో సభా కాలం ముగిసే వరకూ ఒకే సెషన్ కొనసాగింది.
- సమావేశాల సంఖ్య తక్కువైనప్పటికీ 2023లో 500కి పైగా బిల్లులను, రూ.53 లక్షల కోట్లకు పైగా బడ్జెట్లను రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించాయి.
- అసెంబ్లీల్లో ప్రవేశపెట్టిన బిల్లుల్లో 44 శాతం ఒక్కరోజులోనే ఆమోదం పొందాయి. గుజరాత్, ఝార్ఖండ్, మిజోరాం, పుదుచ్చేరి, పంజాబ్ అసెంబ్లీలు ప్రవేశపెట్టిన రోజు లేదా మరుసటి రోజే అన్ని బిల్లులను ఆమోదించాయి.
- కేరళ, మేఘాలయ అసెంబ్లీలు 90శాతానికి పైగా బిల్లులను ఆమోదించడానికి ఐదు రోజులకు పైగా సమయం తీసుకున్నాయి.
- అన్ని రాష్ట్రాల్లో కలిపి 59 శాతం బిల్లులకు సగటున నెల రోజుల్లోపే గవర్నర్ ఆమోదం లభించింది. బిహార్, గుజరాత్, హరియానా, యూపీ సహా ఏడు రాష్ట్రాల్లో నెల రోజుల్లోపే అన్ని బిల్లులు ఆమోదం పొందాయి.
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రెండు నెలలకు కూడా అత్యధిక శాతం బిల్లులు ఆమోదం పొందని రాష్ట్రాలు... అసోం (80%), నాగాల్యాండ్ (57%), జార్ఖండ్ (50%), పశ్చిమ బెంగాల్ (50%).
- పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో బిల్లు పాస్ అయిన తర్వాత ఆమోదం పొందడానికి సగటున 92 రోజులు పట్టగా, అసోం- 73 రోజులు, జార్ఖండ్- 72 రోజులు, కేరళ-67 రోజులు, హిమాచల్‌ప్రదేశ్-55 రోజులతో ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి.
- బిల్లులకు ఆమోదం తెలపడంలో గవర్నర్ జాప్యం చేయడాన్ని 2023 నవంబరులో కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తమిళనాడు, తెలంగాణ ప్రభుత్వాలు కూడా ఇదే అంశంపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి.

తనిఖీల్లో రూ. 63 కోట్ల నగదు పట్టివేత

- మొత్తం రూ.104 కోట్ల విలువైన నగదు, లిక్కర్, వస్తువుల సీజ్
- లైసెన్స్ లేని 14 గన్‌లు స్వాధీనం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ఆదేశం మేరకు కోడ్ అమల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వాహన తనిఖీలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.104 కోట్ల విలువైన నగదు, లిక్కర్, డ్రగ్స్, వస్తువులను సీజ్ చేసినట్లు పోలీసు శాఖ వెల్లడించింది. ఈ మేరకు డీజీపీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పోలీసు విభాగాలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 63,41,66,697 రూపాయల నగదును సీజ్ చేశామని, రూ.5,38,12,383 విలువైన లిక్కర్, రూ.7,12,31,687 విలువైన డ్రగ్స్, రూ.21,34,75,681 విలువైన బంగారం, మెటల్ వస్తువులు, రూ.6,91,88,423 విలువైన ఇతర వస్తువులు కలిపి మొత్తం విలువ రూ.104,18,76,091 ఉన్నట్లు వారు వెల్లడించారు. అదేవిధంగా తమ తనిఖీల్లో లైసెన్స్ లేని 14 గన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఎల్‌నినో బలహీనం

- మే తొలి వారానికి తటస్థ పరిస్థితులు!
- జూలై నెలాఖరుకల్లా పూర్తిస్థాయి లానినా
- నైరుతి రుతుపవనాలకు అనుకూలం
- ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ విశ్లేషణ



విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అనేక దేశాల్లో కరువు, ఎండలు, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల నమోదుకు కారణమైన ఎల్‌నినో చివరి దశకు చేరుకుంది. గతేడాది అక్టోబరు నాటికి తీవ్రస్థాయికి చేరిన ఎల్‌నినో తర్వాత క్రమేపీ బలహీనపడుతూ వస్తోంది. వచ్చే నెల తొలి వారం నాటికి తటస్థ పరిస్థితులకు చేరుకోనుంది. ఈ విషయాన్ని అమెరికా వాతావరణ అంచనా కేంద్రం తాజా నివేదికలో పేర్కొంది. ఎల్‌నినో కథ ముగిసిందని ఆస్ట్రేలియా వాతావరణ శాఖ కూడా వెల్లడించింది. అటు ఆస్ట్రేలియా, ఇటు అమెరికా వాతావరణ శాఖల నివేదికలను భారత్‌కు చెందిన ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ విశ్లేషించి తాజాగా నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం జూలై తర్వాత పూర్తిస్థాయి లానినా పరిస్థితులు ఏర్పడనున్నాయి.

నైరుతి సీజన్‌లో మంచి వర్షాలు

పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలను అంచనా వేసే సూచిక నినో (ఓషియానిక్ నినో ఇండెక్స్) 3.4 రాబోయే రెండు వారాల్లో 0.5 డిగ్రీలు అంతకంటే తక్కువకు చేరుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అదేవిధంగా 'సదరన్ ఆస్లేషన్ ఇండెక్స్' కూడా దాదాపు ఇలాంటి అంచనాకు వచ్చింది. ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో పవనాలు సాధారణంగా ఉంటాయని అమెరికా వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో మే తొలి వారంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులకు చేరుకుంటుందని, దీని ప్రభావంతో భారత్‌లో నైరుతి రుతుపవనాల సమయంలో మంచి వర్షాలు కురుస్తాయని స్కైమెట్ పేర్కొంది. అసంగతమైన (ప్లస్ ఆర్ మైనస్‌ను లెక్కించే ఎనామిలిస్) సముద్ర ఉష్ణోగ్రతలకు సంబంధించి నినో 3.4 సూచిక ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు గల మూడు నెలల కాలంలో 'ప్లస్ 1.52 డిగ్రీలు సెల్సియస్' ఉండగా మార్చి ఒక్క నెలలో ప్లస్ 1.24కు తగ్గింది. ఇది ఈనెల 22 నాటికి మరింత తగ్గి ప్లస్ 0.7కు చేరుకుంది. వచ్చే నెల తొలి వారంలో ఎల్‌నినో పూర్తిగా బలహీనపడి తటస్థ పరిస్థితులకు చేరుకుంటుందని అంచనా వేసింది. ఇదిలావుండగా ప్రస్తుతం క్షీణదశలో ఉన్న ఎల్‌నినో వచ్చేనెల నాటికి తటస్థ పరిస్థితులకు చేరుకున్నా వేసవి సీజన్‌లో దేశంలో అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ రిటైర్డు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. అయితే పసిఫిక్ మహాసముద్రంలో మారిన పరిస్థితుల ప్రభావంతో ఆ దిశ నుంచి వచ్చే చల్లని గాలులతో నైరుతి ఆశాజనకంగా ఉంటుందన్నారు.

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాల కోసం వ్యాసాలు

తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం మొదలైన అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్తు రూపొందించి ప్రచురిస్తున్న జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాల పరంపరలో మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాల సంపుటాలకు వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. ప్రధానంగా జిల్లా నైసర్గిక స్వరూపం, జిల్లా ప్రాచీన ఆధునిక చరిత్ర సంస్కృతి, పురావస్తు కట్టడాలు, సంగీత నృత్య నాటక చిత్రలేఖన శిల్ప కళల వికాసం, పద్యం, గేయం, వచన కవిత్వం, కథ, నవల, విమర్శ, అనువాదం, పరిశోధన, బాలసాహిత్యం, పత్రికలు, జానపద కళలు, తెలంగాణ ఉద్యమంలో జిల్లా కవులు కళాకారుల పాత్ర, విద్యారంగం, పరిశ్రమలు, వ్యవసాయం, సాగు తాగునీటి పథకాలు, పర్యాటక ప్రదేశాలు, ప్రాచీన ఆలయాలు జాతరలు, జానపద విజ్ఞానం, జిల్లాకు చెందిన సాహిత్య సాంస్కృతిక సంస్థలు, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, పండితులు, కళాకారులు, క్రీడారంగం... ఈ అంశాలపైనా, అంతేకాకుండా ఆ జిల్లాకు మాత్రమే ప్రత్యేకమైన ఇతర అంశాలపైనా వ్యాసాలు రాయాలి. ఆసక్తి ఉన్నవారు 9441046839 నెంబరులో గానీ rsuryaprakashrao@gmail.com మెయిల్ ద్వారా గానీ సంప్రదించాలి.

రాయారావు సూర్యప్రకాశరావు



యుద్ధ విరామం

నువ్వు నేను ఒకే క్షితిజ రేఖపై ఉన్నామంటావు
అందరం సోదరులం అనే మాట నీటిలో రాసావని తెలీలేదు.
ఆప్యాయంగా కౌగిలించావనే అనుకున్నా
వెనుక నెత్తురోడుతూ అడుగులు వేస్తున్న నా నీడను చూసేవరకు.

సరిహద్దులు కాలుదువ్వుతుంటే
లోపల కత్తులు, క్షిపణులు పోటాపోటీగా తయారవుతున్నాయి.

ఆధిపత్యపు కాన్సర్
అడుగడుగుకో భాగాన్ని ఆక్రమిస్తోంది
ఎర్రని కణజాలాన్ని విస్తరిస్తూ.

ఆకలి, నిద్ర కలుసుకునేలోపు
తెగిపడ్డ దేహాలు వాటిని ఎడం చేస్తున్నాయి

దేహాల డంపింగ్ యార్డులు
ఎర్రటి నేలలు
కొత్త రోదనాగీతం ఆలపిస్తుంటే
రాబందులు దావత్ చేసుకుంటున్నాయి.

అరిచి అరిచి గొంతు పెగుల్చుకున్న
శాంతి మంత్రాలు తాత్కాలిక
ఉపశమనపు గుళికలయ్యాయి.
యుద్ధకాంక్ష కాస్త విరామం ప్రకటించింది.

రాధకృష్ణ కర్రి
99519 16499

నిఘంటుకార సింహం

అమరం అంటే నామలింగాను శాసనం అనే నిఘంటువు. దీనికే అమరం/ అమరకోశం అని ప్రసిద్ధి. ఇది కేవలం నిఘంటువే కాదు, Thesarus కన్నా ఎన్నో రెట్లు ఉపయోగకరమైనది. దీని రచయిత అమరసింహుడు. ఈయన బౌద్ధుడు.

కోశాలన్నిటిలోనూ అమరకోశం అత్యంత దీప్తితో వెలుగుతున్నది. దానికి అమరసింహుడు అవలంబించిన వర్గీకరణ వ్యవస్థ, అమరంలో తొక్కిన నూతన మార్గాలు కారణం. అతని భాష్య మర్మజ్ఞత పండితలోకంలో అతడికి అగ్ర తాంబూలం ఇప్పించింది. అనంతమైన శబ్దరాశి లోంచి వాఙ్మయంలో తరచుగా వాడుకలో వున్న పదాల్ని ఎన్నుకోవడంలో అతని నిశిత దృష్టి సైతం అతడి కోశాన్ని సార్వజనీనం చేసింది. అమరకోశం కోశక్షేత్రంలో వటవృక్షమై నిలిచింది.


ఇంద్రశ్చంద్రః కాశకృత్స్నాపిశలీ శాకటాయనః
పాణిని అమర జైనేంద్రాః జయంతి అష్టాది శాబ్దికాః

- అనే శ్లోకాన్ని బట్టి అమరసింహుడు ప్రసిద్ధులైన శాబ్దికులలో ఒకడని తెలుస్తోంది. పాణిని, కాతకృత్స్నుడు లాంటి వాళ్ళ లాగా ప్రత్యేకంగా వ్యాకరణ శాస్త్రం నిర్మించినట్టు కనపడ్డం లేదు. కాగా, అతని నామలింగానుశాసనమే అతణ్ణి ప్రామాణిక శాబ్దికుణ్ణి చేసింది. ఇది సిద్ధ శబ్ద భాండాగారాన్ని పఠితలకు ఇచ్చి, వాళ్ళకు భాషా వ్యాకరణ పాటవాన్ని కలిగిస్తున్నది. వ్యాడి, కాత్యాయనుల విస్తృత కోశాలకంటే చెప్పాడు. దీన్ని బట్టి విక్రమార్కుడు కల్పిత పురుషుడు కాడనీ, అతడి ఆస్థానంలో కాళిదాసు, అమరసింహుడు లాంటి కవి పండితులు ఉండేవాళ్ళనీ చెప్పవచ్చు. ఈ రకంగా అమరసింహుడు క్రీ.పూ. మొదటి శతాబ్దం వాడని నిర్ధారించవచ్చు.

అమరసింహుడు తన నామలింగాను శాసనాన్ని మూడు కాండలుగా విభజించాడు. మొదటి కాండలో 280, రెండో కాండలో 735, మూడో కాండలో 485.. వెరసి 1500 శ్లోకాలున్నాయి. ప్రతి కాండను కొన్ని వర్గాలుగా విభజించాడు. ప్రథమ కాండలో- స్వర్గ వర్గం, వ్యోమ వర్గం, దిక్ వర్గం, కాల వర్గం, ధీ వర్గం, వాక్ వర్గం, శబ్దాది వర్గం, నాట్య వర్గం, పాతాళ వర్గం, భోగి వర్గం, నరక వర్గం, వారి వర్గం అని 12 వర్గాలున్నాయి. ద్వితీయ కాండలో- భూ వర్గం, పుర వర్గం, శైల వర్గం, వనౌషధి వర్గం, సింహాది వర్గం, మనుష్య వర్గం, బ్రహ్మ వర్గం, క్షత్రియ వర్గం, వైశ్య వర్గం, శూద్ర వర్గం అని పది వర్గాలున్నాయి. తృతీయ కాండలో విశేష్య నిఘ్న వర్గం, సంకీర్ణ వర్గం, నానార్థ వర్గం, అవ్యయ వర్గం, లింగాది సంగ్రహ వర్గం అని ఐదు వర్గాలున్నాయి. ఇందులో వుండే నానార్థ వర్గంలో పదాలని కాంతాలు, ఖాంతాలు, గాంతాలు అని వర్ణక్రమంలో కూర్చాడు. ఇదంతా ఒక ప్రణాళికాబద్ధంగా (schematic) సాగిన రచన. తరువాత వచ్చిన నిఘంటు కారులు ఈ పద్ధతిలో (అకారాది క్రమం) కూర్చడం అమరాన్ని అనుసరించే చేశారు.

సంగ్రహంగా వుండి, విద్యాభ్యాసం చేసేవాళ్ళకు సూక్ష్మంలో మోక్షం కలిగేట్టుగా అమరసింహుడు తన నామలింగానుశాసనాన్ని నిర్మించాడు.

నామాలనీ లింగాలనీ తన కోశంలో చక్కగా సమన్వయం చేసి, అమరసింహుడు తన ప్రత్యేకతను ప్రదర్శించాడు. అందువల్ల నామలింగానుశాసనం అనేది సార్థక నామధేయం అయింది. అమరకోశంలో మరో ప్రత్యేకత - సునిశితమైన దృష్టితో చేసిన వర్గ విభజన. దీని వైశిష్ట్యాన్ని "సంక్షిప్తైః ప్రతిసంస్కృతైః సంపూర్ణముచ్యతే వర్గైః నామలింగాను శాసనమ్" అనే శ్లోక భాగం సూచిస్తున్నది. దీని వల్ల అవసరమైన విషయాలన్నీ ఇందులో వున్నాయని తేలుతోంది. అంతమాత్రాన ఇది ఎంతో విస్తారంగా వుండి విద్యార్థులకు భయం కలిగిస్తుందేమో అనుకోనక్కరలేదు. సంగ్రహంగా వుండే వర్గాల్లో అమరం చక్కగా విభజించి వుంది అని చెప్పాడు రచయిత. ఈ వర్గాలు ఒక క్రమంలో వుండి ధారణకు సహాయం చేస్తాయి.



ధన్వంతరిః క్షపణకః అమరసింహ శంకూ
భేతాళభట్ట ఘట కర్పర కాళిదాసాః
ఖ్యాతో వరాహమిహిరో నృపతేః సభాయాం
రత్నానివై వరరుచిః నవవిక్రమస్య

- అనే ఆర్యోక్తిని బట్టి అమరసింహుడు విక్రమార్కుడి సభకు అలంకారంగా ఉన్నట్టు (నవరత్నాలలో ఒకడని) తెలుస్తోంది. మెగస్తనీసును మౌర్య చంద్రగుప్తుడితో ముడిపెట్టి అల్లిన స్వకపోల కల్పనల సాలెగూళ్ళలో బ్రిటిష్ చరిత్రకారులు విక్రమార్కుడికి స్థానం కల్పించలేకపోయారు. విక్రమార్కుడు ప్రమర వంశీయుడు. శ్రీశైల ప్రాంతాల నుంచి తరలివెళ్ళి, ఉజ్జయినిని రాజధానిగా చేసుకున్నాడు. సాహస విక్రమార్కుడని ఆసేతు హిమాచలం కీర్తిని గడించాడు. ధర్మ నిర్వహణా పరాయణుడై పరిపాలన సాగించిన విక్రమార్కుణ్ణి ఇంగ్లీషు చరిత్రకారులు కల్పిత పురుషుడని కొట్టివేశారు. సముద్రగుప్త విక్రమాంకుడు రాసిన శ్రీకృష్ణ చరిత్రలో వుండే ప్రస్తావన మనకు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తుంది.

మృచ్ఛకటికం అనే నాటకం రచించినవాడు శూద్రక మహారాజు. ఆయన శకులను జయించి, తన విక్రమానికి చిహ్నంగా విక్రమ శకం స్థాపించాడు. అతడి సభలోనే మూడు నాటకాలు రాసిన కాళిదాసు మొదలైనవాళ్ళు ఉండేవాళ్ళు. ఈ విషయాన్ని సముద్రగుప్తుడు స్పష్టంగా

అమరసింహుడు పదాల్ని వర్గాల్లో వింగడించడంలో సైతం కొంత ప్రత్యేకత ప్రదర్శించాడు. ఉదాహరణకు- క్షత్రియ వర్గం చెబుతూ అందులో సైనిక విభాగం పేర్కొన్నాడు. కనక దానికి సంబంధించిన ఏనుగులు, గుర్రాలు, వాటి అవయవాల పేర్లు అన్నీ క్షత్రియ వర్గంలో చేర్చాడు. అలాగే వైశ్య వర్గంలో వ్యవసాయం, పశుపాలన మొదలైన వాటికి చెందిన ఆవులు, ఎద్దులు, గేదెలు- వీటికి చెందిన అవసరమైన శబ్దాల్ని వివరించాడు. విగిలిన జంతువుల గురించి సింహాది వర్గంలో చెప్పాడు. ఇలా మనుష్య వర్గం తీసుకుంటే మనుష్య జాతి, వ్యక్తి సామాన్యానికి సంబంధించిన పదాలే కనపడతాయి. ఇందులో- స్త్రీ పురుషులకు వుండే సంబంధ బాంధవ్యాలు, ఆకార విశేషాలు, అవయవాలు, వ్యాధులు, అలంకారాలు లాంటివి వున్నాయి. జాతి విశేషాలు, ప్రత్యేక సాంఘిక ఆచారాలు వుండే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు చెందిన పదాలకి వేర్వేరు వర్గాలు కేటాయించాడు. వారి వారి వృత్తులు, వాటి పదజాలం ప్రత్యేక వర్గాల్లో వున్నాయి. ఈ రకంగా అమరసింహుడు ప్రతి వర్గాన్ని శీర్షికకు తగినట్టుగా శబ్దాల్ని తీసుకుని ఒక చక్కటి వరున క్రమ పరిచాడు.

ఇకపోతే- లింగాల విషయంలో సందేహాలకు తావులేని జ్ఞానం కలిగించడానికి అమరసింహుడు కొన్ని పద్ధతులు అవలంబించాడు. అతడు ఉపయోగించిన ప్రథమా విభక్తి రూపాలైన విడి విడి పదాలకు లింగం సులభంగానే తెలుస్తుంది. 'విష్ణుః నారాయణః కృష్ణః' అన్నప్పుడు ఇవి పులింగాలని పోల్చుకోవచ్చు. అలాగే 'రమా మంగళ దేవతా' అని వున్నప్పుడు ఇవి స్త్రీ లింగాలని తేలిగ్గా తెలుస్తాయి. 'వదనం తుండం ఆననం లపనం ముఖం' అని వున్న చోట ఈ పదాలన్నీ నపుంసక లింగాలని స్పష్టంగా తెలుస్తున్నది. ఈ విధమైన అమరిక వల్ల సామాన్యంగా లింగ జ్ఞానం కలుగుతూ వుంటుంది. 'తత్పరో హనుః' అన్నప్పుడు 'తత్పరః' అనే పులింగ విశేషణం వల్ల హను శబ్దం పుంలింగం అని పోల్చుకోవచ్చు. అలాగే 'కుతుః కృత్తేః స్నేహ పాత్రం సా ఏవ అల్పః కుతుపః పుమాన్" అని వున్న చోట స్త్రీ వాచకం ఐన 'సా' అనే పదంతో విశేషించడంతో 'కుతూః' అనే శబ్దం స్త్రీ లింగం అని సులభంగా గ్రహించుకోవచ్చు. ఇలా తెలిసిన లింగమైన పదం పక్కనే ఉండడంతో - అంటే - సాహచర్యం వల్ల కూడా లింగాన్ని పోల్చుకోవచ్చు. 'కబంధం ఉదకం పాథః' అన్నప్పుడు పాథః శబ్దానికి రూపభేదం ఉన్నా, ఉదకంతో వుంది కనుక అది నపుంసక లింగమే అవుతుంది.

ఈ ఉపాయాలు కాక, లింగ విషయంలో అవగాహనకు అమరసింహుడు ఇంకా కొన్ని చిట్కాలు ప్రయోగించాడు. ఒక పదం మూడు లింగాల్లోనూ ఉపయోగించతగిందైతే, దాని పక్కన 'త్రిషు' అని చేర్చాడు. స్త్రీ, పులింగాలలో ఉపయోగించే పదాల్ని 'ద్వయోః' అన్నాడు. కొన్ని శబ్దాలకు అవి ఏ లింగంలో వుండవో ఆ లింగాన్ని 'అస్త్రీ', 'నసా', 'ద్వయహీనం' అని తెలిపాడు. ఇంతేకాక కేవలం పులింగాలని 'పుంసి' అనీ, కేవలం నపుంసక లింగాలకు 'క్లీబే నపుంసకే' అని గుర్తులు చెప్పాడు. కొన్ని పదాలకు ద్వంద్వ సమాసం చేసి చెప్పాల్సిన చోట ఆ సమాసంలో ఒకే లింగానికి చెందిన పదాల్ని మాత్రమే గ్రహించాడు. లింగ సాంకర్యంతో సమాసాలు ప్రయోగించ లేదు. లింగభేదం వున్న పదాలు ఒకే పాదంలో వుంటే, 'తు', 'అథ' అని వాడి, వాటిని విడదీశాడు. ఇలా తాను పేర్కొన్న నామాల లింగ విషయంలో ఏమాత్రం అనుమానానికి తావివ్వకుండా లింగానుశాసన నిర్మాణం చేశాడు. ఇది అమరసింహుడి మహా వైయాకరణత్వాన్ని సూచిస్తుంది.

ఇది ఇలా వుంటే- లోకంలో వాడుకలో వుండే శబ్దాల్ని సైతం అమరసింహుడు పరిగణనలోకి తీసుకుని, వ్యవహార భాషను స్వీకరించాడు. అష్టాధ్యాయిలో ఒక సూత్రం వున్నది (పాణిని - 2-4-56) - అది - 'అజేర్వ్యఘ ఇ పోః' అన్నది. పతంజలి తన మహాభాష్యంలో ఈ సూత్రం కింద ఒక కథ చెప్పాడు. ఇది ఒక రథం నడిపే సూతుడికీ, ఒక వ్యాకరణ శాస్త్రజ్ఞుడికీ మధ్య జరిగిన ఒక వింత సంభాషణ.

వైయా: కోస్య రథస్య ప్రవేతా? (ఈ రథం నడిపే వాడెవడు?)

సూతః: అహం ఆయుష్మన్! అస్యరథస్యప్రాజితా (ఆయుష్మంతుడా! ఈ రథాన్ని నడిపేవాణ్ణి నేనే.)

వైయా: అపశబ్దః. (ఓయ్! ప్రాజితా అనేది అపశబ్దం. అజ ధాతువుకు 'వీ' ఆదేశం వచ్చి ప్రవేతా అవుతుంది.)

సూతః: ప్రాప్తిజ్ఞో దేవానాం ప్రియః నత్విష్టిజ్ఞః. ఇష్యత ఏతద్రూపం. (మూర్ఖుడివైన నీకు సూత్రం వల్ల వచ్చే రూపం మాత్రమే తెలుసు. పెద్దలు అంగీకరించిన వ్యవహార రూపం తెలీదు.)

వైయా: అహో ను ఖలు అనేన దురుతేన బాధ్యామహే. (దుష్టుడైన ఈ రథ చోదకుడు నన్ను ఆక్షేపిస్తున్నాడు.)

సూతః: నఖలులేషః సూతః, సువతే రేవ సూతః. యది సువతే కుత్సా ప్రయోక్తవ్యా దుస్సూతూనేతి వక్తవ్యం. (అయ్యా! వేఞ్ ధాతువుకు ఉత రూపం వచ్చి సూత శబ్దం కాదు. అది షూఞ్ నుంచి వస్తుంది. దాన్ని నిందార్థంలో వాడాలంటే 'దుస్సూతేన' అనాలి. అంతేకాని, 'దురుతేన' అని అనకూడదు.)

ఈ సంభాషణను బట్టి వ్యాకరణ శాస్త్రంలో సూత్రార్థం మాత్రమే తెలిస్తే చాలదనీ, వాడుకలో వుండే ప్రయోగాల్ని సైతం స్వీకరించాలనీ పతంజలి అన్నాడు. వ్యవహారంలో వున్న శబ్దాల్ని గ్రహించలేకపోతే, ఎంతటి వైయాకరణుడైనా నవ్వుల పాలౌతాడు. అమరసింహుడు ఈ మర్మాన్ని గ్రహించి - ప్రాజితా, సూత లాంటి శబ్దాల్ని తన కోశంలో చేర్చాడు. అమరకోశంలో 1500 శ్లోకాల్లో సుమారు 9000 పదాలున్నాయి. మచ్చుకి మనకు సూర్యుడికి 37, కిరణానికి 11, బ్రహ్మకు 20 పర్యాయ పదాలున్నాయి. ఇవి అమరసింహుడి భాషా మర్మజ్ఞతని విశదీకరిస్తాయి.

నేటి తరానికి అమరకోశం పరిచయం లేదు. పదాలకోసం నిఘంటువుల్ని ఆశ్రయిస్తారు. కాగా, వాటిలో పర్యాయ పదాలు, నానార్థాలు, లింగజ్ఞానం వుండవు. కంప్యూటర్లలో దొరికే పదాల అర్థాలు సమగ్రం కావు. వక్తలు, రచయితలు, కవులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు- వీళ్ళకు గనక అమరం కంఠస్థం అయివుంటే- వీళ్ళ పదసంపద అపారంగా వెల్లివిరుస్తుంది. 'సింహో మృగేంద్రః పంచాస్యః హర్యక్షః కేసరీ హరిః' అన్న పాదం నోటికి వస్తే- సింహానికి మృగేంద్రమనీ, పంచాస్యమనీ, హర్యక్షమనీ, కేసరి అనీ, హరి అని వాడగలుగుతాం- ఏ పునరుక్తీ లేకుండా. వైజ్ఞానికమైన వర్గీకరణతో శబ్ద హర్మ్యాన్ని నిర్మించిన అమరుడు నిజంగా అమరుడే.

అప్పరుసు విజయరామారావు
91770 86363

నాగలి కూడా ఆయుధమే..!

దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే' పరిచయ సభ రాపోలు సీతారామరాజు అధ్యక్షతన ఏప్రిల్ 30 సాయంత్రం 6 గంటలకు అంతర్జాల వేదికపై జరుగుతుంది. సభలో గుడిపాటి, యం. నారాయణ శర్మ, పి. శ్రీనివాస గౌడ్, గౌతమ్ లింగా, విల్సన్ రావు కొమ్మవరపు పాల్గొంటారు. వివరాలకు: 89854 35515.

రాపోలు సీతారామరాజు

అం.ప్ర.ర.సం అధ్యక్ష, గౌరవాధ్యక్షుల ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నూతన అధ్యక్షులుగా సి. భవానీదేవి, గౌరవ అధ్యక్షులుగా పాపినేని శివశంకర్ ఎన్నికయ్యారు. ఏప్రిల్ 23న గుంటూరు బృందావన్ గార్డెన్స్ లో అన్నమయ్య గ్రంథాలయం ఆవరణలో జరిగిన ఈ ఎన్నిక సమావేశంలో చలపాక ప్రకాష్, వెలువోలు నాగ రాజ్యలక్ష్మి, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బాపట్లకు చెందిన సి.భవానీ దేవి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయం ముఖ్య కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. కవయిత్రిగా, కథా, నవలా, వ్యాసరచయిత్రిగా, అనువాదకురాలిగా తెలుగు సాహిత్యరంగంలో సేవలు అందించారు.

చలపాక ప్రకాష్

గంగ్ర హనుమంతరావు సాహిత్య పురస్కారం

ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో కవిత్వేతర ప్రక్రియలకు అందించే గంగ్ర హనుమంతరావు స్మారక పురస్కారానికి ఈ సంవత్సరం తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు లక్ష్మణ చక్రవర్తి 'షట్చక్రం' పుస్తకం ఎంపికైంది. ఈ అవార్డు ప్రదానోత్సవం ఈ నెల చివరి వారంలో ఉంటుంది.

గాజుల రవీందర్

'మాతృ వందనం' సత్కార సభ

డెబ్భై ఏళ్ల పైబడిన రచయిత్రుల షష్టిపూర్తి కలాలకు సత్కారం 'మాతృవందనం' కార్యక్రమం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సితాస్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఏప్రిల్ 30 ఉ.10గంటలకు హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిరంలో జరుగుతుంది. సభాధ్యక్షులు తంగెడ కిషన్ రావు, ఉపాధ్యక్షులు కవిత దర్యాని రావు, విశిష్ట అతిథి కె. రజనీ ప్రియ, గౌరవ అతిథి మామిడి హరికృష్ణ, ఆత్మీయ అతిథి భట్టు రమేష్, నిర్వహణ అయినంపూడి శ్రీలక్ష్మి, నల్లమోతు నాగరాణి. ఈ ఏడు మాతృ వందనం స్వీకరిస్తున్న రచయిత్రులు: తెన్నేటి మాణి క్యాంబ, గౌరి తంగవేలు, బీనాదేవి, అరవింద, ఆకెళ్ళ విశాలాక్షి, శ్రీలక్ష్మి ఉంగుటూరి, బుగ్గారపు సులోచన, ఉమాదేవి ఆచంట, ద్రోణం రాజు సుబ్బలక్ష్మి, డి. సుజాత దేవి, శోభారావు కేతవరపు, విజయలక్ష్మి ధార, కె. వరలక్ష్మి, మన్నె లలిత, లలితా దేవి మాడభూషి, ముదిగొండ మల్లీశ్వరి, సత్యవాణి, బి. ఉమాదేవి జంధ్యాల, సత్యవాడ సోదరీ మణులు, రఘునాథమ్మ, సూర్యకుమారి, ముది గొండ సీతా రావమ్మ, మున్నంగి లలిత కళ, ఓల్గా, మరు దాడు అహల్యమ్మ, చాడా లలితాదేవి, దివాకర్ల రాజేశ్వరి, అరుణ వ్యాస్, పద్మజ వాణి, శోభా దేవి రేవూరి, కోండ్ మీనా, పాప ఎర్రంశెట్టి, ఉప్పలపాటి కుసుమ, సంధ్య గోళ్ళమూడి, జి.వి. రాజేశ్వరి, జి. భవాని కృష్ణమూర్తి, అఖిలేశ్వరి, ఆర్. సుమన్ లత, కె.వి. కుమారి, జానకీ ప్రభల, పుట్టపర్తి నాగపద్మిని, తిరుమల నీరజ, సి. భవానీ దేవి, బి. లీలారెడ్డి.

శ్రీలక్ష్మి ఐనంపూడి

హార్దికాహ్వానం

నిన్ను మనసులోకి ఆహ్వానిస్తాను
కానీ కొన్ని షరతులతో

లోపలికి వస్తూనే
తలుపుకు ఎడం వైపున
నన్ను నేను చెక్కుకున్న
తుడిపి తుడిపి రాసుకున్న
అస్తిత్వపు పలక తగిలించి ఉంది జాగ్రత్త

కుడివైపున
దిక్కుల దాకా పరుచుకుని
అపుడపుడూ ముడుచుకునే
అభిరుచుల అత్తిపత్తి ఉంది
అదేపనిగా ముట్టుకోకు

ఆ పక్కనే
ఇప్పుడిప్పుడే కలల మొగ్గలేసుకుని సన్న ఆశల తీగ
హృది కిటికీని అల్లుకుంటోంది
ఒక్క దోసెడు ప్రోత్సాహం చిలకరిస్తే
ముందు ముందు ఆ పరిమళాలు
నిన్నూ అలుముకుంటాయి

కాస్త ముందుకు వస్తే
వీలైనన్ని ఎత్తులకు ఎగురుతూ
అలా ఇలా
సరదాగా సందడి చేస్తుంటుంది
నా స్వేచ్ఛా పిట్ట

దానికోసం పంజరాన్ని మాత్రం పట్టుకుని రాకు

చప్టామీద చిన్ననాటి స్నేహం కూర్చొనుంది
పాత మంచం పైన కన్నవాళ్ళు
అలసి సేదదీరుతున్నారు
వసారాలో అయినవాళ్ళు
అదీ ఇదీ మాట్లాడుతూ ఉంటారు

చూసుకో..
అటూ ఇటుగా వెళ్తే
అనుమానపు అగాధాలున్నాయి
సమాంతరంగా సంయమనంతో అడుగులేయాలి

అప్పుడప్పుడు
సమస్యల మంచు కురుస్తుంది
పరస్పర చర్చల సెగడు
వెలిగించుకునే వెసులుబాటుంది

చిట్టి పొట్టి వైరుధ్యాలతో
అక్కడక్కడా తడుస్తుంది
అయినా సర్దుబాట్ల గాలీ వెలుతురు
కావాల్సినంత ఉంది

అంతగా అడిగావు కాబట్టి
ఎద తలుపైతే తెరుస్తాను
కానీ నీకోసం నాకు సంబంధించినవేవీ ఖాళీచేయను
పాతవేవీ పోగొట్టుకోను

ఒకటి మాత్రం హామీ ఇవ్వగలను
నిబంధనలు పాటించి వొస్తే
నువ్వు నిరాశచెందవు
వెన్నెల రాత్రి ఆరుబయట ఆకాశం కింద



వెల్లకిలా పడుకున్న అనుభూతి
నిన్ను చుట్టుముడుతుంది
హక్కుల్ని ఇవ్వడం లోని ఆనందం
అనుభవం లోకి వస్తుంది

అలాగే..
ఉమ్మడి ఆశయాల కౌగిలింతలు అదనం

దారల విజయ కుమారి
91772 92275

"లోకం చూపే జాలిలో శాడిజం ఉంటుంది"

అనిశెట్టి రజిత రుద్రమ ప్రచురణల నుంచి ప్రధాన సంపాదకులుగా ఇటీవల వెలువరించిన గ్రంథం 'భారత దేశంలో వితంతు వ్యవస్థ'. కొమర్రాజు రామలక్ష్మి, తమ్మెర రాధిక, చందనాల సుమిత్రలు ఈ సంకలనానికి సంపాదకులు. ఇందులో సామాజిక సాహిత్య వ్యాసాలు, సంస్కర్తల వ్యక్తిత్వాలు, వితంతు స్త్రీల కథనాలు, నివేదికలూ ఉన్నాయి. దేశం ఎంత ముందుకి వెళుతుందని చెప్పుకుంటున్నా స్త్రీల స్థాయి విషయానికి వస్తే ఏదో ఒక డొంక పట్టుకు ఆమెను వెనక్కు లాగడం మతం పేరున చేసినప్పుడు ఆ చిక్కు ముడులు విప్పకుండా ముందుకు వెళ్లడం జరగదు. ఈ వ్యవస్థ విధివంచితులని ముద్ర వేస్తున్న స్త్రీల పరిస్థితిని సమాజం ముందుకు తేవాలన్న ఆలోచనతో ఈ పుస్తకాన్ని తెచ్చారు. ఈ సంకలనం గురించి అనిశెట్టి రజితను పలకరిద్దాం.

ఈ పుస్తకంలో వివిధ రచయితలు తొలి దశ నుంచి తెలుగు సాహిత్యంలో ఉన్న వితంతు సందర్భాలను, పాత్రలను గురించి వ్యాసాలు రాశారు. నేటి తెలుగు సాహిత్యం వితంతు వ్యవస్థను ఎలా చూస్తుంది?

అచ్చంగా వివిధ భాషా ప్రాంత రచయితల రచనల్లో ఉన్నట్టుగానే ఆది నుండి వితంతు వ్యవస్థను భారతీయ సమాజం కాపాడుకుంటూ వస్తున్నది. మతాన్ని బలమైన పునాదిగా చేసుకొని ఆచార సంప్రదాయాలను పవిత్ర శాసనాలుగా అనుసరించాలంటూ ఒక క్రూరమైన వ్యవస్థను నిర్మించి కొనసాగిస్తున్నది మన సమాజం. ఈ విషయంలో సాహిత్యం మానవీయంగా ప్రగతిశీలంగానే ఉండి ఉన్నది ఉన్నట్లుగా చిత్రిస్తూ వస్తున్నది. గతానికి సంబంధించి అదొక సాహసమే.



అనిశెట్టి రజిత | పలకరింపు

భర్తను కోల్పోయిన కొందరు సెలబ్రిటీ స్త్రీలు విషయంలో ఈరోజు సామాజిక మాధ్యమాలలో వితంతు ఆచారాల ఆంక్షలు లేనితనాన్ని చూస్తున్నాం. ఏ వర్గం స్త్రీలని ఈ వితంతు వ్యవస్థ దూరం పెడుతుంది?

సెలబ్రిటీలు ఎవరు? వారు మన సమాజం మొత్తానికి ప్రతినిధులు కాదు కదా. వారున్న రంగాల్లో వారు వేరుగా ఉంటే కుదరదు. ఎప్పటిలా ఉండాల్సిందే. అక్కడ అంతగా పాటించవలసిన నిబంధనలు ఉండవు. చూసీ చూడనట్టు ఉంటారు. వారు అవసరాన్ని అనుసరించి పైపైన అలా కనిపిస్తున్నా లోలోన వారు ఏమి ఎదుర్కొరని, మానసికమైన డిస్టర్బెన్స్ ఉండదని అనుకోలేము.

వితంతు వ్యవస్థ అనేది కేవలం వస్త్రధారణ, పూలు, బొట్టు, గాజులు వంటి భౌతిక అలంకరణకు మాత్రమే పరిమితమైనది కాదు. అది ఒక సజీవమైన అస్తిత్వాన్ని నిండా రసాయనాలు పోసి కడిగి మేకప్ వేసి శవప్రాయం చేసే దౌర్జన్యపు వ్యవస్థ. స్వల్పమైన తేడాలతో దాని ప్రభావాన్ని పూర్తిస్థాయి అని అంచనా వేయలేము. ఆంక్షల రాతి గోడల లోపల జరిగేవన్నీ అందరికీ కనిపించాలనీ లేదు. అది అనుభవించే వారికే తెలుస్తుంది.

ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో భక్తి, సనాతన ధర్మం, సంస్కృతి అంటూ స్త్రీ కట్టు బొట్టుపై మరోసారి పునరాలోచన చేయాలని వస్తున్న వ్యాఖ్యలు రేపు అదే స్త్రీ వితంతువయ్యాక జరగబోయే దానికి ఆజ్యం పోస్తున్నట్టేనా?

ఇప్పుడు సోషల్ మీడియానే సమస్తం అనుకుంటున్నారు కొందరు. స్త్రీ కట్టుబొట్టుల గూర్చిన పునరాలోచన ఒత్తిడి ఒకటే కాదు, స్త్రీని బ్రాహ్మణీయ పితృస్వామ్యం, పితృస్వామ్య భూస్వామ్యం, కులస్వామ్యం, మత భావనలు అన్నీ దేహపు ముద్దగా, సొంత ఆస్తిగా, విలాసాలకు సాధనంగా చేసుకొని, శతాబ్దాలుగా బొమ్మను చేసి ఆడుకుంటున్నాయి. ధర్మాన్ని మతాన్ని ఉల్లంఘించి కూడా స్త్రీల పట్ల దాష్టీకం చేస్తున్నాయి. ఈ విషగాలులు ఎప్పుడు వీచినా ప్రమాదకరమైనవి, నేరపూరితమైనవి. ముందు ముందు పరిస్థితి ఇంకా భయానకం కానున్నది. పెనం మీద నుండి పొయ్యిలోకి పడిపోతామా అని నిరాశతో అంటున్నది కాదు.


లౌకిక ప్రజాస్వామ్య భారతదేశంలో కేవలం హిందూ సంప్రదాయంలో వితంతు వ్యవస్థపై పుస్తకం తీసుకురావడం పై మీ వ్యాఖ్య?

మొదట నేను స్పష్టం చేయాల్సింది స్త్రీలను మతాల కులాలపరంగా విభజించుకుని వర్గీకరించుకొని ఈ సంకలనం వేయాలన్న స్పృహ లేకపోవడం. అయితే ఒక ప్రారంభం కావాలని దీనిపై వివిధ సెక్షన్లలో ఒక చర్చ రావాలని ఒక ఆశతో నాలో వేదనకు ఒక అవుట్‌లెట్‌గా ఈ బాధ్యతను చేపట్టాను.

రెండో మాట- ఇంకా ఎంతో చేయాలని ఉన్నా ఆ పరిశోధన చేయలేకపోవడం కలెక్టివ్ వర్క్ వైఫల్యమే. ఈ సంకలనంలోని సాహిత్య వ్యాసాల విభాగం దానికి ఒక ఉదాహరణ. ప్రయత్నం కొంత జరిగినా రావాల్సిన స్పందన రాకపోవడం ఒక కారణం.

హిందూ వ్యవస్థలో స్త్రీకి ఉన్న అన్ని ప్రివిలేజెస్ అంగీకరించి వితంతు ఆచారాల దగ్గరకు వచ్చేసరికి కేవలం తృణీకరణే వారిని ఇబ్బంది పెడుతుందా? మరే ఇతర కారణాలు ఉన్నాయా?

హిందూమత వ్యవస్థలో అనే కాదు, ఈ అసమ వ్యవస్థలో ఏ స్త్రీకీ ఏ ప్రివిలైజస్ లేవు. డబ్బు పరంగా వచ్చే కొన్ని సౌకర్యాలు కులం వర్గం పరంగా వచ్చే కొన్ని సౌలభ్యాలు ఏ విధంగానూ ప్రివిలైజస్ అని మినహాయించలేము అన్నది ఒక అవగాహన. స్త్రీలందరూ ఎన్నో రూపాల్లో అవమానాలు అణిచివేతలు అనుభవిస్తూనే ఉన్నారు. ఇక భర్త చనిపోతే అయా స్త్రీలను పోల్చుకోవలసి వస్తే రూపంలో కొన్ని తేడాలు ఉన్నా సారంలో వారి పట్ల ఆచార వ్యవహార క్రూరత్వం ప్రదర్శించడంలో తేడాలు ఉండవు.



సాధారణ గృహిణులు, మధ్యతరగతి మహిళలే ఎక్కువగా ఈ వితంతు వ్యవస్థకు బలి కాబడుతున్నారనుకోవచ్చా?

ఒక సెక్షన్ వర్గం స్త్రీలు అని అనుకోలేము. సోషల్ స్టిగ్మా, సోషల్ నెగ్లెట్ అంతటా వ్యాపించి ఉన్నప్పుడు ఆచార సాంప్రదాయాల ముసుగులో బంధించడం అనేది అందరికీ ఓపెన్‌గా కనిపించేది కాదు, గుట్టుగా ఒకింత రట్టుగా వారి కుటుంబాల లోపల జరిగేది. ఇదంతా తమ పట్ల జరుగుతుంటే ఒక బండి చక్రం విరిగిపోతే ఒకే చక్రంతో జీవితపు బండిని ఎలా ఈదాలా అని నిస్పృహలో స్త్రీలు కూరుకుపోతారు. అప్పటిదాకా ఉన్న అస్తిత్వం కోల్పోయినతనం బాధిస్తుంది. ఇతరుల సానుభూతి నామమాత్రమే. లోకం చూపే జాలిలో శాడిజం ఉంటుంది.

ఇంటర్వ్యూ **మానస ఎండ్లూరి**

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 29 ఏప్రిల్ 2024


హనుమకొండ చౌరస్తాలో జరిగిన రోడ్‌షోకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, జనం

రోడ్ షోలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

బీఆర్ఎస్ పాలనలోనే వరంగల్ అభివృద్ధి

- 24 అంతస్థుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మెగా టెక్స్‌టైల్ పార్కు, ఐదు మెడికల్ కళాశాలలు నిర్మించాం..
- 4 నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని సమస్యలే..
- కడియం రాజకీయ జీవితం సమాధి కాబోతుంది..
- 3 నెలల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక
- వరంగల్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలి..
- బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- హనుమకొండలో రోడ్ షో

రాంనగర్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వరంగల్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. అభివృద్ధికి ప్రతీకగా వరంగల్ నగరంలో 24 అంతస్థుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, హెల్త్ యూనివర్సిటీ, మెగా టెక్స్‌టైల్ పార్కు, ఐదు మెడికల్ కళాశాలలు నిలుస్తాయని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హనుమకొండ కేసీఆర్ రోడ్ షో నిర్వహించారు. హనుమకొండ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మాట్లాడారు.

తెలంగాణ చరిత్రకు, వైభవానికి ప్రతీక వరంగల్ అని, వరంగల్ ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో వరంగల్ నగరం వెనుకబడిందన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో కరువు అనేదే లేదన్నారు. నాలుగు మాసాల కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండుతున్నాయని, కరెంటు సమస్య, నీటి సమస్య ఏర్పడ్డాయని కేసీఆర్ పేర్కొన్నారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆయన ధ్వజమెత్తారు. రైతుబంధు వచ్చిందా? ప్రతీ మహిళకు రూ.2500 ఇచ్చాడా? రూ.2లక్షల రుణమాఫీ అయిందా? ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చాడా అంటూ హాజరైన వారితో చెప్పించారు. బీఆర్ఎస్ పాలనలో భూముల ధరలు పెరిగాయని, ప్రస్తుతం రియల్ దందా బంద్ అయిందని కేసీఆర్ అన్నారు. వందల మంది రోడ్లపై పడ్డారని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ బిపాస్ తీసుకువచ్చి 21రోజుల్లో


బస్సులో నుంచి అభివాదం చేస్తున్న కేసీఆర్

మిగతా 7వ పేజీలో..


కేయూలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ నందిని సిధారెడ్డి

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను కాపాడుకోవాలి

- మత ప్రతిపాదికన దేశం ప్రమాదంలో పడింది..
- సాహిత్య అకాడమీ పూర్వపు చైర్మన్ నందిని సిధారెడ్డి
- కేయూలో లౌకిక విలువలు -సాహిత్యంపై రాష్ట్ర స్థాయి సదస్సు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 28: దేశంలో ప్రజలు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను కాపాడుకోవాలని తెలంగాణ తొలి సాహిత్య అకాడమీ పూర్వపు చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి పిలుపునిచ్చారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం నేతృత్వంలో ఆదివారం కేయూ సెనెట్‌హాల్‌లో రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ప్రముఖ కవి యాకూబ్ అధ్యక్షత జరిగిన ప్రారంభ సమావేశంలో నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. మత ప్రతిపాదికన దేశం ప్రమాదంలో పడిందన్నారు. ఉద్యమ నగరమైన ఓరుగల్లులో లౌకిక విలువలపై మాట్లాడవలసి వస్తుందని ఊహించలేదన్నారు. సమాజంలో మానవీయ విలువలు తారుమారవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రచయితలు తమ చుట్టూ ఉన్న వారి కోసం స్వేచ్ఛగా రచనలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీ స్థాయిల్లో లౌకిక విలువలపై చర్చలు చేపట్టడం అవసరమన్నారు.

సమూహ మొదటి సెషన్‌కు కన్వీనర్‌గా మెట్టు రవీందర్ అధ్యక్షత వహించగా ప్రముఖ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య 'లౌకిక విలువల నిర్వచనం-సాహిత్య అన్వయం' అనే అంశంపై మాట్లాడారు. లౌకిక విలువలపై విశ్లేషణలు చాలా తక్కువగా జరిగాయని చెప్పారు. మతం విలువల ఆధారంగా కాకుండా మానవ విలువల ఆధారంగా లౌకిక విధానం జరుగాలని చెప్పారు. పాలనలో మత ప్రస్తావన ఉండవద్దని చెప్పారు. రాజ్య నైతిక విలువలను కాపాడుకోవాలని చెప్పారు. మనుషుల్ని మానవ పరిణామంలోంచి చూడాలని, మతంలోంచి కాదన్నారు. 'భారతదేశంలో ఫాసిజం స్వరూపం- స్వభావాలు' అనే అంశంపై జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. మనిషి సమాజంలో రెండో శ్రేణి బానిసలుగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మనుధర్మ శాస్త్ర లక్షణాలను పేర్కొన్నారు. మానసిక దాస్యంలోకి మనుషులను తీసుకురావడమే నిజమైన ఫాసిజమని హెచ్చరించారు. సమాజం జాగ్రతం చెందితే తప్ప ఫాసిజాన్ని అధిగమించలేమని పేర్కొన్నారు.

భోజనం విరామం అనంతరం ప్రముఖకవి, రచయిత డాక్టర్ పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'డీ కోడింగ్ రామాయణ' అనే అంశంపై సౌధారుణ మాట్లాడుతూ.. రామాయణం మిథ్ అని, అందమైన భ్రమల లోకమని పేర్కొన్నారు. సమూహ మరో కన్వీనర్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే సాహిత్య 'రాముడు - రాజకీయ రాముడు' అనే అంశంపై మాట్లాడుతూ.. రాముడిని కాదంటే దేశ భక్తులు కాదనే స్థితిలోకి మనం క్రమంగా నెట్టవేయబడే పరిస్థితి నెలకొందన్నారు. రాముడి పేరుమీద జరుగుతున్న అధికార దుర్వినియోగాన్ని అందరూ నిరసించాలని పిలుపునిచ్చారు. మూడో సెషన్‌లో 'ఫాసిజం పోకడలను సాహిత్య వస్తువుగా నిర్వహించడం ఎలా' అనే అంశంపై ప్యానెల్ డిబేట్‌ను కవులు నరేశ్‌కుమార్ సూఫీ, మెర్సీ మార్గరెట్ ఆధ్వర్యంలో జరిగింది. గుమ్మడి అనురాధ ప్రారంభించగా కవులు, రచయితలు నాళేశ్వరం శంకరం, కటుకోజ్వాల ఆనందచారి, స్కైబాబ, పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్ల మహేందర్, తైదల అంజయ్య, కోడం కుమారస్వామి, రాపోలు సుదర్శన్, పొన్నాల బాలయ్య, కందుకూరి అంజయ్య, అన్వర్, అమృత రాజు, సబావత్ హథిరామ్, తదితరులు పాల్గొన్నారు. ముగింపు సభ ప్రజాకళాకారుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా గంటా రామిరెడ్డి పాల్గొనగా ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ ప్రసంగించారు. అనంతరం ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత సమూహ బులిటెన్‌ను ఆవిష్కరించి పరిచయం చేశారు.

శుక్రవారం ఉష్ణోగ్రతలు	
గరిష్ఠం : 41.5°C	కనిష్ఠం : 26.0°C

ఏనుమాములలో గన్ మిస్‌ఫైర్

- కానిస్టేబుల్‌కు గాయాలు... ఎంజీఎంలో చికిత్స..

- 7లో..


మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

నేడు మానుకోటకు జేపీ నడ్డా

- బీజేపీ జనసభకు హాజరు కానున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు

మహబూబాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మానుకోట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ.. సోమవారం జనసభ పేరిట భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభకు భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరుకానున్నారు. ఇందుకు పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యఅతిథి ప్రసంగించే వేదికతో పాటు 25 వేలమంది కూర్చునేలా ఎన్టీఆర్ స్టేడియాన్ని సిద్ధం చేశారు. ఎండవేడిమి తగలకుండా షామియానాలు వేసి 50 కూలర్లను ఏర్పాటు చేశారు. సభకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడకుండా 50 వేల వాటర్ ప్యాకెట్లు, 30 వేల మజ్జిగ పాకెట్లును సిద్ధం చేశారు.

జగత్‌ప్రకాష్ (జేపీ) నడ్డా న్యూఢిల్లీ నుంచి సోమవారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 11.10 గంటలకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 12.30 గంటలకు భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రానికి చేరుకుని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజనం అనంతరం హెలిప్యాడ్ ద్వారా 2.40 గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు తాళ్ల పూసపల్లి రోడ్‌లోని హెలిప్యాడ్ వద్ద దిగుతారు. అక్కడి నుంచి ఎన్టీఆర్ స్టేడియంకు ర్యాలీగా వచ్చి, బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. తిరిగి 4.10 గంటలకు హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్తారు.

పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు

- కావ్య గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలి..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 28: పార్టీ కోసం బూత్ స్థాయిలో పని చేసినవారికే పదవులు దక్కుతాయని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

మడికొండలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేసిన ప్రతీ కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. బేషజాలు లేకుండా, కొత్త, పాత అనే తారతమ్యాలు లేకుండా అందరు కలుపుకొని పార్టీ కోసం పని చేయాలన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి పార్టీ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యకు ఎక్కువ మెజారిటీ రావాలన్నారు. రెండు వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అందరం కాంగ్రెస్ పార్టీలో ఉన్నందున మెజారిటీ భారీగా రావాలని కోరారు. బూత్‌స్థాయిలో పనిచేసే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, అందులో ఎలాంటి అనుమానాలు లేవన్నారు. నిజమైన కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చినప్పుడే పార్టీకి మేలు జరుగుతుందన్నారు. ప్రతీ కార్యకర్త పనితీరు ప్రోగ్రెస్ తనవద్ద ఉంటుందన్నారు. 15 రోజుల పాటు ప్రతీ కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు ప్రతీ రోజు కొందరు ఓటర్లను కలిసి వారితో మాట్లాడాలన్నారు. మే 1, 2, 3 తేదీల్లో బూత్ కమిటీల ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం అమలు చేసిన ఐదు గ్యారంటీలను వివరించాలని కోరారు. మే 4, 5, 6 తేదీల్లో మహిళా కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి బొట్టుపెట్టే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించాలని కోరారు. రెండు రోజుల పాటు మండల సమీక్ష సమావేశాలు నిర్వహించుకొని కార్యాచరణను మండలాల వారిగా రూపొందించుకోవాలని కోరారు. ఈ నెల 30వ తేదీన గ్రామాల వారిగా సమావేశాలను నిర్వహించుకోవాలని సూచించారు. ప్రతీ నాయకుడు, కార్యకర్త కడియం కావ్యకు భారీ మెజారిటీ తీసుకువచ్చేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, నాయకులు బెలిదె వెంకన్న, కట్ట మనోజ్‌రెడ్డి, జగదీష్‌చందర్ రెడ్డి, శిరీష్‌రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, చవంశీధర్‌రెడ్డి, అన్నెబోయిన బిక్షపతి, బూర్ల శంకర్, పోగుల సారంగపాణి, వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకే మాదిగల మద్దతు


మాట్లాడుతున్న మేడి పాపయ్య మాదిగ

కాళోజీ జంక్షన్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే మాదిగ మద్దతు ఉంటుందని, ప్రధాని మోదీపై మాదిగలకు విశ్వాసం లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మాదిగల చిరకాల కోరిక అయిన ఏబీసీడీ వర్గీకరణ కోసం సుదీర్ఘకాలంగా 29 యేళ్లుగా పోరాటం చేస్తున్నామని ఆయన అన్నారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ అధినాయకులు మోదీ, కిషన్‌రెడ్డి, వెంకయ్యనాయుడు, దివంగత సుష్మాస్వరాజ్‌లు పలు సభల్లో మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు పూనుకుంటామని వాగ్దానాలు చేశారని, అధికారంలోకి వచ్చిన 10 యేళ్లుగా ఎందుకు వర్గీకరణకు పూనుకోలేదని పాపయ్య మాదిగ ప్రశ్నించారు. మాదిగల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పుడు సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్ముగిరి దాసు మాదిగ, రాష్ట్ర నాయకులు మెట్టుపల్లి కొమురయ్య మాదిగ, పొలుమారి బాలస్వామి, నీరటి ప్రభాకర్, వద్దూరి కుమారస్వామి, జిల్లా కన్వీనర్ నమిండ్ల క్లైమెంట్, జిల్లా అధికార ప్రతినిధి కొమ్ముల భిక్షపతి, తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కావ్యకే మాల కులస్తుల మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న జి. చెన్నయ్య

వడ్డెపల్లి: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకే మాల సమాజం సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు మాల ప్రజా సంఘాల జేఏసీ జాతీయ చైర్మన్ జి.చెన్నయ్య అన్నారు. ఆదివారం హనుమకొండలోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను తొలగిస్తారని, రాజ్యాంగాన్ని మార్చివేస్తామని ఆ పార్టీ పెద్దలే చెబుతున్నారన్నారు. రిజర్వేషన్లతోపాటు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలంటే కేంద్రంలో బీజేపీని గద్దె దించి కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి దళితులకు మూడు ప్రత్యేక కార్పొరేషన్లతోపాటు అన్ని కులాల అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సమావేశంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మాల మహానాడు మహిళా జిల్లా అధ్యక్షురాలు కె. అనితవినయ్ కుమార్, ముప్పిడి శ్రవణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటేస్తేనే మాదిగలకు న్యాయం

- రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్



ఇల్లంద ఎస్సీ మోర్చా సమ్మేళనంలో అభివాదం చేస్తున్న బీజేపీ నేతలు, మాట్లాడుతున్న అరూరి రమేష్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 28: బీజేపీకి ఓటేస్తేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నా రు. ఆదివారం రాత్రి మండలంలోని ఇల్లంద గ్రా మంలో లక్ష్మీగార్డెన్స్‌లో రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అధ్యతన ఏర్పాటు చేసిన ఎస్సీ మోర్చా సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దళితులను అవమానపరిస్తే ప్రధాని మోదీ అక్కున చేర్చుకున్నారని తెలిపారు. అందుకు సాక్ష్యంగా ప్రధాని మోదీనే మాదిగల సభకు స్వయంగా రావడమని గుర్తు చేశారు. మాదిగ బిడ్డను అయిన తనకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వడం గర్వకారణమని తెలిపారు. దేశంలోని దళితులకు పెద్దపీట వేస్తూ వారి సమగ్రాభివృద్ధి కోసం కృషిచేస్తున్న బీజేపీని విమర్శించడం సరికాదన్నారు. దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. దక్షిణ భారతదేశం నుంచి ఇద్దరు మాదిగలను కేంద్ర మంత్రులను చేసిన చరిత్ర అందరికీ తెలుసన్నారు. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కడియం శ్రీహరి టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలో ఉన్నంత కాలం ఉన్నత పదవులు అనుభవించి ఏ ఒక్క దళితుడిని రాజకీయంగా ఎదగనీయకుండా చేశాడని ఆరోపించారు. 40 ఏండ్ల పాటు దళిత రిజర్వేషన్ ఫలాలు అనుభవించి, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి దళిత నాయకులకు టికెట్ దక్కకుండా చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి కుటుంబానికి ఈ ఎన్నికల్లో దళితులు క్రరు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. ప్రజలు నిండు మనసుతో దీవించి బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇతర పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరగా, వారిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కడియంకు దళితుల ఓట్లడిగే హక్కు లేదు..

కడియం కుటుంబానికి దళితుల ఓట్లడిగే హక్కు లేదని రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ధ్వజమెత్తారు. రిజర్వేషన్లపై సీఎం వ్యాఖ్యలు సిగ్గు చేటన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేస్తుందని సీఎం హోదాలో ఉండి మాట్లాడటం సబబు కాదన్నారు. రాజ్యాంగంపై, రిజర్వేషన్లపై బీజేపీ ఎంతో నిబద్ధతతో ఉంద ని, కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్ర యత్నం చేస్తున్నారని ఆరోపించారు. కడియం శ్రీహరి దళితులను అణగదొక్కాలని చూస్తున్నారని, ఈ ఎన్నికల్లో గెలిస్తే దళితులు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన కావ్యను ప్రజలు ఆశీర్వదించరని అన్నారు. సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధి మహేందర్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, టి.రాజేశ్వర్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తిరెడ్డి కేశవరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం, మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, లూథర్, బన్న ప్రభాకర్ పాల్గొన్నారు.

మానసిక వికలాంగుడి అదృశ్యం



పవన్

మడికొండ, ఏప్రిల్ 28: ఈ నెల 24న మడికొండలో జరిగిన కాంగ్రెస్ జన జాతర బహిరంగ సభలో మానసిక వికలాంగ యువకుడు తప్పిపోయాడు. ఆదివారం మడికొండ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన బొచ్చు పవన్ వారి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులతో కలిసి బస్సులో జన జాతర సభకు హాజరయ్యాడు. తిరిగి వెళ్లే క్రమంలో కనిపించకుండా పోయాడు. బంధువులు, తెలిసిన వారందరిని విచారించినా అతడి ఆచూకీ తెలియలేదు. పవన్ మానసిక వికలాంగుడైనందున అడ్రస్ క్లియర్‌గా చెప్పలేడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 85123, 87126 85248, 87126 85009 నెంబర్లకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

బీఆర్ఎస్ పాలనలో వరంగల్ అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

నిర్మాణాలకు అనుమతులు ఇచ్చామని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కేర్‌ఫీట్ చొప్పున లంచం ఇవ్వాలని కండీషన్ పెట్టి ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. ఇక బీజేపీ ఎజెండాలో ప్రజల కష్టసుఖాలు ఉండవని కేసీఆర్ అన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ప్రధాని మోదీ గుజరాత్‌కు తరలించుకు వెళ్లాడని కేసీఆర్ విమర్శించారు. గోదావరి నదిని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తీసుకువెళ్లాలని మోదీ చూస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. రేవంత్ స్పందించకపోవడం వెనుక మతలబు తెలియడం లేదన్నారు. మోదీకి 200 సీట్లు దాటవని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ 12 ఎంపీ స్థానాలు గెలుచుకుంటే కేంద్రంలో కీలకంగా మారి సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. చైతన్యమైన వరంగల్ గడ్డపై గులాబీ జెండా ఎగురాలని ఆయన పిలుపిచ్చారు. వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ ప్రసంగంలో 'కేసీఆర్ గుడ్లు పీకి గోలీలు ఆడుతా.. పేగులు మెడలకు వేసుకుంటా.. చర్లపల్లి జైలుకు పంపుతా..' అంటున్నాడని.. తాను కేసులకు భయపడేది లేదన్నారు. కేసులకు భయపడితే తెలంగాణ వచ్చేదా? అని ఆయన అన్నారు. కడియం శ్రీహరికి డిప్యూటీ సీఎంతో పాటు ఎన్నో పదవులు ఇచ్చామన్నారు. బీఆర్ఎస్‌కు చేసిన మోసానికి సుప్రీంకోర్టు తీర్పు మేరకు కడియం శ్రీహరి రాజకీయ జీవితం సమాధి కాబోతుందని దుయ్యబట్టారు. మరో మూడు మాసాల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక రాబోతుందన్నారు. ఉప ఎన్నికలో డాక్టర్ రాజయ్య ఎమ్మెల్యే కాబోతున్నాడని కేసీఆర్ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూధనాచారి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఘన స్వాగతం

- బతుకమ్మలు, బోనాలతో అలరించిన బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు
- కేసీఆర్ రోడ్ షో కారణంగా హనుమకొండలో ట్రాఫిక్ జామ్


హనుమకొండ చౌరస్తాలో మాట్లాడుతున్న కేసీఆర్

న్యూశాయంపేట, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం రాత్రి హనుమకొండకు వచ్చారు. కేసీఆర్‌కు హంటర్‌రోడ్ లోని బీఆర్ఎస్ నేత కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఇంట్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, తదితర బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేసీఆర్ హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ మీదుగా హనుమకొండ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించి చౌరస్తాలో మాట్లాడారు. కేసీఆర్ రోడ్‌షో ఆసాంతం బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు, బోనాలు, బతుకమ్మలతో ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్‌ను సీఎం సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ట్రాఫిక్ జామ్

కేసీఆర్ రోడ్‌షో సందర్భంగా హనుమకొండ అదాలత్ జంక్షన్‌నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్స్, హనుమకొండ చౌరస్తా వరకు భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు నానాకష్టాలు పడ్డారు. సుమారు 30నిమిషాల పాటు హనుమకొండ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ కావడంతో కొంతమంది వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.


కేసీఆర్ రోడ్ షోలో కళాకారుల విన్యాసాలు




హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ వద్ద రోడ్ షోలో డప్పు వాయిస్తున్న రాజయ్య


అంబేద్కర్ జంక్షన్ వద్ద రోడ్ షోలో కేసీఆర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

రోడ్ షోకు భారీగా హాజరైన బీఆర్ఎస్ నేతలు, జనం

రిజర్వేషన్‌లలో దగా చేసిందే కాంగ్రెస్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు

- ప్రైవేటీకరణకు ఆద్యులు పీవీ, మన్మోహన్‌సింగ్
- మోదీని, బీజేపీని విమర్శించే స్థాయి కడియంకు లేదు..
- మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 28: బీజేపీ వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్‌లు తీసేస్తారని మాట్లాడుతున్న కడియం శ్రీహరి.. రిజ్వేషన్‌ల విషయంలో దగా చేసిందే కాంగ్రెస్ అన్న విషయం మరవొద్దని మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు అన్నారు. హంటర్‌రోడ్డులోని బీజేపీ వరంగల్ పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ విలువలను పక్కకు పెట్టి బిడ్డ కోసం ప్రజలతో ఛీకొట్టించుకునే పరిస్థితికి కడియం దిగజారారని ఎద్దేవా చేశారు. మోదీ వస్తే ప్రజాస్వామ్యం ఉండదని అసత్యప్రచారాలు చేస్తున్న కడియంకు.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందే కాంగ్రెస్ పార్టీ అని తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమర్జెన్సీతో చీకటి రోజులు తెస్తే దానికి వ్యతిరేకంగా బీజేపీ పోరాడిందన్నారు. 2004 నుంచి 2010 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్‌లు నాలుగుసార్లు తొలగించి మైనారిటీలకు ఇచ్చేందుకు కాంగ్రెస్ లోక్‌సభలో ప్రయత్నించిందని విమర్శించారు. 1991లో ప్రైవేటీకరణకు ఆజ్యం పోసిందే పీవీ, మన్మోహన్ సింగ్ అని, ఆనాడు టీడీపీలో ఉన్న నీవు ప్రైవేటీకరణను సమర్థించిన విషయం మరిచిపోయావని గుర్తుచేశారు.

బీజేపీకి ఎస్సీ, ఎస్టీలపై గౌరవం ఉందని అందుకే పార్టీ జాతీయ అధ్యక్షుడిగా దళితుడిని, రాష్ట్రపతిగా ఎస్టీమహిళను నియమించిందని రాజేశ్వర్ రావు పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని, మైనారిటీలను బుజ్జగించి ఓట్లు వేయించుకునే తీరు కాంగ్రెస్‌కే చెల్లుతుందన్నారు. వరంగల్ అభివృద్ధి జరగలేదని కడియం మాట్లాడుతున్నాడని, ఉమ్మడి జిల్లాలో ఎక్కువకాలం మంత్రిగా పనిచేసినది ఆయనే కదా.. అప్పుడు ఏం చేశావో ప్రజలుకు చెప్పాలన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ సీట్లలో ఒక్క సీటు కూడా గెలవలేని వారు.. వరంగల్‌లో రోడ్డు షోలు చేస్తున్నారని, అలాంటి వారికి ఓటు వేసి వృథా చేసుకోవద్దన్నారు. మోదీని విమర్శించే స్థాయి కడియంకు లేదని, ఏకవచనంతో సంబోధిస్తే బీజేపీ కార్యకర్తల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.బీజేపీ బలపరిచిన అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, పార్లమెంట్ ప్రభారీ మురళీధర్, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, అమరేందర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, గొర్రె ఓం ప్రకాశ్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాములలో గన్ మిస్‌ఫైర్

- కానిస్టేబుల్‌కు గాయాలు... ఎంజీఎంలో చికిత్స..


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రాజేష్

వరంగల్ సిటీ, ఏప్రిల్ 28: గన్‌ను శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ అయి కానిస్టేబుల్ గాయపడిన ఘటన ఆదివారం వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో చోటుచేసుకుంది. ఏనుమాముల మార్కెట్ ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. 12వ నంబర్ గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఎ.రాజేష్(32) గన్ శుభ్రపరుస్తున్న క్రమంలో ఒక్కసారిగా మిస్‌ఫైర్ అయింది. దీంతో బుల్లెట్ కానిస్టేబుల్ కాలిమడిమలోకి దూసుకుపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న తోటి కానిస్టేబుళ్లు వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఎస్ఐ శ్రీకాంత్ దగ్గరే ఉండి చూసుకున్నారు. అతడికి ఎలాంటి ప్రాణహాని ఏమిలేదని వైద్యులు తెలిపారు. కాగా, రాజేష్ 21 రోజులుగా ఏనుమాముల మార్కెట్లోని ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వహిస్తున్నారు. వరంగల్ నగరంలోని రంగశాయిటపేట ప్రాంతానికి చెందిన రాజేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నట్లు తెలిసింది.

సిరా చుక్క

ఎన్నికలంటే ఠక్కున గుర్తొచ్చేది సిరా చుక్క. ఎన్నికల్లో ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకున్నాక సిరా మార్కు చూపిస్తూ నేను ఓటేశానని సగర్వంగా చెప్పుకుంటాడు. ఇంకొందరు సెల్ఫీలు తీసుకొని సోషల్ మీడియాలోనూ అప్‌లోడ్ చేస్తారు. ఎన్నికల్లో వాడే సిరా మార్కు మనం తుడిచినా పోదు. ఒక్కసారి సిరా గుర్తు వేలిపై పెడితే 72 గంటల వరకు చెరిగిపోదు. మరోసారి బోగస్ ఓట్లు (దొంగ ఓట్లు) వేయకుండా ఎన్నికల సంఘం దీన్ని ప్రవేపెట్టింది. ఈ సిరా ఇంకును కర్నాటక రాష్ట్రంలోని మైసూరుకు చెందిన మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం 1962లో సిరా ఉత్పత్తి కోసం ఈ కంపెనీకి అనుమతిచ్చింది. నేషనల్ ఫిజికల్ ల్యాబరోటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యతను ఈ కంపెనీకి అప్పగించారు. ఈ ఫ్యాక్టరీని మైసూర్ మహారాజు కృష్ణరాజ వడయార్-4 1937లో స్థాపించారు. ఈ ఫ్యాక్టరీలో తయారయ్యే ఇంకును దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల్లో ఉపయోస్తున్నారు. ఈ సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉన్నందువల్ల వేసిన వెంటనే చెరిగిపోదు. సిరా గుర్తుపై ఎన్నికల సంఘం కొన్ని నిబంధనలను కూడా విధించింది. 37 (1) నిబంధన ప్రకారం ఓటరు ఎడమ చేతి వేలుపై సిరా గుర్తును చూడాల్సిన బాధ్యత పోలింగ్ అధికారికి ఉంటుంది. 2006 ఫిబ్రవరి 1 నుంచి ఓటరు ఎడమ చేతి చూపుడు వేలు గోరు పైభాగం నుంచి కింది వరకు సిరా గుర్తు వేస్తున్నారు. అంతకన్నా ముందు గోరుపై భాగం వరకు వేసేవారు.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

'గుర్తు' గుర్తుంచుకో..

- ఎన్నికల్లో గుర్తుకు ప్రాధాన్యత

ఎన్నికల్లో గుర్తులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అసలు గుర్తులు లేకుండా ఎన్నికలే లేవు. కాంగ్రెస్ పార్టీ అంటే హస్తం. భారతీయ జనతా పార్టీ అంటే కమలం. బీఆర్ఎస్ పార్టీ అంటే కారు, సమాజ్‌వాది పార్టీ అంటే సైకిల్. బహుజన సమాజ్ పార్టీ అంటే ఏనుగు గుర్తులు గుర్తొస్తాయి గ్రామీణ ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా చదువురాని వారు తాము ఓటేయాలనుకునే అభ్యర్థి పేరు గుర్తుకురాకపోయినా, గుర్తును బట్టి గుడ్డిగా ఓటు వేస్తారు. ఇలా పార్టీకి, ఎన్నికల గుర్తుకు విడదీయరాని బంధం పెనవేసుకుపోయింది. పార్టీలు చీలిపోయిన సందర్భాల్లో ఇంతటి ప్రాధాన్యత గల ఎన్నికల గుర్తులను కోల్పోయేందుకు ఏ వర్గమూ ఇష్టపడదు. అందుకనే ఎన్నికల కమిషన్ ముందు, లేదా న్యాయస్థానాల ఎదుట ఈ వర్గాలు గుర్తుల కోసం పోరాటం చేస్తాయి. సహజంగానే మెజారిటీవర్గం ఏ వర్గంవైపు ఉందో ఆ వర్గానికే ఎన్నికల కమిషన్ ఎన్నికల గుర్తును కేటాయిస్తుంది. బలాబలాలను స్పష్టంగా తేల్చలేని సందిగ్ధ సమయాల్లో పార్టీ గుర్తును పక్కనపెట్టి జాబితాలో ఏపార్టీకి కేటాయించని గుర్తును కేటాయిస్తుంది.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

డబ్బులిస్తేనే సభలకు జనం

- ప్రచారంలోనూ ధన ప్రవాహమే..
- నాయకులకు తడిసిమోపడవుతున్న ఖర్చులు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాల్లో ఇంటింటా ప్రచారానికి సైతం డబ్బులు ఇస్తేనే తిరుగుతున్నారు. ప్రచారం నిర్వహించాలంటే ఆ గ్రామ నాయకుడితో పాటు పలువురు అవసరం. దీంతో మనిషికింత రేటు నిర్ణయించి డబ్బులు అందజేసి మరి ప్రచారానికి వెంటేసుకు తిరుగుతున్నారు. డబ్బులు ముట్ట చెప్పకుంటే అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక పార్టీ అభ్యర్థి ప్రచారానికొస్తే జన సమీకరం కోసం లక్షలు కుమ్మరించాల్సిందే. ఇక భారీ బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్డు షోలకు ప్రజలను తరలించడానికి వాహనాలు సమకూర్చడంతో పాటుగా డబ్బు, మద్యం అందజేస్తేనే సభ విజయవంతమవుతోంది.

ప్రచారానికి ఒక్కొక్కరికి రూ.300

అభ్యర్థి తరుపున గ్రామాల్లో ప్రచారం చేయడానికి వ్యక్తులను పోగు చేయాల్సి ఉంటుంది. గ్రామ ముఖ్య నాయకుడితో పాటు ఇంటింటా తిరిగి ప్రచారం చేయడానికి, బొట్టు పెట్టడానికి అభ్యర్థులను ముందుగానే ఎంపిక చేసుకుంటున్నారు. పార్టీ కరపత్రం పట్టుకుని వెంట తిరిగే వారికి ఒక్కొక్కరికి రూ. 300, కాస్త వాక్చాతుర్యం ఉన్న వ్యక్తికి మరో రూ. 200 కలిపి మొత్తం రూ.500 చొప్పున అందజేసి మరి ప్రచారం చేయిస్తున్నారు. ఇక ముఖ్య నాయకుడికి ప్రత్యేక ప్యాకేజీనే.

ఏ సభకు వెళ్లినా అదే జనం

అభ్యర్థులు ప్రజలను ఆకర్షించడానికి పోటా పోటీగా ప్రచారాలు, సభలు, రోడ్డు షోలు నిర్వహిస్తున్నారు. ఒకరిని మించి మరొకరు తమదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. డబ్బులు ఇచ్చి జన సమీకరణ చేయడంతో ఏ సభకు, సమావేశానికి వెళ్లిన ఆదే జనం దర్శనమిస్తున్నారు. ఎవరు డబ్బులు ఇచ్చినా వెళ్లుతున్నాము కానీ తమకు అన్ని విధాలుగా ఉపయోగ పడే నాయకుడికి ఎన్నుకునేదుకు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ప్రజలు తెలుపుతున్నారు.

కుల సంఘాలకు ప్రత్యేక ప్యాకేజీలు

అభ్యర్థులు కుల ప్రతిపాదికన ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఆయా కులానికి చెందిన వ్యక్తులను సమావేశ పరిచి వారికి విందులు, ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు. తమ కులానికి చెందిన ఓట్లు పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు వహించాలని సూచిస్తున్నారు.

నిఘా విభాగంలో లీకు వీరుడు

- రహస్య విచారణలు బహిర్గతం
- దృష్టి సారించని ఉన్నతాధికారులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 28: పోలీసు నిఘా విభాగంలో ఓ లీకు వీరుడున్నట్లు సమాచారం. దశాబ్ద కాలానికి పైగా కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సదరు అధికారి.. శాఖాపరంగా చేసే రహస్య విచారణలు, సర్వేలు లీకు చేస్తుంటాడనే ప్రచారం ఉంది. పోలీసు శాఖలో అత్యంత ప్రధానమైన నిఘా విభాగంలో విధులు నిర్వహిస్తున్న సదరు అధికారి.. ఎన్నికల బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై రహస్యంగా చేసే సర్వే నివేదికలను లీకు చేస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. భూ కబ్జాలు ఇతరత్రా నేరాలపై చేసే విచారణలో ఈయన చేతివాటం చూపిస్తాడనే విమర్శలున్నాయి. రహస్య విచారణలను కబ్జాదారులకు లీకు చేసి వారు అప్రమత్తం అయ్యేలా సహకరిస్తాడనే ఆరోపణలున్నాయి.

గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములపై నిర్వహించే సర్వేలను ముందే అభ్యర్థులకు చేరవేశాడనే విమర్శలున్నాయి. ఎవరు అధికారంలో ఉంటే వారి పాటపాడే సదరు అధికారి.. నగరంలో పలు నేరాలపై జరిగే విచారణలు, సర్వేలను లీకు చేశాడని సమాచారం. నిఘా విభాగానికి ఏ అధికారి ఇన్‌చార్జిగా వచ్చినా తన బుట్టలో వేసుకుని ఆయన చేసిందే సర్వే, విచారణ అనే చందంగా నడిపిస్తుంటాడని తెలిసింది. ఇతడిపై ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఈయన చేసిన తప్పుడు నివేదికలు, సర్వేల లీకులకు సంబంధించి ఆధారాలతో ఫిర్యాదులు ఉన్నతాధికారులకు చేరినట్లు తెలిసింది. మొత్తంగా సదరు లీకు వీరుడి వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. లేదంటే సదరు అధికారి ఇచ్చే లీకులు శాఖ అధికారుల మెడకు చుట్టుకునే అవకాశం లేకపోలేదు.

ఓరుగల్లులో విద్యాదాతలు

- విద్యాభివృద్ధికి తొలితరం ఎంపీలు

బాకర్ అలీ మీర్జా, ఇటికాల, ఎస్‌బి గిరి కృషి


ఇటికాల మధుసూదనరావు


బాకర్ అలీ మీర్జా


ఎస్‌బి గిరి

హనుమకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం నెరిపిన బాకర్ అలీ మీర్జా గురించి చాలా మందికి తెలియదు. 1962 ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. సమీప ప్రత్యర్థి ఎస్.రామనాథంపై కేవలం 736 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈయన 1967 ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూడా గెలిచారు. నిజాం వారసుల్లో ఒకరు బాకర్ అలీ. అత్యున్నత విద్యావంతుడు. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ నుంచి బీఏ, అలాగే ఆక్స్‌ఫర్డ్‌లోని సెయింట్ కేథరీన్ కళాశాల నుంచి బీఏ (ఆనర్స్) చేశాడు. తర్వాత కొలంబియాకు వెళ్లి అక్కడ ఎంఏ పూర్తి చేశాడు. 1940లో ఫ్రాంక్‌ఫర్ట్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. హైదరాబాద్ ప్రభుత్వంలో ఫారెస్ట్ అసిస్టెంట్ కన్జర్వేటర్‌గా పని చేశాడు. 1929లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్మిక విభాగంలో చేరాడు. అప్పటినుంచి భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు అత్యంత సన్నిహితుల్లో ఒకరుగా మారారు. 1962 ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బకర్ అలీ మీర్జా పేరును నెహ్రూ సిఫార్సు చేశారు. అయితే ఆయనను గెలిపించే బాధ్యతను 1962 ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీలో నిలిచిన ఇటికాల మధుసూదన్‌రావు నెహ్రూ అప్పగించారు. ఇటికాలకు నెహ్రూతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఆయన ఆదేశాలను కాదనలేకపోయారు. మధుసూదన్‌రావు మహబూబాబాద్ నుంచి విజయం సాధించడమే కాకుండా వరంగల్ నుంచి మీర్జా గెలుపొందడానికి కూడా తోడ్పడ్డాడు. ఆ తర్వాత నెహ్రూ సూచన మేరకు వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధి బాధ్యతను కూడా మీర్జా పక్షాన మధుసూదన్‌రావు తీసుకున్నారు. వరంగల్‌లో ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాల, కాకతీయ వైద్య కళాశాల స్థాపనలో ఆయన కృషి ఉంది.

ఇటికాల మధుసూదన్ రావు

ఇటికాల మధుసూదన్‌రావు ఆదర్శ ఎంపీ. వరంగల్ జిల్లాలో విద్యారంగం అభివృద్ధికి బాటలు వేసింది ఆయనే. తొలి తరం ఎంపీల్లో ఆయన ఒకరు. 1957, 1962 ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండు సార్లు గెలిచారు. 1957 ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి ఎస్.రామనాథంపై 1962 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి టీఎస్ రావుపై గెలుపొందారు. మధుసూదన్‌రావు జీవితం అంతా పోరాటాలతోనే గడిచింది. 1938లో మొదటి సత్యాగ్రాహిగా జైలు శిక్ష అనుభవించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారు. 1947లో రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొని కఠిన కారాగార శిక్ష అనుభవించాడు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన మధుసూదన్‌రావు.. ఆ దిశగా ఎంతో కృషి చేశారు. కేంద్రంతో పోరాడి తిరుపతికి వెళ్లాల్సిన ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజీని (ప్రస్తుతం వరంగల్ నిట్) వరంగల్‌లో నెలకొల్పేలా చేశాడు. ప్రధాని నెహ్రూను వరంగల్‌కు రప్పించి ఆయన చేతుల మీదుగా ప్రారంభింప చేశాడు. కాకతీయ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సాధనలో కీలకపాత్ర పోషించారు. వరంగల్‌లోని పలు ఇతర అభివృద్ధి పనుల్లో ఆయన కృషి ఉంది. 46 ఏళ్ల వయసులోనే 1964లో కన్నుమూశారు. దీనితో 1965లో వచ్చిన ఉప ఎన్నికల్లో మహబూబాబాద్ లోకసభ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం సురేందర్ రెడ్డి పోటీ చేసి తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.

ఎస్‌బీ గిరి

1971, 1977 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు వరంగల్ లోకసభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఎస్‌బీ గిరి తెలంగాణ ఉద్యమకారుడు, కార్మిక నాయకుడు. తెలంగాణ తొలి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ ప్రజాసమితి (టీపీఎస్) పక్షాన 1971లో పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ రెడ్డిపై గెలుపొందారు. 1977 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి బీఎల్‌డీ అభ్యర్థి సి.జంగారెడ్డిపై విజయం సాధించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా పీడీ చట్టం కింద నిర్బంధానికి గురయ్యారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ (బోధన్) యూనియన్ అధ్యక్షుడిగా దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఐడీఎల్ కెమికల్ లిమిటెడ్, హెచ్ఎఎలక్ష్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. ఆజంజాహి మిల్లు కార్మికుల సంక్షేమానికి విశేషంగా కృషి చేశారు.

సీపీఐ నేత పుల్లయ్య సేవలు మరువలేనివి

ధర్మసాగర్, ఏప్రిల్ 28: సీపీఐ సీనియర్ నాయకుడు మోరే పుల్లయ్య (70) పార్టీకి చేసిన సేవలు మరువలేమని సీపీఐ జిల్లా నాయకులు ఎదునూరి రాజమౌళి అన్నారు. ఆదివారం ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లి గ్రామంలో నిర్వహించి సంస్మరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సీపీఐ పార్టీ బలోపేతం, వ్యవసాయ కార్మికుల వేతనల పెంపు కోసం, పేదలకు భూములను పంపిణీ చేయాలని భూపోరాటం చేసిన నాయకుడని కొనియాడారు. దేవునూర్ ఇనురాతి గట్ల వద్ద ఉక్కు పరిశ్రమ నిర్మించాలని, రిజర్వాయర్ ఏర్పాటు చేసి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని సంవత్సరాల తరబడి అలుపెరగాని పోరాటం చేసిన యోధుడు పుల్లయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో జీర్ణోద్ధారణ పనులు ప్రారంభం



ఆలయ జీర్ణోద్ధారణ పనులు ప్రారంభంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

మడికొండ, ఏప్రిల్ 28: మడికొండలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రహరీ, యాగశాల, గణపతి ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, పూర్వవైభవం తీసుకురావాలని ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు పనులు మొదలెట్టారు. అందులో భాగంగా ఆదివారం జీర్ణోద్ధరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కళ్లెపు నరేష్, ఉపాధ్యక్షులు దువ్వ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గుడుగుల నరేందర్, నార్లగిరి సతీష్, కడార్ల నరేందర్, బోగి దయాకర్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దువ్వ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పల్లపు అర్జున్, బైరి లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి నిగ్గుల సతీష్‌కుమార్, ఎండీ రహీమ్, పాండ్యాల సంపత్, పత్తిపాక ఉపేంద్రాచారి, దువ్వ నవీన్ తదతరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్‌షోకు తరలిన శ్రేణులు



జెండా ఊపి బీఆర్ఎస్ శ్రేణులను రోడ్ షోకు తరలిస్తున్న కార్పొరేటర్ రాధికారెడ్డి

మడికొండ, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం హనుమకొండలో జరగగా మడికొండ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలి వెళ్లారు. 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి జెండా ఊపి కేసీఆర్ రోడ్ షోకు సాగనంపారు.

మడికొండలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మడికొండ, ఏప్రిల్ 28: ఎండలు ఉంటున్నందున ప్రయాణికులు, వాహనదారు లు దాహార్తితో అలమటిస్తున్నారు. ఈక్రమంలో మడికొండకు చెందిన వాసవీ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పెద్ది సంతోష్‌కుమార్-భవాని, పెద్ది నవీన్- లావణ్య, పాలారపు కిరణ్‌కుమార్-స్రవంతి, డాక్టర్ వెంకటనారాయణ, గురుపతి, జ్ఞానేశ్వర్, శంకరమూర్తి, రఘునందన్, శ్రీనివాస్, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మడికొండ, ఏప్రిల్ 28: మడికొండకు చెందిన మండల ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1993లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమతో పాటు విద్యనభ్యసించిన తోటి విద్యార్థి అకాల మృతిపై ఆవేదన చెందారు. ఆదివారం ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.25వేలు నగదుతో పాటు బస్తా బియ్యం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్ల మోహన్, తొట్ల రాజుయాదవ్, పి.రవి, జానపట్ల శ్రీనివాస్, గడ్డం శ్రీను, బోగి రాజపోషాలు, బైరి సురేందర్, డి. మహేశ్, బోగి కుమార్, కల్లెపు నరేష్, లక్ష్మణ్, మార్కండేయ, నల్ల శ్రీనాథ్, రవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్ననీటి వనరులకు
మోక్షమెప్పుడో..?

- లీకేజీలతో చెక్‌డ్యామ్ నీరు వృథా
- సాగునీటికి తండ్లాడుతున్న అన్నదాతలు




నీరు నిల్వలేకుండా పోయిన జగ్గయ్యగూడెం చెక్‌డ్యామ్

ఐనవోలు, ఏప్రిల్ 28: ఆకేరు వాగు పరివాహక ప్రాంత రైతులకు సాగు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏడు దశాబ్దాల కిందట నిజాం పాలనలో నిర్మించిన చెక్‌డ్యామ్ మరమ్మతులపై పాలకుల నిరక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వరద నీటిని చెక్‌డ్యామ్ ద్వారా చెరువులోకి పంపించడంతో పాటు నీరు నిల్వ చేసుకొని ఆ ప్రాంత రైతులకు నీరందిస్తోంది. కాగా, 4 యేళ్లుగా చెక్‌డ్యామ్‌కు ఏర్పడిన లీకేజీల కారణంగా నీటి నిల్వలు తగ్గి వేసవికి ముందే అడుగంటుతోంది. నీటి లీకేజీని అరికట్టాలని పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

నిజాం పాలనలోనే నిర్మాణం

ఆకేరు వాగుపై జగ్గయ్యగూడెం(నందనం) సమీపంలో బహుళ ప్రయోజనాలతో నిజాం పాలనలో ఈ చెక్‌డ్యామ్‌ను నిర్మించారు. వర్షాకాలంలో పైనుంచి వచ్చే వరదనీటితో చెక్‌డ్యామ్ నిండుకుండలా నిండాక పక్కనే ఏర్పాటు చేసిన కట్టు కాలువ ద్వారా వర్ధన్నపేట మండలం ఇల్లంద ఊర చెరువులోకి వరద పారి చెరువు నిండుతోంది. సుమారు 2 కిలోమీటర్ల వరకు చెక్‌డ్యామ్- చెరువు వరకు కట్టు కాలువను ఆ రోజుల్లోనే బందోబస్తుగా నిర్మించారు. ఇల్లంద చెరువు కింద అధికారికంగా 700 ఎకరాల ఆయకట్టు ఉండగా, ఒక సారి చెరువు నిండితే రెండు పంటలు సాగవుతాయి. మరో ప్రయోజనం ఏమిటంటే చెక్‌డ్యామ్‌లో నీరు నిల్వ ఉండి పరివాహక ప్రాంతంలోని బోరుబావుల్లో నీరు సమృద్ధిగా లభించి రెండు పంటలు పండుతాయి. మండు వేసవిలో సైతం చెక్‌డ్యామ్‌లో నిరు పుష్కలంగా ఉంటాయి. దీని వలన సుమారు 400 ఎకరాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పంటలకు నీరు అందుతుంది. ఈ మధ్యకాలంలో నీరు వేసవి పంట చేతికి అందకముందే తగ్గుతుంది.

చెక్‌డ్యామ్‌లకు లీకేజీలు.. వృథాగా నీరు..



నిజాం పాలనలో నిర్మించిన చెక్‌డ్యాం తూముల నుంచి లీకేజీలు

అప్పటి ఇంజనీర్ బండరాయిపై ఈ చెక్‌డ్యామ్‌ను నిర్మించారు. పెద్ద వరదలు వచ్చి చెరువులు, కుంటలు తెగిపోయిన చెక్‌డ్యామ్ కట్ట రాయి ఊడి పోకుండా ఇప్పటివరకు పటిష్ఠంగా ఉంది. కాకపోతే బండరాయిల్లో డంగు సున్నం ఊడి లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. ఈ లీకేజీలను అరికట్టాలని రైతులు విజ్ఞప్తులు చేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక మిషన్ కాకతీయ పేరిట చెరువులు, కుంటల అభివృద్ధి పనులు జరిపి చెక్‌డ్యాంలను నిర్లక్ష్యంగా వదిలేశారని రైతులు విచారం వ్యక్తం చేశారు. జగ్గయ్యగూడెం, నందనం, ఇల్లంద రైతుల ప్రయోజనాల కోసం చెక్‌డ్యాం లీకేజీల మరమ్మతులు చేపట్టి నీరు నిల్వ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం: జీవన్, ఇరిగేషన్ ఏఈ

చెక్‌డ్యామ్ నిర్మాణం పటిష్ఠంగానే ఉంది. తూములు, గోడకు అక్కడక్కడ లీకేజీలు ఏర్పడి నీరు పోతోంది. రూ.42 లక్షలతో చెక్‌డ్యామ్ లీకేజీలు, తూముల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. చెక్‌డ్యామ్‌లో నిరు నిల్వ ఉండటం వలన భూగర్భజలాలు పెరిగి సాగు, తాగునీరు లభిస్తుంది.

రఘునాథాచార్యుల సేవలు స్మరణీయం

- నేత్రపర్వంగా 99వ తిరునక్షత్రోత్సవ వేడుకలు
- గ్రంథాలను ఆవిష్కరించిన అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి



సంప్రదాయ గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 28: ఓరుగల్లు ఆధ్యాత్మిక శిఖరం, మహా మహోపాధ్యాయ నల్లాన్ చక్రవర్తుల రఘునాథానాచార్య స్వామి సంప్రదాయ వేడుకలు, ఆయన సూచించిన ఆధ్యాత్మిక మార్గాలు అందరికీ సదా ఆచరణీయమని త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి ఉద్బోధించారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరాలయం వేదికగా రఘునాథాచార్య స్వామి 99వ తిరునక్షత్రోత్సవ (జన్మదినం) వేడుకలు సంప్రదాయ పండితుల సమక్షంలో ఆదివారం వైభవంగా జరిగాయి. సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్టు అధ్యక్షుడు వెంకటేశ్వరాలయ స్థానాచార్యులు సముద్రాల పురుషోత్తమాచార్య ఆధ్వర్యంలో కార్యదర్శి ప్రముఖ సంస్కృత పండితుడు సముద్రాల శఠగోపాచార్య సంయోజకత్వంలో నేత్రపర్వంగా సాగాయి.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ.. నాలుగు దశాబ్దాల పాటు ఓరుగల్లు నేలపై ఆధ్యాత్మిక సౌరభాలను గుభాళింప చేసి, దేశ వ్యాప్తంగా అనేక మంది జీయర్లకు సైతం గురువుగా భాసిల్లిన రఘునాథాచార్య సేవలు నిత్య నూతనమన్నారు. నేటి తరానికి సంప్రదాయాలను నేర్పించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఆలయాల జీర్ణోద్ధరణ సంప్రదాయ గ్రంథాలను భావితరాలకు అందించేందుకు స్వామివారు చేసిన సేవలను జీయర్‌స్వామి కొనియాడారు. వారి ఆశయాలకనుగుణంగా శఠగోపాచార్య నడుం బిగించి సంప్రదాయ పరిరక్షణ సభ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు వారి వారసత్వాన్ని కొనసాగించినట్లవుతుందని ప్రశంసించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కిడాంబి రఘుపతి స్వామి రచించిన భాగవత ధర్మ ప్రదీపిక గ్రంథాన్ని, వరంగల్‌కు చెందిన డాక్టర్ ముడుంబై నర్సింహ రంగాచార్య విరచిత విష్ణు సహస్ర నామాలలో నృసింహనామ వైభవం, రఘునాథాచార్య అనువాదం గ్రంథాన్ని జీయర్ స్వామి ఆవిష్కరింపచేశారు. ప్రతీ ఏటా రఘునాథాచార్య స్వామి తిరునక్షత్రోత్సవ వేళ అందజేసే రఘునాథ దేశిక పురస్కారాలను ఈసారి శ్రీరంగంకు చెందిన పరాశర లక్ష్మి నృసింహ భట్టార్ స్వామి, మేల్కోటకు చెందిన డాక్టర్ జగ్గు వెంకటేషన్ అయ్యంగార్ స్వామిలకు నగదుతోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం దుశ్శాలువాలను అందజేస్తూ ఘనంగా సత్కరించారు. ఆహ్వానం సంఘం పక్షాన టీకే శ్రీనివాసన్, యాదగిరి, తదితర అనేక మంది ప్రముఖులు, సంప్రదాయ పండితులు వేడుకల్లో పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న కమిటీ బాధ్యులు

కాకతీయ మున్నూరుకాపు పరపతి సంఘం వార్షికోత్సవం

హనుమకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మున్నూరుకాపు పరపతి సంఘం 25వ వార్షికోత్సవం హనుమకొండ పద్మాక్షికాలనీలో ఆదివారం ఘనంగా జరిగింది. మున్నూరుకాపు భవనంలో జరిగిన ఈ వార్షికోత్సవంలో సంఘం అధ్యక్షుడు తోట కనకరాములు మాట్లాడుతూ.. సంఘ సభ్యులకు రుణ వితరణ చేయడంతో పాటు సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. క్రమశిక్షణ, నిబంధనల అమలుతో పాటు సభ్యుల సహకారంతో 25 ఏళ్లుగా విజయవంతంగా సంఘాన్ని నడుపుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, మిద్దెల బాబు, సంఘం ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి రవిబాబు, ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సానం జగదీశ్, కోశాధికారి బండారి మహేందర్, వరిమడ్ల సారంగపాణి, కర్రె సుదర్శన్, నల్లెల సురేందర్, తోట రమేష్, శెట్టి నరేందర్, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో భారీగా చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరూరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 28: హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ నివాసంలో ఆదివారం వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పరకాల, హసన్‌పర్తి, తొర్రూరు, పర్వతగిరి, గ్రేటర్ వరంగల్ నుంచి వందలాది మంది కార్యకర్తలు బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో కామారెడ్డి బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ చక్రపాణి, సాయికుమార్, హసన్‌పర్తి మండలం సుధనపల్లి నుంచి మాజీ ఉప సర్పంచ్ కల్లెపు సారయ్య, గుట్ట రాజేందర్, ప్రభాకర్, లక్ష్మణ్, తొర్రూరు మున్సిపాలిటీ నుంచి బీఆర్ఎస్ యూత్ నాయకులు తూర్పాటి మెండీస్, ముకేశ్, కల్యాణ్, సారయ్య, జలపతి, చందు, సతీష్, దేవ్, విశాల్, అశోక్, పర్వతగిరి మండలం మాల్యాతండా నుంచి గ్రామ పార్టీ అధ్యక్షుడు సుమన్, ఏనుగల్ నుంచి రాజు, గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ గండ్ల సింగారం నుంచి దుంపల మహేందర్, రాము చేరారు.

'అరూరి' గెలుపు కోసం ప్రచారం

కాజీపేట : ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ బలపరిచిన బీజే పీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ఆదివారం కాజీపేట సోమిడిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ మాట్లాడుతూ.. ఇంటింటికీ ఎస్సీ వర్గీకరణకోసం ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మద్దతు తెలిపిన అరూరి రమేశ్ కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అవకాశ వాద రాజకీయాలు చేసే కడియం శ్రీహరి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ, జిల్లా కార్యదర్శి మంద స్వరాజ్, సహాయ కార్యదర్శి కుమ్మరి శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జి మంద వర్ధన్, కాజీపేట మండల కార్యదర్శి ఇనుగాల రాజు, కార్యదర్శి కుమ్మరి సన్నీ, కొడవటి సందీప్ తోపాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

● ధర్మసాగర్: వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ధర్మసాగర్ మండలం ధర్మపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ పార్టీ కరపత్రాలు పంచుతూ ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్ మాదిగ, శాంతి సాగర్, బాలస్వామి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన సర్జరీలు

- అవస్థల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రోగులు
- ఆపరేషన్ థియేటర్‌లో పనిచేయని చిల్లర్స్

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 28: హనుమకొండ కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆపరేషన్లు నిలిచిపోయాయి. ఇన్ పేషంట్లతో పాటు ఔట్ పేషెంట్ల సేవలు కూడా నిలిచిపోయాయి. అంకాలజీ, పిడియాట్రిక్ సర్జరీ, న్యూరో సర్జరీ విభాగంలోని థియేటర్లలో మూడు చిల్లర్స్ పని చేయడం లేదు. వీటిని మరమ్మతు చేయకపోవడంతో ఈ విభాగాల్లో సర్జరీలన్నీ వాయిదా పడుతున్నాయి. నూతనంగా నిర్మించిన ఈ ఆస్పత్రిలో ఇప్పటికే 60 ఫ్యాన్లు పని చేయడం లేదు. ఫలితంగా వాటిలో ఉన్న రోగులు తీవ్ర అవస్థ పడుతున్నారు. ఎండాకాలంలో ఆస్పత్రి వైపు రావాలంటే రోగులు జంకుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ ఆస్పత్రిలో కనీస సౌకర్యా లు కల్పించకపోవడంపై రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్యాన్లతోపాటు చిల్లర్స్ మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆయనకు 80.. ఆమెకు 70

- మనవళ్లు, మానువరాళ్ల కోరికతో వృద్ధుల వివాహం
- మనుమడి పుట్టినరోజు సందర్భంగా తండాలో సందడి

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 28 : ఆయనకు ఎనభై ఏళ్లు.. ఆమెకు డెబ్బై.. అయితేనేం.. ఈ వృద్ధాప్యంలో నవదంపతులుగా బోసి.. బోసి.. నవ్వులు పండిస్తూ.. వివాహ వేడుకను జరిపించుకున్నారు. మనవళ్లు, మనవరాళ్ల ఆకాంక్ష మేరకు వారి మనవడైన యాకూబ్ పుట్టిన రోజు సందర్భంగా తాత-నానమ్మల పెళ్లి జరిపించాలన్న సంకల్పాన్ని ఆచరణ రూపంలో పెట్టారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం వస్రాంతండలో ఆదివారం చోటు చేసుకున్న ఈ అరుదైన వివాహ వేడుక వివరాలు తండా వాసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. వస్రాం తండాకు చెందిన గుగులోత్ సమీడానాయక్ (80) లాలి (75) గత 60 ఏళ్ల నుంచి వివాహం చేసుకోకుండానే ఒకరికొకరు ఇష్టపడి సహజీవనం కొనసాగిస్తున్నారు. వీరికి నలుగురు కుమారులు, కూతురు సంతానం. వారి పిల్లలు ఐదుగురు మనమళ్లు, ఐదుగురు మనమరాళ్లు ఉన్నారు.

ఆ వృద్ధులకు వివాహం జరుగలేదన్న విషయాన్ని గ్రహించిన మనువళ్లు, మనుమరాళ్లు ఆ తంతును జరిపించాలని సంకల్పించారు. ఈ విషయాన్ని తండా పెద్దలకు చెప్పి తాత-నానమ్మల అనుమతి తీసుకుని ఆదివారం తమలో ఒకరైన మనువడి వరుస యాకూబ్ పుట్టినరోజు సందర్భంగా వివాహాన్ని పెద్దల సమక్షంలో ఘనంగా జరిపించారు. స్వయాన పురోహితుడు హాజరై వివాహ తంతును సంప్రదాయ ప్రకారం నిర్వహించారు. బోసి నవ్వులతో నల్లకళ్ల అద్దాలు పెట్టుకున్న తాత.. నానమ్మతో కలిసి సందడి చేశారు. అక్షింతలు పోటీపడి పోసుకున్నారు. మొత్తానికి తండాలో వృద్ధుల పెళ్లి సండే సందడిగా మారింది.



వివాహం చేసుకుంటున్న వృద్ధులు

నగరంలో జోరుగా వేసవి శిబిరాలు

- పిల్లలకు ఆట విడుపుగా శిక్షణలు
- వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్రజ్ఞ శిబిరం



పిల్లలకు నృత్యంలో శిక్షణ ఇస్తున్న తాడూరి రేణుక

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 28: వేసవి సెలవులను ప్రకటించిన నేపథ్యంలో పిల్లలకు వారి అభిరుచి మేరకు శిక్షణ ఇప్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా నగరంలో వేసవి శిబిరాలు జోరుగా వెలిశాయి. అనేక చోట్ల ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణా శిబిరాలను ప్రారంభింపజేశారు. హనుమకొండ సుబేదారిలోని నృత్య స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి వేసవి శిబిరం ప్రారంభమైంది. కూచిపూడి, భరతనాట్య, జానపద అంశాల్లో పిల్లల, వారి తల్లిదండ్రుల అభిరుచి మేరకు బ్యాచ్‌ల వారిగా శిక్షణ ఇవ్వనున్నట్లు స్రవంతి నృత్య కళాక్షేత్రం అధ్యక్షురాలు తాడూరి రేణుక చెప్పారు. రెండున్నర దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు నృత్యంలో శిక్షణ ఇచ్చామన్నారు.

హనుమకొండలోని నక్కలగుట్టలోని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్రజ్ఞ పేరిట వ్యక్తిత్వ వికాస, ఆధ్యాత్మిక వేసవి శిబిరాన్ని మే 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ తెలిపారు. భగవద్గీత శ్లోకాలు, అన్నమాచార్య కీర్తనలు, చిత్రలేఖనం, యోగా, నీతి కథలు తదితర అన్ని అంశాల్లో పిల్లలను తీర్చి దిద్దేందుకు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. హనుమకొండ కేయూ రోడ్డులోని అరబిందో సొసైటీ ఆధ్వర్యంలో బాలబాలికలకు వేసవిలో హిందుస్థానీ సంగీత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి వరిగొండ కాంతారావు చెప్పారు. మే 31 వరకు కొనసాగే శిబిరాన్ని ప్రముఖ సంగీత కళాకారుడు ప్రొఫెసర్ వి.తిరుపతయ్య లాంఛనంగా ప్రారంభించారు. మహ్మద్ బాబుమియా ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగుతుంది. ఓరుగల్లు ప్రాంతానికి తలమానికంగా నిలిచే పేరిణి నృత్య అంశంలో ప్రత్యేక వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శిబిర సంచాలకులు పేరిణి నాట్యాచార్యులు గజ్జెల రంజిత్, నవ్యజలు తెలిపారు. హనుమకొండ, వరంగల్ ప్రాంతానికి చెందిన ఔత్సాహికులు ఈ శిబిరంలో పాల్గొని పేరిణిలో తర్ఫీదు పొందవచ్చునన్నారు. హనుమకొండలోని జవహర్ బాలభవన్‌లో కూడా వేసవి శిబిరం ప్రారంభించినట్లు శిబిర నిర్వాహకులు తెలిపారు.

వాసవీమాత పారాయణం



అమ్మవారిని తీసుకొస్తున్న ప్రకాశ్‌రావు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 28: సిరులునొసగు తల్లి శ్రీవాసవి మాత రావమ్మ పేరుతో ఆర్యవైశ్యులు వరంగల్ చౌరస్తాలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో వాసవీమాత పారాయణం చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో 500 మంది భక్తులు పారాయణం చేశారు. ప్రకాష్‌రావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు దైవ చింతనతో సద్బుద్ధి, మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనుపునూరి వీరన్న, కార్యవర్గ సభ్యులు కొండూరి శివప్రసాద్, అంచూరి శ్రీనివాస్, భవాని ప్రసాద్, పాపారావు, కల్వ నాగరాజు, చిట్టిమళ్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం అండగా.

పసి వయసులో పోలియో... ఆమె కాలు కదలనివ్వలేదు.
కానీ పట్టుదలతో చదివి... ఆత్మవిశ్వాసంతో నిలబడింది.
నేడు తనలాంటి ఎంతోమందికి దిక్సూచిగా మారి... ఆత్మస్థైర్యం నింపి...
ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. సామాజిక కార్యకర్తగా, రచయిత్రిగా, అథ్లెట్‌గా...
ఎన్నో హృదయాలను గెలుచుకున్న అమితా పటేల్ విజయ గాథ ఇది.



"కష్టాలు అందరికీ వస్తాయి. సవాళ్లు ఎదురవుతాయి. వాటిని అధిగమించి ముందుకు సాగితేనే జీవితం. ఇది నాకు చిన్నప్పుడే బోధపడింది. అందుకు కారణం నా వైకల్యం. నాకు ఏడాదిన్నరప్పుడు పోలియో మహమ్మారి సోకిందని వైద్యులు నిర్ధారించారు. ఇక అప్పటి నుంచి మా అమ్మానాన్నలకు కంటి మీద కునుకులేదు. అలాగని వారు బాధపడుతూ... నన్ను బాధ పెట్టలేదు. వైకల్యాన్ని మరిచిపోయేలా నాకంటూ ఒక మెరుగైన జీవితం ఇవ్వాలనుకున్నారు. దానికి తగ్గట్టుగానే నన్ను ఎంతో అపురూపంగా పెంచారు. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ సమీపంలోని జోధ్‌పూర్ మా ఊరు. ఊహ తెలిసినప్పటి నుంచీ వైకల్యంతో పోరాడుతున్నాను. దీనివల్ల ఎన్నో ఇబ్బందులు, అవహేళనలు. అన్నిటినీ తట్టుకొని నిలబడ్డానంటే అందుకు మా అమ్మానాన్నల ప్రేమ, మార్గదర్శనం, ప్రోత్సాహం కారణం.

బడికి వెళ్లలేక...

నా పరిస్థితి ఏంటో నాకు బాల్యంలోనే అర్థమైంది. చక్రాల కుర్చీ లేనిదే అడుగు బయటకు పెట్టలేను. ఈ వైకల్యాన్ని జయించాలంటే నన్ను నేను నిరూపించుకోవాలి. నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలి. వీటన్నిటికీ పునాది విద్య ఒక్కటేనని అమ్మానాన్నలు చెప్పారు. వారి అండతో ఉన్నత చదువులు చదవాలని కలలు కన్నాను. కానీ బడికి వెళ్లడమే గగనమైపోయింది. కష్టపడి వెళ్లినా... తరగతి గదుల్లో కూర్చోవడం, తిరిగి బయటకు రావడం... ఇలా ప్రతిదీ సమస్యగానే మారింది. పాఠశాలల్లో నాలాంటి వికలాంగులకు ఎక్కడికైనా వీల్‌చైర్‌లో వెళ్లగలిగేలా సరైన సౌకర్యాలు ఉండేవి కావు. మరి నా చదువుకు మార్గం ఏమిటి? ఈ ఆలోచన మా ఇంట్లోవాళ్లను కొన్నాళ్లు సందిగ్ధంలో పడేసింది. అయితే నా ప్రతిభాపాటవాల మీద వాళ్లకు ఎంతో నమ్మకం. చివరకు స్థానిక గ్రామ పంచాయత్ స్కూల్లో చేరాను.

భవిష్యత్తుకు పునాది...

చదువుకోవాలన్న నా దృఢ సంకల్పానికి, నా భవిష్యత్తుకు, నాపై అమ్మానాన్న పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడానికి ఆ పాఠశాలలోనే పునాది పడింది. క్రమంగా పదో తరగతి, హెచ్ఎస్‌సీ, బీఏ, ఆ తరువాత ఎల్ఎల్‌బీ



పూర్తి చేశాను. నా విద్యాభ్యాసంలో ప్రతి మైలు రాయినీ ఎనలేని అంకితభావంతో అధిగమించాను. అదే సమయంలో నాలాంటివారికి అండగా నిలబడి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని నిర్ణయించుకున్నాను. దాంతోపాటు సామాజిక అంశాల మీద కూడా పరిజ్ఞానం పెంచుకున్నాను.

ప్రతిచోటా తిరస్కరణలే...

మొదటి నుంచి నా కాళ్లపై నేను నిలబడాలన్న తపన. అందుకే చదువు అవ్వగానే అమ్మానాన్నకు భారం కాకుండా మంచి ఉద్యోగంలో స్థిరపడాలనుకున్నాను. వృత్తి విద్య, కంప్యూటర్ కోర్సులు చాలా నేర్చుకున్నాను. నా వైకల్యం వల్ల కార్పొరేట్ కంపెనీల నుంచి తిరస్కరణలే ఎదురైంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తే... వ్యవస్థీకృత అడ్డంకులు ఎదురయ్యాయి. ఇక్కడే నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఉద్యోగ ప్రయత్నాలకు మార్గం మూసుకుపోవడంతో సొంత వ్యాపారం ప్రారంభించాలని అనుకున్నాను.

సరికొత్త అధ్యాయం...

ఈ నేపథ్యంలోనే 1992లో నా జీవితంలో ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలికాను. కంప్యూటర్ కోర్సులు నేర్పే ఇనిస్టిట్యూట్ ఒకటి నెలకొల్పాను. అది కూడా మా ఇంట్లోని ఒక గదిలో. వైకల్యం ఉన్నవారితో పాటు ఏ ఆధారం లేని యువతను సాధికారత దిశగా నడిపించడానికి అది నేను వేసిన తొలి అడుగు. కేవలం కంప్యూటర్ విద్య మాత్రమే కాకుండా... వారిలో ఆత్మవిశ్వాసం నింపి, భవితకు భరోసా కల్పించేందుకు ప్రాధాన్యం ఇచ్చాను. వికలాంగులకు ఉచిత విద్య అందిస్తున్నాను. దాంతోపాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నాను. ముఖ్యంగా నాలాంటివారికి పెళ్లిళ్లు అవ్వడం చాలా కష్టం. అందుకే... నా దగ్గరకు విద్య అభ్యసించే అలాంటి విద్యార్థుల పెళ్లి బాధ్యత కూడా నేనే తీసుకున్నాను. 'దివ్యాంగ్ రోజ్‌గార్ మేళా, దివ్యాంగ్ జీవన్‌సాథీ' లాంటి కార్యక్రమాలు నిర్వహించి వారికి మంచి జీవితాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాను.

వారి గుండెల్లో నేను...

నా కృషివల్ల ఇన్నేళ్లుగా వేలమంది ప్రయోజనం పొందారు. అనేకమంది బాగా స్థిరపడ్డారు. అన్నిటికీ మించి వారి గుండెల్లో నాకు స్థానం ఇచ్చారు. నాకు... నా విద్యార్థులకు మధ్యనున్నది భావోద్వేగాల బంధం. ఇంతకు మించిన సంతృప్తి నాకు ఎక్కడ దొరుకుతుంది! సామాజిక కార్యకర్తగానే కాకుండా... నాకంటూ ఒక జీవితం ఉంది. నేను మంచి అథ్లెట్‌ను కూడా. జావెలిన్ త్రోలో చాలా పతకాలు సాధించాను. కవిత్వం రాస్తాను. మన సామర్థ్యానికి, వేరొకరికి స్ఫూర్తిగా నిలవడానికి వైకల్యం అనేది అవరోధం కాదని ఈ సమాజానికి నిరూపించడమే నా ఏకైక లక్ష్యం. అందులో కొంతవరకు విజయం సాధించాని గర్వంగా చెప్పగలను."



వివాదాలు చుట్టుముట్టినా, వైఫల్యాలు ఎదురైనా... 'తగ్గేదిలే' అనే స్వభావం మీసా భారతి సొంతం. తెరవెనుక రాజకీయ వ్యవహారాల్లో చాతుర్యం, ముక్కు మీద కోపం... ఇవీ ఆమె గురించి వినిపించే విశేషణాలు. పాటలీపుత్ర నుంచి మూడోసారి పోటీకి దిగిన లాలూగారి పెద్దమ్మాయి... ప్రధాని మోదీని జైల్లో పెట్టిస్తామంటూ చేసిన వ్యాఖ్యలు బిహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కించాయి.

పంతం కోసం ఎందాకైనా...

"రామ్ కృపాల్ యాదవ్ అంటే మాకు ఎంతో గౌరవం ఉండేది. కానీ మమ్మల్ని మోసం చేసి బిజెపిలో చేరారు. ఆ సంగతి తెలియగానే... గడ్డిని ముక్కలు చేసే యంత్రంతో అతని చేతులు నరికెయ్యాలనుకున్నాను. నాకు ఎదురుపడితే అదే చేసేదాన్ని..." 2014 లోక్ సభ ఎన్నికల ప్రచారంలో మీసా భారతి ఆగ్రహంతో అన్న మాటలివి. ఆమె తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు రామ్ కృపాల్ కుడి భుజం. లాలూ పార్టీ అయిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) తరఫున పట్నా నుంచి ఎంపీగా కూడా గెలిచారు. కానీ 2009లో పట్నా నుంచి లాలూ స్వయంగా పోటీ చేయడంతో... రామ్ కృపాల్‌కు అవకాశం దక్కలేదు. 2014లో తనకు పాటలీపుత్ర పార్లమెంట్ సీటు ఇవ్వాలని లాలూను ఆయన కోరారు. కానీ అప్పటికే ఆ స్థానం మీద లాలూ తొలి సంతానమైన మీసా భారతి కన్నుపడింది. ఎందుకంటే... ఆమె భర్త శైలేష్ సొంత ఊరు దామాపూర్. అది పాటలీపుత్ర పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఉంది. చివరకు ఆమెనే అభ్యర్థిగా లాలూ ప్రకటించారు. దాంతో ఆర్‌జెడికి రామ్ కృపాల్ రాజీనామా చేసి, బిజెపిలో చేరారు. మీసాను ఓడించారు. కేంద్ర మంత్రి అయ్యారు. 2019 ఎన్నికల్లోనూ రామ్ కృపాల్ చేతిలో మీసా ఓటమి పాలయ్యారు. ఈ పరాజయాలను మీసా చాలా వ్యక్తిగతంగా తీసుకున్నారని చెబుతారు ఆమె సన్నిహితులు. పార్టీకి కంచుకోటల్లాంటి వేరే స్థానాలేవైనా ఎంచుకొనే వెసులుబాటు ఆమెకు ఉంది. అదీగాక... రెండు విడతలుగా రాజ్యసభ సభ్యురాలుగా కూడా ఆమె కొనసాగుతున్నారు. ఎంపీగా ఆమె హోదాకు ఎలాంటి ఢోకా లేదు. అయితే "ఎప్పటికైనా రామ్ కృపాల్‌ను ఓడించి తీరుతాను" అని మీసా పంతం పట్టారు. అందుకే ఈసారి కూడా పాటలీపుత్ర నుంచి... రామ్ కృపాల్‌కు ప్రత్యర్థిగా ఆమె బరిలోకి దిగారు. ఇటీవలే ఆ పార్లమెంటరీ స్థానానికి పోలింగ్ ముగిసింది. ఈ విడత ప్రచారంలో మీసా తన వ్యాఖ్యలకు మరింత పదునుపెట్టారు. ప్రధానమంత్రి మోదీపై విపక్షాలు ఎన్నో విమర్శలు చేస్తూ ఉండొచ్చు. కానీ "మా కూటమి అధికారంలోకి వస్తే మోదీతో సహా బీజేపీ నాయకులందర్నీ జైల్లో పెట్టిస్తాం" అనే ధైర్యం చేసింది బహుశా మీసాయే కావచ్చు. ఆమె వ్యాఖ్యలపై బిజెపి వర్గాలు తీవ్రంగా విరుచుకుపడ్డాయి. దాంతో తన మాటలకు ఆమె వివరణ ఇస్తూ "ఎలక్టోరల్ బాండ్స్ గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మీదే నేను మాట్లాడాను. మా ప్రభుత్వం వస్తే వాటి మీద విచారణ జరిపించి, దోషులకు శిక్ష వేయిస్తామన్నాను. నా మాటలు వక్రీకరించారు" అంటూ సమర్థించుకున్నారు.

హార్వర్డ్ వివాదం...

మాటలతో, చేతలతో వివాదాల్ని కొనితెచ్చుకోవడం మీసాకు కొత్తేం కాదు. 2015 మార్చిలో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఇండియన్ కాన్ఫరెన్స్‌లో తాను ప్రసంగించానని సూచించే కొన్ని ఫొటోలను ఫేస్‌బుక్‌లో, ట్విట్టర్‌లో మీసా భారతి పెట్టారు. వాటిని బిహార్‌లోని వార్తాపత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. దీని గురించి హార్వర్డ్ విశ్వవిద్యాలయం వర్గాలను జాతీయ మీడియా వాకబు చేసినప్పుడు... "మీసా భారతి ఇండియా కాన్ఫరెన్స్‌లోని ఏ ప్యానెల్‌లోనూ వక్త కాదు. ఆమె ప్రేక్షకురాలుగా, టిక్కెట్టు కొనుక్కొని హాజరయ్యారు" అని ఇ-మెయిల్ ద్వారా స్పష్టం చేశారు. ఆమె తన సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు అప్‌లోడ్ చేశారనీ, అవి తప్పుదారి పట్టించే విధంగా ఉన్నాయనీ, దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామనీ తెలిపారు. దరిమిలా... తప్పుడు సమాచారంతో మీసా భారతి ప్రజలను మోసం చేశారంటూ బీజేపీ నాయకుడొకరు ముజఫర్‌నగర్ కోర్టులో కేసు వేశారు. దాంతో మీసా నష్టనివారణ చర్యలకు దిగారు. "హార్వర్డ్ వర్సిటీలో జరిగిన ఇండియన్ కాన్ఫరెన్స్‌కు వెళ్లాను. పోడియం దగ్గర కొన్ని ఫొటోలు తీసుకున్నాను. నా స్నేహితులకు షేర్ చేశాను. వాటిని స్థానిక మీడియా సంపాదించి, దాని చుట్టూ కథ అల్లింది. నేను ప్యానల్‌లో ఉన్నానని ఎప్పుడూ చెప్పలేదు. సదస్సు తరువాత... ప్యానలిస్టులతో నా అభిప్రాయాలను వ్యక్తిగతంగా పంచుకున్నానంతే. ఎవరో ఔత్సాహికులు, అభిమానులు నేను వక్తనంటూ వాటిని సర్క్యులేట్ చేసి ఉంటారు. ఈ వ్యవహారం నా దృష్టికి రాగానే... వాటిని తొలగించేలా చేశాను. తప్పుడు ప్రచారాన్ని నేను ఎప్పుడూ కోరుకోలేదు. నా మీద అక్కసుతో కొందరు చేస్తున్న ఆరోపణలు ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి" అంటూ ఎదురుదాడికి దిగారు.

అమ్మ వెనుక చక్రం తిప్పి..

"మీసా చాలా కోపిష్టి. అనుకున్నది జరగాలంటుంది. ఎవరి మీదైనా కోపం పెంచుకుంటే... వారి అంతు చూడాల్సిందే" అని ప్రైవేటు సంభాషణల్లో ఆమె మేనమామ సాధుయాదవ్ వాపోయారనే కథ ఒకటి ప్రచారంలో ఉంది. నాడు దాణా కుంభకోణం కేసు నేపథ్యంలో... బిహార్ ముఖ్యమంత్రి పదవికి లాలూ రాజీనామా చేయడంతో... ఆ బాధ్యతలను ఆయన భార్య రబ్రీదేవి చేపట్టారు. మూడు విడతలుగా ఆమె సీఎం పదవిని నిర్వహించిన కాలంలో... పాలనా వ్యవహారాలన్నీ మీసాభారతి చేతుల మీదుగానే సాగాయి. అమ్మ వెనుక ఆమె చక్రం తిప్పి, అధికార యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో... తన తల్లి రబ్రీని కలుసుకోడానికి కూడా మేనమామ సాధు యాదవ్‌ను మీసా అనుమతించలేదు. ఆ తరువాత సాధు యాదవ్ ఆర్జేడీని విడిచిపెట్టాల్సి వచ్చింది. మీసా మీద, ఆమె భర్త మీద బినామీ ఆస్తులు, మనీ ల్యాండరింగ్, లెక్కచూపని ఆస్తులకి సంబంధించి అనేక ఆరోపణలున్నాయి. ఈడీ దర్యాప్తులు, ఆస్తులపై దాడులు, కీలకమైన పత్రాల స్వాధీనం లాంటివి జరిగాయి. "ఇలాంటి వాటికి బెదిరేది లేదు. ఇదంతా కుట్ర" అంటారు మీసా. లాలూ సీఎంగా ఉండగా... ఆమెకు అర్హత లేకపోయినా ఎంబీబీఎస్ సీటును పొందారంటూ అప్పట్లో విపక్షాలు గగ్గోలుపెట్టాయి. తను చదివిన పాట్నా మెడికల్ కాలేజీ అండ్



హాస్పిటల్ (పిఎంసిహెచ్)లో... గైనకాలజీలో టాపర్‌గా ఆమె నిలవడం, ఇన్ని విమర్శల మధ్య డాక్టర్ చదువు పూర్తి చేసినా... ఎప్పుడూ ప్రాక్టీస్ చేయకపోవడం... ఇలా ప్రతిదీ చర్చనీయాంశమే అయింది. వీటన్నిటినీ ఆమె కొట్టిపారేస్తారు. "నా పేరే ఒక అణచివేతపై ధిక్కారానికి ప్రతీక" అంటారామె. ఎమర్జెన్సీ సమయంలో... 'అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం' (మీసా) కింద లాలూ ప్రసాద్ అరెస్టయ్యారు. సుమారు రెండేళ్ళు జైల్లో ఉన్నారు. ఆ సమయంలో... 1976 మేలో జన్మించిన తన పెద్ద కుమార్తెకు... మీసా చట్టం కింద దేశంలో జరిగిన అణచివేతకు గుర్తుగా 'మీసా భారతి' అని పేరు పెట్టారు. కాగా... లాలూ-రబ్రీ హయాంలో బిహార్‌లో ఆటవిక పాలన నడిచిందనీ, పేదలు, వెనుకబడ్డ వర్గాలవారు, ఓబీసీల మీద అత్యాచారాలు, అణచివేతలు తీవ్రంగా సాగాయనీ విపక్షాల ఆరోపణ. దీనికి పరోక్షంగానైనా మీసా భారతి మద్దతు ఉందనే వాదనా ఉంది. ఒక అణచివేతపై ధిక్కారానికి చిహ్నంగా చెప్పుకొనే వ్యక్తే... మరో అణచివేతకు దోహదం చేయడం... మీసా కథలోని రాజకీయ వైచిత్రి.

ఆనందమే ఆరోగ్యం!

ఇపుడున్న పోటీ ప్రపంచంలో ఆనందం వెతుక్కున్నా దొరకనిది అయ్యింది. అయితే రొటీన్‌కి భిన్నంగా కాస్త ఆలోచిస్తే ఆనందం దొరక్కపోదు. ముఖ్యంగా ఆనందంగా ఉండటానికి ఇలాంటి టిప్స్ పాటించండి.

- మీ చుట్టూ నెగటివ్ పీపుల్ కాకుండా పాజిటివ్‌గా ఆలోచించేవాళ్లు ఉండేట్లు చూసుకోండి. అంటే పాజిటివ్ మైండ్స్‌తో కలసి తిరగటం వల్ల మంచి అలవాట్లు, అభిరుచులు కలుగుతాయి. అలా పాజిటివ్ ఎన్విరాన్‌మెంట్‌లో ఉంటే ఒత్తిడి తగ్గుతుంది. దీనివల్ల సంతోషంగా ఉండే అవకాశాలెక్కువ.
- ఏదైనా మీరు చేసిన తప్పులను యాక్సెప్ట్ చేయండి. మీ తప్పులనే మీరు ఒప్పుకోవటం అంటే మీలోని మీరు జయించటమే. నెగటివిటీకి నీట్‌గా తుడిచేయటమే. అంతేనా ఎక్కువగా మాట్లాడకుండా ప్రశాంతంగా ఉండండి. మనసు ప్రశాంతంగా ఉంటే మీరూ సంతోషంగా ఉండగలరు.
- మంచి ఆహారం తినటం, వ్యాయామం, చేసే పని మరింత బాగా చేయటం వల్ల ఫీల్‌గుడ్ ఉంటుంది. పర్ఫెక్ట్ డైట్ వల్ల ఎనర్జిటిక్‌గా ఉంటారు. తద్వారా మంచి నిద్ర పడుతుంది. దీనివల్ల ఆనందం కలుగుతుంది.
- ఎక్కువ సమయం మీతో మీరు గడపండి. ఏమీ పని



లేకుంటే సెల్ఫ్‌కేర్ తీసుకోవాలి అంటారు. పుస్తకం చదవటం, జిమ్‌కు వెళ్లటం, ఒంటరిగా తిరగటం, విశ్రాంతి తీసుకోవటం.. లాంటివి చేయటం వల్ల మైండ్ ప్రశాంతంగా ఉంటుంది. దీంతో ఆనందం సొంతమవుతుంది.

- కంప్యూటర్ స్క్రీన్, ఫోన్‌లో ఇంటర్నెట్ చూడటం లాంటివి అధికంగా చేస్తే ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. అందుకే డిజిటల్ డిటాక్స్ చేయాలి. నెట్ సమయాన్ని తగ్గించుకుని నిజమైన ప్రపంచంలో బతకాలి. అప్పుడే ఆనందం వెల్లివిరుస్తుంది.
- ఇతరుల పట్ల దయ, జాలి, మర్యాద లాంటివి ఇవ్వటంతో పాటు క్షమించే గుణం అలవరుచుకోవటం మంచిదే. దీనివల్ల మీలో నెగటివ్ ఎమోషన్స్ తగ్గిపోతాయి. ఎనర్జిటిక్‌గా ఫీల్ అవుతారు. కొత్త వస్తువులు, కొత్త ప్రదేశాలు తిరగటం వల్ల కూడా గ్రేట్‌గా ఫీల్ అయ్యే అవకాశాలెక్కువ.

నవ్య | చిత్రజ్యోతి

వినోదం ప్రధానంగా



'బలగం, ఓం భీమ్ బుష్' చిత్రాలతో సక్సెస్‌ను అందుకొన్నారు నటుడు ప్రియదర్శి. ఇప్పుడు ఆయన హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బేనర్స్‌పై జాన్వీనారంగ్ నిర్మిస్తున్నారు. 'సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ స్టోరీలో ప్రియదర్శి పాత్ర పూర్తి స్థాయి వినోదాన్ని పంచుతుంది. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ప్రీ ప్రొడక్షన్ పూర్తి చేసి జనవరిలో సెట్స్‌పైకి తీసుకెళ్తాం. త్వరలో టైటిల్ ప్రకటిస్తాం' అని మేకర్స్ తెలిపారు.

భయపెడుతున్న అదా శర్మ



చాలా రోజుల తర్వాత హీరోయిన్ అదా శర్మ తెలుగులో ఓ సినిమా చేస్తున్నారు. ఆ చిత్రం పేరు 'సీడీ'(క్రిమినల్ ఆర్ డెవిల్). కృష్ణ అన్నం దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న ఈ సినిమాను మే 10న విడుదల చేయనున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో అదా శర్మ యాక్షన్ సీక్వెన్స్, భయపెట్టే చూపులతో ప్రేక్షకులు కచ్చితంగా థ్రిల్ ఫీలవుతారు. ట్రైలర్‌లో విజువల్స్, రీరికార్డింగ్ .. అద్భుతంగా ఉన్నాయి. విశ్వంత్, 'జబర్దస్త్' రోహిణి, భరణీశంకర్, రమణ భార్గవ్, మహేశ్ విట్టా ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మాటలు: ముద్దుకృష్ణ, సినిమాటోగ్రఫీ: సతీశ్ ముత్యాల ,సంగీతం: ఆర్.ఆర్. ధ్రువన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గిరిధర్.

బంగారంలా ఉండాలంటే...



అనారోగ్య సమస్యల కారణంగా సినిమాలకు కాసింత విరామం ఇచ్చారు సమంత. 'ఖుషీ' తర్వాత సమంత ఏ మూవీకి అంగీకరించలేదు. 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌లో నటించారు. సమంత నటించే మరో చిత్రం ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం సమంత పుట్టిన రోజు. ఈ సందర్భంగా అభిమానులకు తీపి కబురును అందిస్తూ.. తను నటించబోతున్న నెక్ట్స్ సినిమా అప్‌డేట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె షేర్ చేశారు. ఈ సినిమా టైటిల్ 'మా ఇంటి బంగారం'. "బంగారంలా ఉండాలంటే ప్రతీ వస్తువు మెరవాల్సిన పని లేదు" అని పేర్కొంటూ ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను షేర్ చేశారు సామ్. ఈ సినిమాతో ఆమె నిర్మాతగా మారుతుండటం విశేషం. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమాను ఆమె నిర్మిస్తున్నారు. ఇందులో సమంత ఓ సైలెంట్ గృహిణి పాత్రలో కనిపించనున్నట్లు ఈ మోషన్ పోస్టర్‌ను చూస్తుంటే తెలుస్తోంది.

మనసుకు హత్తుకునే అనుబంధం



సముద్రఖని ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతోన్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. ధనరాజ్ కీలకపాత్ర పోషిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. పృథ్వీ పోలవరపు నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సముద్రఖని అన్నయ్య సహాయం లేకపోతే ఈ సినిమా చేయలేను. తండ్రీ కొడుకుల అనుబంధాన్ని మనసుకు హత్తుకునేలా ఆవిష్కరిస్తుంది ఈ చిత్రం' అన్నారు. సముద్రఖని మాట్లాడుతూ 'ధనరాజ్‌కు తల్లిదండ్రులు లేరు. సొంతంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాడు. అతనిపై నమ్మకంతో ఈ సినిమాకు దర్శకత్వం వహించమని చెప్పాను' అన్నారు. ధనరాజ్ మాట్లాడుతూ 'పిల్లలు అంతా తమ తండ్రితో కలసి చూడాల్సిన చిత్రం ఇది' అన్నారు.

ఇది బుల్లెట్ తెచ్చిన సక్సెస్



రవి వర్మ, సంజనా సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బుల్లెట్'. చౌడప్ప దర్శకత్వం వహించారు. ఎంసి రావు, బి గోపాల్, ఎమ్ వి మల్లిఖార్జున రావు, కోసూరి సుబ్రమణ్యం, మని నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. దర్శకుడు చౌడప్ప మాట్లాడుతూ "మంచి చిత్రాలను ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని ఈ చిత్రం సాధించిన విజయంతో మరోసారి రుజువైంది" అని చెప్పారు. చిత్ర నిర్మాత గోపాల్ మాట్లాడుతూ "ఈ మూవీ కోసం టీమ్ అంతా ఎంతో కష్టపడింది. ఈ విజయం మా కష్టానికి తగిన ప్రతిఫలం" అని అన్నారు. హీరో రవి వర్మ మాట్లాడుతూ "ఈ కాలంలో ఓ సినిమా విజయోత్సవ వేడుక జరుపుకోవడం అరుదు. అలాంటి భాగ్యాన్ని మాకు అందించిన ప్రేక్షకులకు రుణపడి ఉంటాం" అని అన్నారు.

రాజు యాదవ్ ఆట పాట..



నటుడు గెటప్ శ్రీను హీరోగా నటిస్తున్న చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కే ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి నిర్మిస్తున్నారు. మే 17న విడుదలవుతోంది. ఆదివారం చిత్ర బృందం 'దిస్ ఈజ్ మై దరిద్రం' అంటూ సాగే గీతాన్ని సుడిగాలి సుధీర్ చేతుల మీదుగా విడుదల చేసింది. కాసర్ల శ్యామ్ సాహిత్యానికి హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరాలు సమకూర్చారు. రాహుల్ సిప్లిగంజ్, మంగ్లీ ఆలపించారు. లవ్ కామెడీతో పాటు హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు సినిమాలో ఉన్నాయని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్, ఎడిటర్: బొంతల నాగేశ్వర్‌రెడ్డి.

జనసేనకే గాజు గ్లాసు
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు
- ఏపీలో ఆ పార్టీ పోటీ చేయని స్థానాల్లో ఇతరులకు ఈ గుర్తు కేటాయించనట్టే



అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గాజు గ్లాసు గుర్తును జనసేన పార్టీకి కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో జనసేన అభ్యర్థులు పోటీ చేయని చోట్ల ఇతరులకు గాజు గ్లాసు గుర్తును కేటాయించరు. జనసేన 21 స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తోందని, ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేయని స్థానాల్లో ఇతరులకు గాజు గ్లాసు గుర్తు కేటాయించాలని కొంతమంది ఈసీకి విన్నవించారు. దీనిపై జనసేన పార్టీ గట్టిగా పోరాటం చేసింది. గత వారం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు గాజుగ్లాసు గుర్తును జనసేనకు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా మెమో జారీ చేశారు. 26 జిల్లాల కలెక్టర్లకు, ఆర్వోలకు ఈ మేరకు ముందస్తు సమాచారం అందించారు.

పొన్నవోలుకు పదవి.. క్విడ్ ప్రో కో!
- చార్జిషీట్లలో వైఎస్ పేరు చేర్చినందుకు జగన్ చేసిన మేలు
- కాంగ్రెస్ కాదు... జగనే వైఎస్ పేరు చేర్పించారు
- జగన్‌పై షర్మిల సంచలన ఆరోపణలు



విశాఖపట్నం/అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి 'క్విడ్ ప్రో కో'లో భాగంగానే అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ)పదవి ఇచ్చారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు, సీఎం జగన్ సోదరి వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. సీబీఐ చార్జిషీటులో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు చేర్చడానికి పొన్నవోలు వేసిన పిటిషన్లే కారణమని... జగన్ ఆదేశాల మేరకే ఆయన ఇలాచేశారని ఆరోపించారు. ఆదివారం ఉదయం విశాఖలోని స్టీల్‌ప్లాంటు సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షర్మిల మాట్లాడారు. వైఎస్ పేరును కాంగ్రెస్ పార్టీ సీబీఐ చార్జిషీటులో చేర్పించిందని పులివెందుల సభలో జగన్ ఆరోపించినందుకే... తాను ఈ విషయాలు చెప్పాల్సి వస్తోందన్నారు. కాగా, వైసీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను చిత్తుకాగితమని షర్మిల అభివర్ణించారు. సీఎం జగన్ మళ్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారని, పాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా కొత్త మేనిఫెస్టో ఎందుకని ప్రశ్నించారు. పైగా పాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైసీపీ అధికారంలోకొచ్చాక ప్రత్యేక హోదా అంశాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేశారన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఒక్క పర్మినెంట్ బిల్డింగ్ కూడా కట్టలేదని, జగన్ మూడు రాజధానులు పేరు చెప్పి ఒక్కటీ పూర్తి చేయకుండా చేతికి చిప్ప ఇచ్చాడని విమర్శించారు. ఏపీలో ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడుస్తోందని.. టీడీపీ, వైసీపీలు కేంద్రంలోని బీజేపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని షర్మిల విమర్శించారు.

మాకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే తప్పా!
- వివేకా కుటుంబానికి అన్యాయం జరిగితే ప్రశ్నించొద్దా: సునీత

పులివెందుల, ఏప్రిల్ 28: "మాటలు జాగ్రత్త!! వివేకానందరెడ్డి కుటుంబానికి అన్యాయం జరిగితే చెప్పకూడదా! ప్రశ్నించ కూడదా? మీఇంట్లో అన్యాయం జరిగితే ప్రశ్నించవా?" అని వైసీపీ కార్యకర్తపై దివంగత వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం(సారాయిపల్లె)లో సునీత ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రచార రథం పైనుంచి "నాన్నకు న్యాయం చేయండి. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి" అని కోరారు. ఇంతలో గ్రామంలోని వైసీపీకి చెందిన ఓ కార్యకర్త.. "ప్రచారం చేసుకోండి కానీ, వివేకా కేసుతో మీకేం పని" అంటూ సునీత ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తయిన పోలీసులు అతనిని అడ్డుకుని పక్కకు తీసుకెళుతుండగా.. అతను మరోమారు నోటిదురుసుగా మాట్లాడారు. దీంతో సునీత తీవ్ర స్వరంతో అతన్ని హెచ్చరించారు. "వివేకానందరెడ్డికి అన్యాయం జరిగితే చెప్పడం తప్పా. మీ ఇంట్లో అన్యాయం జరిగితే ప్రశ్నించవా? మాటలు జాగ్రత్తగా రానీ" అన్నారు. పోలీసులు ఆ వ్యక్తిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. అనంతరం సునీత ప్రసంగం కొనసాగింది. వివేకానందరెడ్డికి జరిగిన అన్యాయానికి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే న్యాయం జరుగుతుందని సునీత చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు.

వంద బాదాడు.. వెయ్యి నొక్కాడు!
జగన్ పాలన ఇదీ.. తాడేపల్లి ప్యాలెస్ బద్దలుకొడితే పేదల కడుపు నిండుతుంది: బాబు



మంత్రాలయంలో నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న చంద్రబాబు

కర్నూలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'బటన్ నొక్కాను.. బటన్ నొక్కాను అంటూ బటన్‌రెడ్డి పదే పదే చెబుతున్నాడు. క్లాస్ వార్ అంటున్నాడు.. ఏది క్లాస్ వార్..? ఈ ఐదేళ్ల పాలనలో మీకు ఇచ్చింది పది రూపాయలు. రూ.వంద బాదేశావ్.. రూ.వెయ్యి నొక్కేశావ్.. మీ తాడేపల్లి ప్యాలెస్‌ను బద్దలుకొడితే పేదల కడుపు నిండుతుంది.. అదీ క్లాస్ వార్..' అని టీడీపీ అధినేత చంద్రబాబు విరుచుకుపడ్డారు. వైసీపీ నవరత్నాలు నవమోసాలని.. జగన్ ప్రకటించిన మేనిఫెస్టో అంతా అబద్ధాల పుట్టని ధ్వజమెత్తారు. 99.5 శాతం అమలు చేశామంటూ ప్రజలను మోసగిస్తున్నాడని.. మళ్లీ మోసపోతే రాష్ట్రాన్ని అమ్మేస్తాడని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలను దగా చేసిన వైసీపీని మే 13న ఓటుతో భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపిచ్చారు. ప్రజాగళంలో భాగంగా ఆదివారం కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరులో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. జగన్ 99.5 శాతం హామీలు అమలు చేశానని చెబుతున్నాడని.. మద్య నిషేధం చేశాడా..? జాబ్ కేలెండర్ ఇచ్చాడా..? ఒక్క డీఎస్సీ అయినా ఇచ్చాడా అని ప్రశ్నించారు. కరెంట్ చార్జీలు తొమ్మిది సార్లు పెంచాడని.. పెట్రోలు, డీజిల్ ధరలు ఇష్టారీతిన పెంచేశాడని.. నిత్యావసర సరుకుల ధరలు చుక్కలను తాకుతున్నాయని.. చివరకు చెత్తపై కూడా పన్నులు వేసిన చెత్త ముఖ్యమంత్రి అని దుయ్యబట్టారు. వంద సంక్షేమ పథకాలను రద్దు చేశాడని మండిపడ్డారు. ఇంకా ఏమన్నారంటే..

..34 మందిని చంపేశావ్

జగన్..! నీ రాజకీయ పిచ్చి కోసం గత నెలలో వృద్ధులను మండుటెండల్లో రోడ్లపైకి తీసుకొచ్చి 34 మంది వృద్ధులు చనిపోవడానికి కారణమయ్యావ్. పేదవారి జీవితాలతో ఆడుకోవద్దు. సీఎస్ ఒకటో తేదీనే ఇళ్ల వద్దకే పింఛన్ పంపించే ఏర్పాట్లు చేయాలి. మేము అధికారంలోకి వచ్చాక దీపం పథకంలో మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షలు వడ్డీ లేని రుణాలు ఇస్తాం. రాష్ట్ర ప్రగతితో పాటు ఆడబిడ్డల భవిష్యత్ కాపాడే బాధ్యత మీ చంద్రన్న తీసుకుంటాడు. సంపద సృష్టించి, ఆదాయం పెంచి.. ఆ ఆదాయం పేదలకు పంచుతాను. ఆడబిడ్డలను లక్షాధికారులను చేసే బాధ్యత తీసుకుంటాను. పేదరికం లేని సమాజం చూడాలన్నదే నా సంకల్పం. సంకల్పం సాకార యజ్ఞంలో మీరూ భాగస్వాములు కావాలి.

లక్ష విదేశీ ఉద్యోగాలు!
తెలుగుదేశం హామీ.. ఎన్ఆర్ఐ టీడీపీ తోడ్పాటు
- చంద్రబాబు గెలుపు కోసం ప్రచారానికి చలో ఆంధ్రప్రదేశ్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కురుక్షేత్రం పట్ల విదేశాలలోని ప్రవాసులు అత్యంత ఆసక్తి కనబర్చడమే కాకుండా తమకు వీలైన విధంగా రాష్ట్రాన్ని రక్షించేందుకు ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతున్నారు. మాతృభూమిపై మమకారంతో స్వదేశానికి వచ్చి నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వారు కొందరైతే, విదేశాలలో ఉద్యోగాలు చేసుకుంటూనే తమ స్వస్థలాలలో నచ్చిన అభ్యర్థులకు ఓటు వేయండంటూ ప్రచారం చేసే వారు అత్యధికులు ఉన్నారు. వీరిలో సింహభాగం తెలుగుదేశం పార్టీ అభిమానులే ఉండటం గమనార్హం. తెలుగునాట ఏ రాజకీయ పార్టీకీ లేని విధంగా పెద్ద సంఖ్యలో విదేశాలలోని అభిమానులు ఉద్యోగాలకు సెలవు పెట్టి, వ్యాపారాలకు తాత్కాలిక విరామం ఇచ్చి మరీ టీడీపీ పక్షాన ప్రచారం చేయడానికి విమానాలెక్కుతున్నారు. ప్రపంచంలో అత్యధికంగా పెట్రోలు ఉత్పత్తి చేసే సౌదీ ఆరంకో కాంట్రాక్టింగ్ చేసే రావి రాధాకృష్ణ, ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసే బి.వెంకట రాంకిశోర్, అమెరికాలో వ్యాపారం చేసే మల్లిక్ మదేరమట్ల తరహా దాదాపు 1500 మంది మాతృదేశం బాట పట్టారు. కొందరు ఇప్పటికే స్వదేశానికి చేరుకొని వివిధ నియోజకవర్గాలలో ప్రచారం చేస్తుండగా, మరికొందరు విమాన టికెట్లను బుక్ చేసుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకూ ఎన్నారై తెలుగుదేశం బృందాలు ఇప్పటికే చేరుకున్నాయి. విదేశాలలో ఏసీ గదుల్లో విలాసవంతమైన జీవితాన్ని అనుభవించే వీరు ఆంధ్రప్రదేశ్‌లో మండే ఎండల్లో చెమటోడ్చుతూ చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడుతున్నారు. ఎన్నారైల ప్రచార తీరును తెలుగుదేశం అధినేత చంద్రబాబు, లోకేశ్ కూడా గమనిస్తున్నట్లు సమాచారం. మంగళగిరిలో పార్టీ ఏర్పాటు చేసిన వార్ రూంలో ఎన్నారై టీడీపీ అధ్యక్షుడు వేమూరి రవి కీలకపాత్ర పోషిస్తున్నారు. నిరుద్యోగ సమస్య కీలకాంశం కావడంతో విదేశాలలో తెలుగు యువతకు లక్ష ఉద్యోగాలు ఇస్తామంటూ టీడీపీ ఇచ్చిన హామీ ఆసక్తి కలిగిస్తోంది.

'పొరుగు రాష్ట్రంలో 420 హామీలు ఇచ్చారు'
- తెలంగాణ ప్రభుత్వంపై నోరుపారేసుకున్న ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల
- ఆగస్టులో రుణమాఫీ ప్రకటనపై విమర్శలు

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలంగాణ ప్రభుత్వంపై నోరుపారేసుకున్నారు. వైసీపీ ఎన్నికల మ్యానిఫెస్టో కోసం తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ ఏపీ మాజీ సీఎం చంద్రబాబును విమర్శించారు. అంతటితో ఆగకుండా తెలంగాణ సీఎం, ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకిస్తున్న హామీలను అవహేళన చేశారు. ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను 420 హామీ అంటూ విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గట్టెక్కేందుకు పొరుగు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అంటోందని విషం కక్కారు. పేరు ఎందుకులే గాని... అంటూనే తెలంగాణ ప్రభుత్వంపైనా, సీఎం రేవంత్ రెడ్డిపైనా నోరుపారేసుకున్నారు.. అదే సమయంలో కేసీఆర్ పాలనను కీర్తించారు. పైగా, నెరవేర్చలేని హామీలను ఇచ్చి పబ్బంగడుపుకుందామని అనుకునే 420 రాజకీయ నాయకులను ప్రజలు ఛీదరించుకుంటున్నారని సజ్జల పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతాల్లోకే పింఛను
- ఆధార్‌తో మ్యాప్ అయితే.. నగదు బదిలీ
- బ్యాంకు ఖాతాలు లేకపోతే ఇంటి దగ్గరే
- సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు లేకుంటే పింఛన్లు అందవు అన్నట్లుగా అవ్వా తాతలను ఇబ్బంది పెట్టిన జగన్ సర్కారు ఈసారి 'పద్ధతి' మార్చింది. పింఛన్ల పంపిణీ సజావుగా సాగాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు... ఆదివారం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ మే, జూన్ నెలలకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది లేకుండా పెన్షన్ పంపిణీపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం... రెండు పద్ధతుల్లో పింఛన్లు పంపిణీ చేస్తారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి నగదు బదిలీ ద్వారా నేరుగా ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తారు. బ్యాంక్ అకౌంట్ ఆధార్‌తో మ్యాప్ అయిన లబ్ధిదారులందరికీ ఇది వర్తిస్తుంది. ఇక బ్యాంకు ఖాతాలు లేని వారు, దివ్యాంగులు, వయోవృద్ధులు, నడవలేక వీల్‌చైర్లకు పరిమితమైన వారికి... సచివాలయ ఉద్యోగులు ఇంటికే వెళ్లి పెన్షన్ పంపిణీ చేస్తారు. మే ఒకటో తేదీన పంపిణీ ప్రారంభించి 5వ తేదీ లోగా పూర్తి చేయనున్నారు.

బిజినెస్

బ్యాంకు రుణాల జోరుకి కళ్లెం తప్పదు : ఎస్ అండ్‌పీ

న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశం బలమైన వృద్ధిపథంలో ముందు కు సాగుతున్న క్రమంలో బ్యాంకుల రుణవృద్ధి, లాభదాయకత, ఆస్తుల నాణ్యత అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. అయితే డిపాజిట్లు అదే వేగంలో వృద్ధి చెందకపోవడం వల్ల రుణవృద్ధికి బ్యాంక్‌లు కళ్లెం వేసుకోక తప్పని పరిస్థితి నెలకొన్నదని పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సరంలో రుణవృద్ధి 16 శాతం ఉండగా కొత్త ఆర్థిక సంవత్సరంలో అది 14 శాతానికే పరిమితం కావచ్చునని అంచనా వేసింది. సుమారుగా అన్ని బ్యాంకుల రుణ-డిపాజిట్ నిష్పత్తి క్షీణించిందని సంస్థ డైరెక్టర్ నికితా ఆనంద్ అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	350	విజయవాడ	350
వరంగల్	352	గోదావరి	350
చిత్తూరు	453	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.48	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	127	గోదావరి	133
వరంగల్	127	విజయవాడ	133
కరీంనగర్	127	గుంటూరు	135
మహబూబ్‌నగర్	127	ఒంగోలు	135
కర్నూలు	127	చిత్తూరు	130
విశాఖపట్నం	125		



ఎలాన్ మస్క్ ఆకస్మిక చైనా పర్యటన
ప్రధాని లీ కియాంగ్‌తో భేటీ



బీజింగ్: అమెరికన్ కుబేరుడు, టెస్లా కంపెనీ సీఈఓ ఎలాన్ మస్క్ ఆదివారం ఆకస్మికంగా చైనా సందర్శించారు. ఆయన చైనా ప్రధాని లీ కియాంగ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశం వివరాలు వెల్లడి కాలేదు. అయితే చైనా ప్రభుత్వానికి చెందిన భవనాలు, ఎగ్జిబిషన్ కేంద్రాల వద్ద టెస్లా కార్ల పార్కింగ్‌ను నిషేధిస్తూ విధించిన ఆంక్షలను తొలగించమని ఆయన చైనా ప్రధానిని కోరినట్టు సమాచారం. దీనికి తోడు స్వయం నియంత్రిత (అటానమస్) విద్యుత్ కార్లను చైనా మార్కెట్‌లో ప్రవేశపెట్టే విషయం, చైనాలో టెస్లా వ్యాపార విస్తరణ గురించి చర్చించినట్టు సిన్హువా వార్తా సంస్థ తెలిపింది. బిజీ షెడ్యూల్ పేరుతో గత ఆదివారం భారత పర్యటన రద్దు చేసుకున్న మస్క్ వారం తిరక్కుండానే ప్రైవేట్ విమానంలో చైనా పర్యటనకు వెళ్లడం విశేషం. 2020లో 700 కోట్ల డాలర్ల పెట్టుబడితో చైనాలోని షాంఘైలో టెస్లా ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసింది. చైనా ప్రీమియం ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌లో టెస్లాది అగ్రస్థానం. అయితే ఇటీవల స్థానిక కంపెనీల నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. షాంఘైలో తయారయ్యే టెస్లా ప్రీమియం ఎలక్ట్రిక్ కార్ల ధరలు ఆరు శాతం తగ్గించినా, చైనా ఈవీ కంపెనీలతో పోటీపడలేకపోతోంది. దీంతో డ్రైవర్‌లేకుండా రోబోలు నడిపే మరింత అధునాతనమైన ఈవీలను టెస్లా చైనామార్కెట్‌లో ప్రవేశపెట్టి తన మార్కెట్‌ను కాపాడుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం.

ఎఫ్ఐయూ తాజా అలర్ట్ సూచీలు జారీ

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్, ఉగ్రవాద చర్యలకు ఫైనాన్సింగ్ వంటి కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) బరిలోకి దిగింది. పెట్టుబడి మార్కెట్లు, బీమా కంపెనీలు, ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ఇంటర్మీడియేటరీలు, క్రిప్టో సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా అక్రమ నిధులు తరలి వెళ్లడాన్ని నిలువరించేందుకు తాజా "అలర్ట్ సూచీ"లు విడుదల చేసింది. మనీలాండరింగ్ చర్యల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద 2022-23లో జారీ చేసిన ఈ మార్గదర్శకాలను ఇటీవలే ప్రచురించారు. దీని కింద ఆర్థిక సంస్థలు, ఇంటర్మీడియేటరీలన్నీ అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించిన నివేదికలను (ఎస్‌టీఆర్) ఎఫ్ఐయూకి అందచేయాల్సి ఉంటుంది. ఎఫ్ఐయూ వాటిని విశ్లేషించి తగు కార్యాచరణ కోసం దర్యాప్తు, గుఢచర్య సంస్థలకు అందచేస్తుంది. ఈ అలర్ట్ సూచీలు స్టాక్ ఎక్స్ఛేంజిలు, డిపాజిటరీల వంటి మార్కెట్ మౌలిక వసతుల సంస్థలకు ఎదురయ్యే ముప్పు గురించి హెచ్చరిస్తూ ఉంటాయి.

మూడేళ్లలో రూ.3,000 కోట్ల పెట్టుబడి
అపోలో హాస్పిటల్స్

న్యూఢిల్లీ: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) వ్యాపార విస్తరణకు సిద్ధమవుతోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్లలో రూ.3,000 కోట్లు ఖర్చు చేస్తామని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) కృష్ణన్ అఖిలేశ్వరన్ చెప్పారు. ఏహెచ్ఈఎల్ అనుబంధ సంస్థ అపోలో హెల్త్‌కం ఈక్విటీలో 12.1 శాతం వాటా కోసం రూ.2,475 కోట్లు చెల్లించేందుకు అంతర్జాతీయ పీఈ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో రూ.890 కోట్లను ఏహెచ్ఈఎల్ వ్యాపార విస్తరణ కోసం, మరో రూ.860 కోట్లను అపోలో హెల్త్ అనుబంధ సంస్థ అపోలో 24/7 విస్తరణ కోసం వినియోగిస్తామని అఖిలేశ్వరన్ తెలిపారు. ఏహెచ్ఈఎల్‌కు అందే రూ.890 కోట్లను ఇతర హాస్పిటల్స్ కొనుగోలు లేదా ఏహెచ్ఈఎల్ విస్తరణ కోసం ఖర్చు చేస్తామన్నారు. అపోలో 24/7లో కీమెడ్ విలీనం పెద్ద మైలురాయి అన్నారు. దీంతో అపోలో ఫార్మసీల సంఖ్య 70,000కు పెరుగుతుందన్నారు.

భారత్‌కు భారీగా పెరిగిన చైనా ఎగుమతులు

న్యూఢిల్లీ: చైనా పెద్ద ఎత్తున తన సరుకులను భారత్‌లో కుమ్మరిస్తోంది. గత 15 సంవత్సరాలుగా చైనాకు మన ఎగుమతులు 1,600 కోట్ల డాలర్లు విఎంచడం లేదు. అయితే ఇదే సమయంలో చైనా నుంచి మన పారిశ్రామిక వస్తువుల దిగుమతులు 7,030 కోట్ల డాలర్ల నుంచి 10.100 కోట్ల డాలర్లకు పెరిగినట్టు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) తెలిపింది. ప్రస్తుతం మన దేశ పారిశ్రామిక వస్తువుల దిగుమతుల్లో చైనా వాటా 30 శాతం. పదిహేనేళ్ల క్రితం ఇది 21 శాతం మాత్రమే. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా, చైనా నుంచి దిగుమతులు భారీగా పెరగడం విశేషం. ఇది మన ఆర్థిక వ్యవస్థకుగానీ, దేశ భద్రతకుగానీ ఏ మాత్రం మంచిది కాదని జీటీఆర్ఐ తెలిపింది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని చైనా దిగుమతులపై ఆధారపడడం తగ్గించుకునేందుకు వేరే దేశాల నుంచి దిగుమతుల కోసం ప్రభుత్వం, పారిశ్రామిక సంస్థలు దృష్టి పెట్టాలని జీటీఆర్ఐ సంస్థ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ చెప్పారు.

22,725 పైన బుల్లిష్
(ఏప్రిల్ 29-మే 3 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అష్టాంగ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 22420 (+273)

నిఫ్టీ గత వారం 22198-22625 పాయింట్ల మధ్యన కదలాడి 273 పాయింట్ల లాభంతో 22420 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22725 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

1 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22471, 22332, 22409, 22316 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 22725 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 22125

నిరోధ స్థాయిలు: 22625, 22725, 22825 (22525 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 22225, 22125,

కన్సాలిడేషన్‌కు అవకాశం

స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరిన సూచీలకు, ఆ స్థాయిలో నిలదొక్కుకునేందుకు బలం అవసరం. దీంతో కొంత కన్సాలిడేషన్ జరిగే అవకాశం కనిపిస్తోంది. క్యూ4 ఫలితాలతో బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల షేర్లలో బుల్లిష్‌నెస్ ఉండొచ్చు. మదుపరులు అంతర్జాతీయ సంకేతాలను జాగ్రత్తగా గమనించాలి. యుద్ధం నేపథ్యంలో అప్రమత్తత తప్పనిసరి. నిఫ్టీకి ఈ వారం 22,500 వద్ద మద్దతు దొరికే అవకాశం ఉంది. అప్‌ట్రెండ్ కొనసాగినా 22,700 వద్ద రెసిస్టెన్స్ ఎదురు కావచ్చు.

ఈ వారం స్టాక్ రికమండేషన్స్

హావెల్స్ : ఈ స్టాక్‌కి అనేక సానుకూల అంశాలు కనిపిస్తున్నాయి. గత ఐదు రోజుల్లో సగటు వాల్యూమ్స్ మూడు రెట్లు పెరిగాయి. గతంలో నమోదైన రూ.1,591 ఆల్‌టైమ్ హైని కూడా బ్రేక్ చేసింది. రూ.1,640 వద్ద అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను క్రాస్ చేసింది. శుక్రవారం ఏకంగా 5.09 శాతం పెరిగి రూ.1,640 వద్ద ముగిసింది. రూ.1,680/1,729 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.1,630/1,610 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,600ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్గేట్ పామోలివ్: నిఫ్టీతో పోలిస్తే ఈ కౌంటర్ మెరుగ్గా ట్రేడవుతోంది. డెలివరీ వాల్యూమ్స్ కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఈ కంపెనీ షేర్లు దీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతుండటం విశేషం. ఇటీవలే ఈ కంపెనీ షేర్లు రూ.2,815 వద్ద ఆల్‌టైమ్ హైని బ్రేక్ చేశాయి. క్యూ4 ఆర్థిక ఫలితాలు బాగుంటాయనే అంచనాలు, ఈ కౌంటర్‌కు మరో సానుకూల అంశం. శుక్రవారం 1.96 శాతం లాభంతో రూ.2,855 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్లో రూ.2,920/2,950 టార్గెట్‌తో రూ.2,850 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.2,810ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

యాక్సిస్ బ్యాంక్: క్యూ4లో ఈ బ్యాంకు మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే రూ.5,362 కోట్ల నష్టాల నుంచి రూ.7,599 కోట్ల లాభం నమోదు చేసింది. మొండి బకాయిలు కూడా తగ్గాయి. నిఫ్టీతో పోలిస్తే గత ఏడాది కాలంలో యాక్సిస్ బ్యాంకు షేర్లే వేగంగా పెరిగాయి. జీవిత కాల గరిష్ఠ స్థాయి తర్వాత కన్సాలిడేషన్ జరిగి బ్రేకౌట్ స్థాయికి చేరింది. మదుపరులు రూ.1,190/1,225 లక్ష్యంతో రూ.1,120/1,100 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,080ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జీఎంఆర్ ఇన్‌ఫ్రా: గత రెండు వారాలుగా ఈ కౌంటర్లో మూమెంటమ్ కనిపిస్తోంది. స్వల్పకాలిక అడ్డంకిని కూడా అధిగమించింది. జీవిత కాల గరిష్ఠ స్థాయిని అధిగమించేందుకూ సిద్ధంగా ఉంది. నిఫ్టీతో పోలిస్తే జోరు ప్రదర్శిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ గణనీయంగా పెరిగాయి. సైడ్‌వేస్‌లో చలిస్తున్నప్పటికీ మదుపరులు ఈ స్టాక్‌ను వదులుకునేందుకు ఇష్టపడడం లేదు. రూ.95/106 లక్ష్యంతో మదుపరులు ఈ కౌంటర్లో రూ.88 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.85ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇంజనీర్స్ ఇండియా: సుదీర్ఘ కాలంగా ఈ కంపెనీ షేర్లు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్నాయి. కౌంటర్లో దిద్దుబాటు దాదాపుగా ముగిసింది. ఇటీవల ఈ కౌంటర్లో డెలివరీ వాల్యూమ్స్ పెరుగుతున్నాయి.

గత వారం 6.67 శాతం లాభంతో రూ.236 వద్ద స్వల్పకాలిక అడ్డంకిని అధిగమించింది. రూ.265/290 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.235 వద్ద పొజిషన్లు తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.231ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

నిరోధ స్థాయిల్లో పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గానే ప్రారంభమైనా 22620 వద్ద కరెక్షన్‌లో పడింది. చివరికి గత వారం కన్నా 270 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన ముగిసింది. టెక్నికల్‌గా గత రెండు నెలలుగా సైడ్‌వేస్ ధోరణిలో 22700, 21700 పరిధికే పరిమితమై ఉంది. ఇదిలా ఉండగా గత వారం మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1920 పాయింట్లు, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 700 పాయింట్లు లాభపడి జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ఉన్నాయి. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ ఎగువకే ఉన్నప్పటికీ నిఫ్టీ మరోసారి జీవితకాల గరిష్ఠ స్థాయిలకు చేరువవుతోంది. ప్రపంచ మార్కెట్ల తీరును బట్టి ఈ వారంలో మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభమై జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణిలో ప్రారంభమైతే నిరోధ స్థాయిలు 22500, 22650 వద్ద నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఆ పైన మరో నిరోధం 22800. ఇక్కడ నుంచే మార్కెట్ గతంలో 1000 పాయింట్ల మేరకు కరెక్షన్‌కు లోనయింది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 23000.

బేరిష్ స్థాయిలు: నిరోధ స్థాయి 22500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనపడే ఆస్కారం ఉంటుంది. మద్దతు స్థాయి 22300. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 22000.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం మైనర్ రికవరీ సాధించిన ఈ సూచీ 620 పాయింట్ల మేరకు లాభపడి 48200 వద్ద ముగిసింది. ఇప్పుడు ఇటీవల తాకిన గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనేందుకు సమాయత్తం అవుతోంది. అయితే జీవితకాల గరిష్ఠ స్థాయి 49000 కన్నా చాలా దిగువన ఉంది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే నిరోధ స్థాయి 48600 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. ఆ పైన నిరోధం 49000. బలహీనపడితే దిగువన మద్దతు స్థాయిలు 48000, 47600.

పాటర్న్ : మార్కెట్ మధ్యకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ఉంది. గత వారం 50 డీఎంఏ వద్ద కోలుకుంది. భద్రత కోసం 22650 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,500, 22,555
మద్దతు	22,400, 22,345

www.sundartrends.in



అబ్ కీ బార్?

రాజ్‌నాథ్‌కు పోటీగా 251 సార్లు జైలుకు వెళ్లొచ్చిన వ్యక్తి

లఖ్‌నవూ, ఏప్రిల్ 28: అతనో నిత్య విద్యార్థి నాయకుడు. తన 40ఏళ్ల నాయకత్వ కెరీర్‌లో 251 సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. ఇన్ని సార్లు జైలుకు వెళ్లి వచ్చినా... అతనిపై ఒక్కటంటే ఒక్క క్రిమినల్ కేసు కూడా లేదు. అన్నీ ఏదో ఒక పోరాటంలో, నిరసన ప్రదర్శనలో పాల్గొని జైలుకు వెళ్లిన సందర్భాలే. అతని పేరు రవిదాస్ మెహ్రోత్రా. లఖ్‌నవూ లోక్‌సభ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) తరఫున పోటీ చేస్తున్నాడు. ఇంతకీ ఇక్కడ రవిదాస్ ప్రధాన ప్రత్యర్థి ఎవరంటే.. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. అయినప్పటికీ రవిదాస్ తన విజయం పట్ల ధీమాగా ఉన్నాడు. రవిదాస్ 26 ఏళ్ల వయస్సులో లఖ్‌నవూ యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు.



నవాబులు, నిజాంల అరాచకాలపై మాట్లాడరేం?

» కర్ణాటక ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశానికి చెందిన రాజులు, మహారాజులను అవమానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ.. బుజ్జగింపు రాజకీయాల కోసం నవాబులు, నిజాంలు, సుల్తాన్‌లు, బాద్షాలు చేస్తున్న అరాచకాలపై మౌనంగా ఉన్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్ణాటకలోని బెళగావి, ఉత్తర కన్నడ జిల్లా శిరసి, దావణగెరె, బళ్లారి జిల్లా హొసపేట బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. "ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని దేశ చరిత్ర, స్వాతంత్ర్య పోరాటాలకు సంబంధించిన పుస్తకాలను కాంగ్రెస్ రాయించింది. కాంగ్రెస్ యువరాజు నేటికీ ఆ పాపాలను కొనసాగిస్తున్నారు. పేదల భూములు, ఆస్తులను రాజులు, మహారాజులు కబ్జా చేశారని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో ఛత్రపతి శివాజీ, కిట్టూరు రాణి చెన్నమ్మ వంటి మహానుభావులను కాంగ్రెస్ అవమానించింది. అదే సమయంలో దేశ చరిత్రలో నవాబులు, నిజాంలు, సుల్తాన్‌లు, బాద్షాలు చేసిన దౌర్జన్యాలపై ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఆయన నోటికి తాళం వేసుకున్నారు" అని మోదీ ధ్వజమెత్తారు. ఎన్నో దేవాలయాలను అపవిత్రం చేసి, ధ్వంసం చేసిన మొఘలు చక్రవర్తి ఔరంగజేబు అఘాయిత్యాలు రాహుల్‌కు గుర్తుకురాలేదని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తిని ప్రశంసించే వారితో కాంగ్రెస్ సంతోషంగా పొత్తులు పెట్టుకుంటోందని ఆరోపించారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిదని ఆరోపించారు. బెళగావిలో ఆదివాసీ మహిళపై జరిగిన దారుణాన్ని, చిక్కోడిలో జైన సన్యాసి హత్యను ప్రస్తావించారు. ఇటువంటి ఘటనలు జరగడం సిగ్గుచేటని, ఇవి కర్ణాటక ఆత్మగౌరవాన్ని దిగజారుస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ వయనాడ్ సీటులో గెలవడానికి నిషేధిత ఉగ్ర సంస్థ పీఎఫ్ఐ మద్దతు తీసుకుంటోందని మోదీ ఆరోపించారు.



మార్చి 28న బీజేపీలో చేరిన దమయంతి, భర్తృహరి, సిద్ధాంత్(బీజేపీ కండువాలు కప్పుకొన్నవారు ఎడమ నుంచి)

'జంపింగ్' బలం!

బీజేడీ మాజీ నేతలకు బీజేపీ టికెట్లు

» ఒడిశాలో అధిక ఎంపీ స్థానాలపై కన్ను

» 24 ఏళ్లుగా సీఎం పదవిలో నవీన్

» ఆయనకు తొలిసారి గట్టి పోటీ



ఒడిసాలో పాలక బిజూ జనతాదళ్ (బీజేడీ) నుంచి వచ్చి చేరిన నేతలనే బీజేపీ నమ్ముకుంది. లోక్‌సభకు, ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఏకకాలంలో జరుగుతున్న ఎన్నికల్లో వారికే పెద్దపీట వేసింది. ముఖ్యంగా శాసనసభ కంటే లోక్‌సభ స్థానాలే ఎక్కువ గెలుచుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. సీఎం నవీన్ పట్నాయక్‌కు తొలి నుంచీ చేదోడువాదోడుగా ఉండి పార్టీ బలోపేతానికి తోడ్పడిన భర్తృహరి మెహతాబ్, సిద్ధాంత్ మొహపాత్ర, అనుభవ్ మొహంతి, ఆకాశ్‌దాస్ నాయక్, అరిందమ్ రాయ్, ప్రియదర్శి మిశ్రా, దంబారు సిసా, ప్రదీప్ పాణిగ్రాహి, ప్రశాంత జగదేవ్ వంటి సీనియర్ నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో అత్యధికులు లోక్‌సభకు పోటీచేస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు, నేతలు కూడా బీజేపీలోకి క్యూకట్టి అసెంబ్లీ బరిలో దిగారు. బీజేడీ అధినేత నవీన్ 2000వ సంవత్సరం నుంచి 24 ఏళ్లుగా అప్రతిహతంగా సీఎంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇన్నేళ్ల తర్వాత తొలిసారి ఆయనకు గట్టి పోటీ ఎదురవుతోంది. నిన్నమొన్నటిదాకా ఆయనతో పాటు ఉండి బీజేడీని బలోపేతం చేసిన నేతలు ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో దిగడమే దీనికి కారణం. నీతి నిజాయితీలకు మారుపేరుగా నిలిచిన నవీన్ ప్రభుత్వంపై గత నాలుగేళ్లుగా తీవ్ర అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సంస్థాగతంగా బీజేడీ బలహీనపడుతోందన్న వాదన పార్టీ నేతల్లోనే వినిపిస్తోంది. ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్న బీజేపీలోకి పలువురు నాయకులు చేరిపోయారు. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలకు గాను గత ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 8 స్థానాల్లో గెలిచింది. అసెంబ్లీలో మాత్రం 23 సీట్లకే పరిమితమైంది. 12 ఎంపీ స్థానాలు గెలిచిన బీజేడీ.. అసెంబ్లీకి వచ్చేటప్పటికి 147 సీట్లకు గాను ఏకంగా 112 గెలుచుకుంది. ఒడిశాలో మే 13 నుంచి నాలుగు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. 1998 నుంచి 2009 వరకు ఒడిసాలో బీజేడీ, బీజేపీ కలిసి నడిచాయి. 2009లో తెగతెంపులు చేసుకున్నాయి. మోదీ ప్రధాని అయ్యాక నవీన్ పట్నాయక్ ఆయనతో సన్నిహితంగా ఉంటున్నారు. పార్లమెంటులో కీలక బిల్లులకు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల తర్వాత మళ్లీ పొత్తు పెట్టుకోవాలని భావించారు. అయితే బీజేపీ రాష్ట్ర శాఖ అంగీకరించలేదు. బీజేడీ సంస్థాగతంగా బాగా బలహీనపడిందని.. ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని అధిష్ఠానానికి నివేదికలు పంపారు. దీంతో పాటు, 15 లోక్‌సభ సీట్లను బీజేపీకి కేటాయించాలన్న డిమాండ్‌కు నవీన్ అంగీకరించకపోవడంతో పొత్తు కుదరలేదు.

- సెంట్రల్ డెస్క్

ఎన్నికల్లో ఏఐ హవా!

విరివిగా వాడుతున్న అభ్యర్థులు, పార్టీలు



- అభ్యర్థుల తరఫున ఓటర్లకు ఏఐ ఫోన్ కాల్స్
- ప్రజల్లోకి చొచ్చుకుపోయేందుకు ఏఆర్ టెక్నాలజీ
- దివంగత నేతలు కూడా ప్రజల ముందు ప్రత్యక్షం!

ఎండలు మండిపోతున్నాయి..! ప్రచారానికి సమయం లేదు..! ఓటర్లందరినీ కలిసేందుకు సుడిగాలి పర్యటనలకు చాన్సే లేదు..! సోషల్ మీడియా ప్రచారంతో హోరెత్తించాలన్నా.. ఓటర్లు విసిగిపోయారు..! టీవీలు, పత్రికలు, సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో యాడ్స్ ఇచ్చినా.. అవి తమ నియోజకవర్గ ఓటర్లందరికీ చేరుతాయా? అనే అనుమానం. దాంతో ఇప్పుడు రాజకీయ పార్టీలు కృత్రిమ మేధ (ఏఐ), ఆగ్మెంటెడ్ రియాల్టీ(ఏఆర్), ఇతర అధునాతన సాంకేతికతలను వినియోగిస్తున్నాయి. అభ్యర్థులు టెక్నాలజీ సాయంతో దూసుకుపోతున్నారు.

నేరుగా ఓటర్లకు ఫోన్‌కాల్స్

గత ఎన్నికల వరకు అభ్యర్థుల ప్రచారం సోషల్ మీడియా పోస్టులతో దూసుకుపోయింది. ఈసారి వారు ఏఐ సాంకేతికతతో ఏకకాలంలో వందల మంది ఓటర్లకు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. అభ్యర్థుల తరఫున ఏఐ.. ఓటర్లతో అభ్యర్థి మాటలను అనుకరిస్తూ(ధ్వన్యనుకరణ) మాట్లాడుతోంది. వారి సమస్యలను తెలుసుకుంటోంది. అభ్యర్థి పట్ల ఓటర్ల ప్రశ్నలకు సమాధానాలు చెబుతోంది. వాగ్దానాలు నెరవేర్చలేకపోవడానికి కారణాలుచెబుతూ.. ఈసారి గెలిపిస్తే పక్కాగా పనులు చేస్తామంటూ హామీ ఇస్తోంది. ఫోన్లో అవతలివైపు ఉన్న ఓటరు మానసిక స్థితిని అంచనావేస్తూనే.. తనకే ఓటువేసేలా ఒప్పిస్తోంది. అజ్మీర్‌కు చెందిన ఏఐ ఆధారిత సంస్థ 'పాలిమాథ్ సొల్యూషన్స్' ఈ తరహా సేవలను ప్రారంభించింది. ఇలా ఎన్నికల ప్రచారంలో ఏఐని వినియోగించడంలో బీజేపీ ముందంజలో ఉంది. ఇటీవల కాశీ తమిళ సంఘం కార్యక్రమంలో ప్రధాని మోదీ హిందీ ప్రసంగం ఏకకాలంలో పలు భారతీయ భాషల్లో ఆయన గొంతుతోనే తర్జుమా అయింది. ఏఐ ఆధారిత సాంకేతికతతో అది సాధ్యమైంది. ఈసారి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఏఆర్ సాంకేతికత హవా ఊపందుకుంది. దీని వాడకంలో తమిళనాడులోని అధికార పార్టీ డీఎంకే ముందంజలో ఉంది. ఆ పార్టీ దివంగత నేత కరుణానిధిని ఏఆర్ టెక్నాలజీతో ఓటర్ల ముందుకు తీసుకెళ్తున్నారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌ను.. ఆయన పరిపాలనను ఏఆర్ టెక్నాలజీ ద్వారా కరుణానిధి పొగడ్తలతో ముంచెత్తే వీడియోలు ఇప్పుడు అక్కడి ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. డీఎంకే ప్రధాన ప్రత్యర్థి పార్టీ ఏఐఏడీఎంకే.. ఏఆర్ టెక్నాలజీని వాడుకునేంతలా పోటీ పెరగడం గమనార్హం..! అన్నాడీఎంకే దివంగత నాయకురాలు జయలలిత వీడియోలను ఆ పార్టీ ఏఆర్ ద్వారా ఓటర్ల ముందుకు తీసుకెళ్తోంది. ఇక పలు పార్టీలు తమ ముఖ్యనేతల ప్రసంగాల లింకులను క్విక్ రెస్పాన్స్(క్యూఆర్) కోడ్ రూపంలో ఓటర్లకు అందజేస్తున్నాయి. (సెంట్రల్ డెస్క్)





నాణేనికి మరో పార్శ్వం

ఏఐ, ఏఆర్ సాంకేతికతతో ప్రయోజనాలున్నా కొన్ని రాజకీయ పార్టీలు వాటిని ప్రత్యర్థులపై దుష్ప్రచారానికి వాడుతున్నాయి. డీప్‌ఫేక్ వీడియోలే ఇందుకు ఉదాహరణ. ఒక నాయకుడు మాట్లాడిన మాటలను తప్పుదోవ పట్టించేలా హావభావాలతో సహా ట్యాంపరింగ్‌చేయడమే డీప్‌ఫేక్. సదరు నేత గొంతుతో అదే పిచ్‌లో ఏమాత్రం తేడాలేకుండా వాయిస్‌ను మార్చేస్తారు. ఇటీవల తెలంగాణ పర్యటన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రసంగాన్ని డీప్‌ఫేక్ చేసి.."ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఎత్తేస్తాం" అని ఆయన అన్నట్లుగా డీప్‌ఫేక్ చేశారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈమేరకు ఈసీకి ఫిర్యాదు చేసింది. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాని మోదీ వీడియోలనూ డీప్‌ఫేక్ చేశారనే ఆరోపణలు రావడం గమనార్హం.! రణ్‌వీర్ సింగ్ ఓ పార్టీకి మద్దతిస్తున్నట్లు వచ్చిన డీప్‌ఫేక్ వీడియోపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడమేకాకుండా..ఎక్స్‌లో వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ప్రముఖ న్యూస్ చానళ్లలో వార్తలు వచ్చినట్లుగా ఆయా వార్తా సంస్థల లోగోలతో క్రియేట్ చేస్తున్న డీప్‌ఫేక్ వీడియోలు ప్రత్యర్థి పార్టీలను ఇరకాటంలో పారేస్తున్నాయి. దీంతో వివరణలు ఇచ్చుకోలేక ప్రత్యర్థిపార్టీలు తంటాలు పడుతున్నాయి.

రంగంలోకి సునీత

ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ సతీమణి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బయటకు వచ్చే అవకాశాలు లేకపోవడంతో ఆయన సతీమణి సునీత స్వయంగా ఎన్నికల ప్రచారంలోకి దిగారు. 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' (జైలుకు జవాబు ఓటే) అంటూ సాగే పాటతో శనివారం ఆమె తూర్పు ఢిల్లీలో, ఆదివారం పశ్చిమ ఢిల్లీలో నిర్వహించిన రోడ్ షోలకు భారీ స్పందన లభించింది. ఇప్పటి వరకు ఇండియా కూటమి ఢిల్లీలో, రాంచీలో నిర్వహించిన ఎన్నికల సభల్లో పాల్గొన్న సునీతా కేజ్రీవాల్.. పోలింగ్ సమీపిస్తుండటంతో ప్రత్యక్షంగా ప్రజల్లోకి వచ్చారు. ఢిల్లీలోని ఏడు స్థానాలకు మే 25వ తేదీన పోలింగ్ జరగనుంది. కేజ్రీవాల్ కన్నా ఏడాది ముందు 1994లో ఐఆర్ఎస్‌కు ఎంపికైన సునీతా కేజ్రీవాల్ 22 ఏళ్లు ఆదాయపన్ను శాఖలో పని చేశారు. 2016లో ఆదాయపన్ను అప్పీలేట్ ట్రైబ్యునల్‌లో కమిషనర్ హోదాలో ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. విద్యాధికురాలు కావడం, హిందీ, ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడుతుండటంతో యువతతోపాటు వివిధ వర్గాల ప్రజలు ఆమె ప్రసంగాలను ఆసక్తిగా వింటున్నారు. కాగా, ఆప్ ప్రచారంలో భాగంగా తీసుకొచ్చిన 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' పాటను ఎన్నికల సంఘం నిషేధించింది. ఇదిలా ఉండగా, సునీతా కేజ్రీవాల్ ఢిల్లీలోనే కాక పంజాబ్, గుజరాత్, హరియాణాల్లో కూడా ప్రచారం చేస్తారని మంత్రి ఆతిషీ తెలిపారు.

బీజేపీ మళ్లీ వస్తే స్వేచ్ఛ ఉండదు: ఖర్గే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దేశంలో ప్రజలు స్వేచ్ఛగా బతికే హక్కును కాంగ్రెస్ కల్పించిందని, ఆ హక్కును లాగేసుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని సూచించారు. కాంగ్రెస్ ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించిందని గుర్తుచేశారు. దీనివల్ల కొన్ని కోట్లమంది యువతకు ఓటేసే అవకాశం దక్కిందని తెలిపారు. అటవీ హక్కుల చట్టం-2006ను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని, దీనికోసం నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

దేవెగౌడ మనవడి అశ్లీల వీడియోలపై సిట్

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హాసన్ సిటింగ్ ఎంపీ, జేడీఎస్ నాయకుడు ప్రజ్వల్ రేవణ్ణపై వస్తున్న 'అశ్లీల పెన్‌డ్రైవ్' ఆరోపణలపై కర్ణాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఏడీజీపీ బీకే సింగ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశామని రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర్ ఆదివారం ప్రకటించారు. కాగా.. అశ్లీల వీడియోల అంశం హల్‌చల్ చేస్తున్న సమయంలోనే ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు వెళ్లిపోవడం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. అయితే సిట్ దర్యాప్తులో భాగంగా ఆయన్ని వెనక్కి తీసుకువచ్చి విచారిస్తామని పరమేశ్వర్ తెలిపారు. మరోవైపు.. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించి పలు వీడియోలు ప్రస్తుతం రాష్ట్రమంతటా వైరల్‌గా మారాయి. ప్రజ్వల్ రేవణ్ణ పలువురు మహిళలతో అశ్లీలంగా ఉన్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దీంతో బాధిత మహిళలు న్యాయం చేయాలని టీవీ చానళ్లు, మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రజ్వల్ అశ్లీల వీడియోలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌదరి సీఎంకు లేఖ రాశారు. ఈ విషయమై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆదివారం బెంగళూరులో మాట్లాడుతూ.. ప్రజ్వల్ దేశం విడిచి పారిపోవడం సిగ్గుచేటన్నారు. కాగా.. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కావాలని మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేశారని ప్రజ్వల్ రేవణ్ణ ఆరోపించారు. ఇదిలా ఉండగా, లైంగిక వేధింపులు, నిర్బంధం ఆరోపణలపై మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ, ఆయన కుమారుడు హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై ఆదివారం హోలినరసిపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదుదారు రేవణ్ణ సతీమణి భవాని బంధువుగా పేర్కొన్నారు. తాను వంటమనిషిగా పనిచేయడం ప్రారంభించిన నాలుగు నెలల తర్వాత రేవణ్ణ తనను వేధించారని, ఆయన కుమారుడు ప్రజ్వల్ తన కుమార్తెకు వీడియో కాల్స్ చేసి అసభ్యంగా మాట్లాడేవారని ఆమె ఆరోపించారు.

కాంగ్రెస్‌కు మరో షాక్!

ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు అర్విందర్ రాజీనామా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌ను కష్టాలు వీడటం లేదు. పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అర్విందర్ సింగ్‌లవ్లీ తన పదవికి ఆదివారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. పార్టీని వీడటానికి గల కారణాలను అందులో వివరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంపై అనేక ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)తో పొత్తుకు కాంగ్రెస్ ఢిల్లీ యూనిట్ అంగీకరించలేదని, అయినా హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి పని చేశామని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ తరఫున పోటీ పడుతున్న కొందరు అభ్యర్థులు ఆప్‌ను ఆకాశానికి ఎత్తేయటం కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయని.. ఈశాన్య ఢిల్లీ నుంచి కాంగ్రెస్ టికెట్ మీద పోటీ పడుతున్న కన్హయ్య కుమార్‌పై విమర్శలు గుప్పించారు. విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాల పరంగా ఢిల్లీలో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ మాజీ సీఎం షీలాదీక్షిత్ హయాంలోనే జరిగిందని, ఆప్ హయాంలో అదం తా దెబ్బతిన్నదన్నారు. ఢిల్లీలోని 7సీట్లలో 4 ఆప్ తీసుకొని 3కాంగ్రెస్‌కు ఇవ్వటంపై అసంతృప్తి వ్యక్తం చేశా రు. ఒక స్థానంలో తన పేరు బలంగా వినిపించినా సీనియర్ల కోసం స్వచ్ఛందంగా పోటీ నుంచి వైదొలిగానని తెలిపారు. 3స్థానాల్లో రెండింట ఢిల్లీతో సంబంధంలేని వ్యక్తులకు (కన్హయ్య కుమార్, ఉదిత్ రాజ్) సీట్లు కేటాయించడం సరికాదన్నారు. డీపీసీసీ అధ్యక్షుడి హోదాలో పార్టీ పదవుల నియామకాలను చేపట్టేందుకు ఢిల్లీ పార్టీ ఇంచార్జి తనకు అనుమతివ్వలేదని.. ఆయనే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని లవ్లీ ఆరోపించారు. లవ్లీ షీలాదీక్షిత్ మంత్రివర్గంలో మంత్రిగా ఉన్నారు. లవ్లీ రాజీనామాను పార్టీ హైకమాండ్ ఆమోదించిందని పార్టీ ఢిల్లీ ఇంచార్జి దీపక్ బబారియా తెలిపారు. కాగా లవ్లీ బీజేపీలో చేరి తూర్పు ఢిల్లీనుంచి పోటీ చేయవచ్చన్న వార్తల నేపథ్యంలో ఏపార్టీలో చేరడంలేదని ఆయన వివరణ ఇ చ్చారు.

2.9లక్షల కోట్లు..400 గేట్లు

దుబాయ్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద విమానాశ్రయం

ఆమోదం తెలిపిన దేశాధినేత



ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు లోపలి భాగం(నమూనా)

దుబాయ్, ఏప్రిల్ 28: ప్రపంచ వాణిజ్య కేంద్రంగా ఉన్న దుబాయ్ కిరీటంలో మరో మణి చేరనుంది. నూతనంగా మరో విమానాశ్రయాన్ని నిర్మించనున్నట్లు పాలకుడు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తౌమ్ ఆదివారం ప్రకటించారు. ఇది ప్రపంచంలో అతి పెద్ద విమానాశ్రయం కానుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న విమానాశ్రయానికి ఇది అయిదు రెట్లు పెద్దదిగా ఉండనుంది. 35 బిలియన్ డాలర్ల (రూ.2.9లక్షల కోట్లు) వ్యయంతో దీన్ని నిర్మించనున్నారు. వచ్చే పదేళ్లలో దీన్ని పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న ఎయిర్ పోర్టు ప్రపంచంలో అత్యంత రద్దీ ఉన్న విమానాశ్రయాల్లో ఒకటిగా పేరు పొందింది. రద్దీ పెరుగుతుండడం, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కొత్తది నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుత ఎయిర్‌పోర్టులో రెండు రన్‌వేలు ఉండగా, కొత్త దాంట్లో అయిదు సమాంతర్ రన్‌వేలను నిర్మిస్తారు. 400 ఎయిర్‌క్రాఫ్ట్ గేట్లు ఏర్పాటు చేయనున్నారు. ఏటా 26 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా సౌకర్యాలు కల్పించనున్నారు. దుబాయ్ దక్షిణ ప్రాంతంలో దీన్ని నిర్మిస్తారని, దీనిని అల్ మక్తౌమ్ అంతర్జాతీయ విమానాశ్రయంగా పిలుస్తారని దేశాధినేత ప్రకటించారు.

అర్మేనియాకు ఆయుధాలిస్తే ఊరుకోం

భారత్‌కు అజర్‌బైజాన్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: అర్మేనియాకు ఆయుధాలను సరఫరా చేస్తే చూస్తూ ఊరుకోబోమని అజర్‌బైజాన్ దేశం భారత్‌ను హెచ్చరించింది. ఫ్రాన్స్, గ్రీస్ దేశాలను ఉద్దేశించి కూడా ఇదే తరహాలో హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు భారత్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేయడంపై అర్మేనియా ఆసక్తి చూపుతోంది. భారత్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేస్తున్న దేశాల్లో అర్మేనియా మొదటి స్థానంలో ఉంది. బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులు కొనుగోలు చేయడంపైనా ఆసక్తి చూపుతోంది. 'పినాక' మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు కొనుగోలు చేయడానికి 2022లో ఒప్పందం కుదిరింది. పినాక రాకెట్ లాంచర్లను కొనుగోలు చేసిన తొలి దేశం కూడా అర్మేనియాయే కావడం గమనార్హం. అర్మేనియాకు ఆయుధాలు సరఫరాను భారత్ చాలా కాలం రహస్యంగానే ఉంచింది. అయితే కొన్ని కంపెనీలు తమ వార్షిక నివేదికల్లో అమ్మకాల వివరాలను పేర్కొనడం తప్పనిసరి కావడంతో అవి బయటపడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన జెన్ టెక్నాలజీస్ సంస్థ అర్మేనియాకు 41.5 మిలియన్ డాలర్ల (రూ.345 కోట్లు)విలువ చేసే యాంటీ డ్రోన్ సిస్టంలను సరఫరా చేసింది.

గుజరాత్ తీరంలో 602 కోట్ల డ్రగ్స్

» దేశంలోకి చేరవేసేందుకు పాకిస్థానీల కుట్ర

» బోటు స్వాధీనం.. 14 మంది అరెస్టు

అహ్మదాబాద్, ఏప్రిల్ 28: దేశంలోకి మాదకద్రవ్యాలను చేరవేసేందుకు పాకిస్థానీలు పన్నిన కుట్రను భారత తీర ప్రాంత రక్షక దళం భగ్నం చేసింది. శనివారం రాత్రిపూట గుజరాత్ తీరంలో భారీ ఆపరేషన్ నిర్వహించి ఓ బోటును పట్టుకుంది.. అందులో నుంచి ఏకంగా రూ.602 కోట్ల విలువైన 86 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని, 14 మంది పాకిస్థానీలను అదుపులోకి తీసుకుంది. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు తీర ప్రాంత రక్షక దళం, గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)తో కలిసి అరేబియా తీరంలో మాటేశాయి. శనివారం రాత్రి సముద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బోటు కదలికలను గుర్తించి అప్రమత్తమయ్యాయి. కోస్టు గార్డు నౌక రాజ్‌రతన్, హెలికాప్టర్లతో ఆ బోటును ముట్టడించాయి. ఈక్రమంలోనే బోటులోని వారు కాల్పులు జరిపి తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరుపుతూ చాకచక్యంగా బోటు లోపలికి ప్రవేశించాయి. అందులోని 14 మందిని అదుపులోకి తీసుకొని, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఇదిలా ఉండగా, గుజరాత్, రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ తయారీ ల్యాబ్‌లపై ఏటీఎస్, ఎన్‌సీబీ శుక్రవారం సాయంత్రం సంయుక్తంగా దాడులు జరిపి రూ.300 కోట్ల విలువైన మెఫెడ్రోన్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు 13 మందిని అరెస్టు చేశాయి. అహ్మదాబాద్ ప్రాంతానికి చెందిన మనోహర్‌లాల్ ఎనానీ, రాజస్థాన్‌కు చెందిన కుల్దీప్ సింగ్ రాజ్‌పురోహిత్ వివిధ ప్రాంతాల్లో మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ యూనిట్లను నడుపుతున్నట్లు ఏటీఎస్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ నేపథ్యంలోనే రాజస్థాన్‌లోని సిరోహి, జోధ్‌పూర్, గాంధీనగర్ ప్రాంతాలతో పాటు గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లాలోని భక్తినగర్‌లో ఏకకాలంలో ఎన్‌సీబీతో కలిసి దాడులు చేసింది. వీటిల్లో 22 కిలోల మెఫెడ్రోన్, 124 కిలోల లిక్విడ్ మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నామని.. వీటి విలువ రూ.300 కోట్లు దాకా ఉంటుందని అధికారులు వెల్లడించారు.

విదేశీ విద్యార్థుల కోసం అదనంగా 25% సీట్లు

విద్యాసంస్థలకు యూజీసీ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: విదేశీ విద్యార్థుల కోసం అదనంగా 25% సీట్లను పెంచుకోవచ్చని ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ సూచించింది. ప్రస్తుతం అనుమతించిన సీట్లకు అదనంగా వీటిని పెంచుకోవచ్చని తెలిపింది. వీటిని సూపర్‌న్యూమరరీ సీట్లుగా వ్యవహరిస్తారని, వీటిని కేవలం విదేశీ విద్యార్థులకు మాత్రమే రిజర్వు చేయాలని స్పష్టం చేసింది. యూజీ, పీజీ కోర్సులకు ఇది వర్తిస్తుందని తెలిపింది. స్టూడెంట్ ఎక్ఛేంజ్ ప్రోగ్రాం కింద ఎంపికయిన విద్యార్థులకు ఈ సూపర్‌న్యూమరరీ కోటా వర్తించదు. స్టూడెంట్ ఎక్ఛేంజ్ ప్రోగ్రాంలో సీట్లు మిగిలితే వాటిని కూడా విదేశీ విద్యార్థులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) కోర్సుల్లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి అనుమతి లేదని యూజీసీ తెలిపింది.

ట్రాఫిక్ చప్పుడుతో గుండెకు ముప్పు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రహదారులపై రణగొణధ్వనులు గుండెకు చేటు చేస్తాయని ఓ అధ్యయనంలో తేలింది. ట్రాఫిక్‌లో ఎక్కువ సమయం గడపటం వల్ల, ట్రాఫిక్‌కు సమీపంలో ఉండటం వల్ల.. శబ్దకాలుష్యంతో గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుందని వెల్లడైంది. జర్మనీకి చెందిన మెయిన్జ్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్ పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలు సర్క్యులేషన్ రీసెర్చ్ అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. దీని ప్రకారం.. ట్రాఫిక్ శబ్దాలతో నిద్రపోయే సమయం తగ్గడంతో పాటు నిద్రాభంగం కలగటం వల్ల హార్మోన్ల స్థాయిల్లో మార్పులు సంభవిస్తాయి. దీనివల్ల అధిక రక్తపోటు, వాపు, రక్తనాళాల్లో సమస్యలు తలెత్తుతాయి. ఇవి దీర్ఘకాలికంగా కొనసాగితే గుండె జబ్బులు, పక్షవాతం, మధుమేహానికి దారి తీస్తాయి. రోడ్డు ట్రాఫిక్‌లో పెరిగే ప్రతీ 10 డెసిబిల్ శబ్దంతో గుండెజబ్బులు, పక్షవాతం, మధుమేహం వచ్చే ప్రమాదం 3.2 శాతం పెరుగుతుందని తేలింది. ఈ నేపథ్యంలో, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని.. వాయు, రైలు, రోడ్డు ట్రాఫిక్‌ల కారణంగా వెలువడే శబ్దకాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పరిశోధకులు సూచించారు. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రద్దీగా ఉండే రహదారుల వెంట శబ్ద తీవ్రతను తగ్గించే నాయిస్ బ్యారియర్స్‌ను ఏర్పాటు చేయాలని, తద్వారా 10 డెసిబెల్స్ వరకు శబ్ద తీవ్రతను తగ్గించవచ్చని పేర్కొన్నారు.

లోకం తీరు





అబ్ కీ బార్?



5న నిర్మల్‌కు రాహుల్ రాక

నిర్మల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 5వ తేదీన ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్మల్‌కు రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్‌ను కాంగ్రెస్ పార్టీ వర్గాలు ధ్రువీకరించాయి. రాహుల్‌తో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డిలతోపాటు తదితర ముఖ్య నేతలంతా నిర్మల్ సభకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున సభ ఏర్పాట్లు చేసేందుకు పార్టీ వర్గాలు సిద్ధమవుతున్నాయి. జనసమీకరణకు సంబంధించి నియోజకవర్గాల వారీగా అక్కడి నేతలకు బాధ్యతలు అప్పగించనున్నారు

కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం

» బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటూ గెలవదు: రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్/అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 28: అధికార దుర్వినియోగంతో రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లక తప్పదని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ కేసులో కేసీఆర్ కుమార్తె కవిత తీహాడ్ జైలులో ఉన్నారన్నారు. రూ.లక్షల కోట్ల ప్రజల సొమ్మును కేసీఆర్ కుటుంబం దోచుకుందని, ఈ అవినీతిని బయటకు తీయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ ఆగం చేసి అప్పుల పాల్జేశారని మండిపడ్డారు. ఉమ్మడి ఏపీలో హైదరాబాద్‌లో వచ్చిన ఆదాయంతో సంక్షేమ పథకాలు అమలు చేసేవారన్నారు. అంత బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ చేతికి అప్పగిస్తే పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్లుగా తుగ్లక్ లాగా పాలన చేశారని, కూలిపోయే ప్రాజెక్టు కట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 14 లోక్‌సభ స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లపాటు ప్రజావ్యతిరేక, నియంతృత్వ పాలన సాగించిన బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదని అన్నారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌రెడ్డిని గెలిపించుకువస్తానని సీఎం రేవంత్‌రెడ్డికి మాట ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

పదేళ్లలో బీజేపీ హామీలన్నీ అమలు చేసిందా?

» చేసినట్లు నిరూపిస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటాం: పొన్నం

భగత్‌నగర్(కరీంనగర్), ఏప్రిల్ 28: పది సంవత్సరాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసినట్లు నిరూపిస్తే కరీంనగర్ ఎంపీ ఎన్నికల బరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి తప్పుకుంటారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేటలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసినట్లు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటానని కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పది లక్షల ఆరోగ్యశ్రీ అందిస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. వచ్చే వర్షాకాలం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని, ఆగస్టులో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఎన్ని హామీలు అమలు చేశామో చూసుకోవాలని సూచించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇచ్చిన హామీ మేరకు సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని, రైతుల ఆదాయం రెట్టింపు చేశారా అని ఆయన ప్రశ్నించారు. దేవుడి ఫొటో పెట్టుకుని, రాముడి పేరుతో ఓట్లు అడుగుతున్నారని మంత్రి పొన్నం దుయ్యబట్టారు.

నామినేషన్ల ఉపసంహరణకు నేడే ఆఖరు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగియనుంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఇతర పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 17 లోక్‌సభ స్థానాలకు మొత్తం 893మంది దరఖాస్తులు చేశారు. వాటి పరిశీలన సమయంలో 268 మంది అభ్యర్థుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 625 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. కాగా ఉపసంహరణ అనంతరం ఆయా లోక్‌సభ స్థానాల్లో ఎవరు ఎన్నికల బరిలో ఉంటారో.. నేడు తేలనుంది.

మోదీ ఉద్యోగాన్ని ఊడగొట్టాలి!

(మొదటిపేజీ తరువాయి)

చూస్తున్నారని, పదేళ్లలో చేసిందేదో చెప్పాలని అన్నారు. రాష్ట్రం నుంచి బీజేపీని బహిష్కరించాల్సిన బాధ్యత తెలంగాణ యువత మీద ఉందన్నారు.

గుండు రాలే.. బండి రాలే!

2021లో వరదలు వచ్చినప్పుడు మూసీ పరివాహక ప్రాంతమంతా మునిగిందని, ఆనాడు బీజేపీ అధ్యక్షుడు బండిపోతే బండి అని, గుండు పోతే గుండిస్తానన్నాడని, కానీ, గుండు రాలే.. బండి రాలేదని, అరగుండు వచ్చి ఓట్లు అడుగుతున్నాడని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నయా పైసా తీసుకురాలేదన్నారు. మెట్రో ఎందుకు ఇవ్వలేదంటే జైశ్రీరామ్ అంటున్నారని, బయ్యారం ఉక్కు ఎందుకు ఇవ్వలేదంటే హనుమాన్ జయంతి చేశామంటున్నారని తెలిపారు. మన తాతల ముత్తాతల నుంచే శ్రీరామనవమి తదితర పండుగలు చేశామని, ఎల్లమ్మ, పోచమ్మలకు కోళ్లు కోశామని, కల్లు పోశామని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. దేవుని ఫొటో చూపి రోడ్ల మీద అడుక్కునే మాదిరిగా బీజేపీవాళ్లు ఓట్లు అడుక్కుంటున్నారని విమర్శించారు.

పదేళ్లలో ఏం చేశారో చెప్పకుండా..

కేసీఆర్ పదేళ్లు సీఎంగా ఉండి ఏమి చేశారో చెప్పకుండా, వంద రోజుల్లో ఐదు గ్యారంటీలను అమలు చేసిన తమను తిట్టుకుంటూ తిరుగుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. విడివిడిగా వస్తే నెగ్గలేమని అర్థం చేసుకున్న బీజేపీ, బీఆర్ఎస్ చీకట్లో చేతులు కలిపాయని.. అందుకనే మల్కాజ్‌గిరిలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుస్తున్నారంటూ మేడ్చల్ ఎమ్మెల్యే (మల్లారెడ్డి) అందరి ముందే చెప్పారని గుర్తు చేశారు. కేసీఆర్ పక్కన కూర్చొని మంత్రిగా చేసిన ఈటల రాజేందర్ కూడా రాష్ట్రంలో జరిగిన దుర్మార్గాలకు బాధ్యుడేనని, పంపకాలలో తేడా వచ్చి బయటకొచ్చాడని రేవంత్ విమర్శించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చనందుకే ఆ తర్వాత ఈటలను అక్కడి ప్రజలు ఓడగొట్టారన్నారు. ఆనాడు కొడంగల్‌లో కేసీఆర్ కక్ష గట్టి తనను ఓడిస్తే మల్కాజ్‌గిరి నుంచి ప్రశ్నించే గొంతుకగా ఎంపీగా గెలిపించారని, తాను సీఎం కావడానికి నాడు మల్కాజ్‌గిరి ప్రజలిచ్చిన ప్రోత్సాహమే కారణమని రేవంత్ తెలిపారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, చంద్రాయణ్‌గుట్ట, పీ7రోడ్డు ద్వారా ఎయిర్‌పోర్టుకు మెట్రో రైలును విస్తరించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం; మాట్లాడుతున్న సీఎం రేవంత్

భూ యజమానితోపాటు.. కౌలురైతుకూ భరోసా

» గ్రామసభల ద్వారా కౌలురైతుల గుర్తింపు

» ఎడ్యుకేషన్ పాలసీపై కమిషన్: రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుతోపాటు ఆ భూమి యజమానికీ రైతు భరోసా అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరికి ఇవ్వాల్సింది వారికి వేర్వేరుగా ఇస్తామని చెప్పారు. ఒకరికి ఇచ్చి ఇంకొకరికి ఎగ్గొట్టేది లేదని స్పష్టం చేశారు. గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులను గుర్తిస్తామని, ఆయా గ్రామాల్లో కౌలు రైతుల జాబితాలను పంచాయతీల్లో పెట్టి.. అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ ప్రక్రియనంతా పారదర్శకంగా చేస్తామని, ఇందుకు సంబంధించిన విధివిధానాలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు పెడతానని అన్నారు. ఆదివారం ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో 92 శాతం మంది రైతులు 3 ఎకరాల లోపు భూమి ఉన్నవారేనని సీఎం చెప్పారు. ఐదెకరాల పైబడి భూమి ఉన్నది 4 లక్షల కుటుంబాలకేనన్నారు. నాలుగేళ్లపాటు అందరూ కలిసి కొట్లాడితేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, కేసీఆర్ చేసిన కష్టానికి వంద తరాలకు సరిపోయేంత కూలి ఆయనకు గిట్టుబాటైందని రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణకు జాతిపిత కేసీఆర్ కాదని, ప్రొఫెసర్ జయశంకర్ అని చెప్పారు. ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలని బీఆర్ఎస్, బీజేపీ కుట్ర చేస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 లక్షల మంది యువత వారి భ్రమలను తొలగింపజేస్తారని హెచ్చరించారు. రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కూడా కాకముందే కూలగొడతామని బయలుదేరారని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నుంచి కొందరు వచ్చి తమతో కలిసి నడుస్తామని చెప్పారని వెల్లడించారు. అయితే క్లీన్ ఇమేజ్ ఉన్నవారిని, పద్ధతి గలవారినే కాంగ్రెస్‌లోకి తీసుకుంటున్నామని చెప్పారు. సమయం, సందర్భం వచ్చినప్పుడు ఎలా వ్యవహరించాలన్నదానిపై తనకు స్పష్టత ఉందన్నారు. రిజర్వేషన్లు ఎత్తివేయడమనేదే బీజేపీ కోర్ ఎజెండా అని రేవంత్ పునరుద్ఘాటించారు. తాము రాష్ట్ర ఆదాయాన్ని పెంచి.. ప్రజలకు పంచుతామని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తే ఆదాయం, ఉపాధి పెరుగుతాయన్నారు. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై కమిషన్ వేస్తామని చెప్పారు. ఇక సచివాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయకపోవడంపై సీఎం స్పందిస్తూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఏది చేసినా సీఎస్, డీజీపీలే చేయాలని అన్నారు. సీఎస్ ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసినందున తాము అక్కడికి వెళ్లి దండ వేశామని తెలిపారు. శ్రీరామనవమి రోజు భద్రాచలంలో పట్టువస్త్రాలు కూడా సీఎస్సే సమర్పించారని గుర్తు చేశారు.



నాదర్‌గుల్‌లో విద్యాభారతి విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మోహన్ భాగవత్, చినజీయర్ స్వామి

రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

(మొదటిపేజీ తరువాయి)

వేలాది పాఠశాలలుగా రూపాంతరం చెందిందని చెప్పారు. ఇప్పుడు ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభించి దేశ భక్తి, విలువలతో కూడిన విద్యను అందిస్తోందని తెలిపారు. కడుపు నింపుకోవడానికి చదువు అవసరం లేదని, సంస్కారాన్ని నేర్పి మనిషిగా మార్చేందుకు చదువు అవసరమని అన్నారు. సంఘ్ సభ్యులు సమాజానికి ఎంతో సాయం చేసినా, కనీసం కృతజ్ఞతలు కూడా ఆశించరని చెప్పారు. మనమందరం కలిసి ఉన్నంత కాలం సుఖంగా ఉంటామన్నారు. భయం, స్వార్థంతో ఎక్కువ కాలం కలిసి ఉండలేమని తెలిపారు. మన దేశంలో వేర్వేరు ఆచారాలు, ఆహార అలవాట్లు, భాషలు, వస్త్రధారణ ఉన్నప్పటికీ మనమంతా ఒక్కటేనని చెప్పారు. అందరిలో రాముడు ఉన్నాడని, సృష్టి మొత్తం నారాయణుడు వ్యాపించి ఉన్నాడని, అందుకే మనం అందరూ ఒకటేనని అన్నారు. విద్యతో జ్ఞానం వస్తుందని, జ్ఞానాన్ని సమాజ హితానికి వాడాలని సూచించారు. మాతృభాషలో భావ వ్యక్తీకరణ సులభంగా జరుగుతుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని తెలిపారు. ప్రపంచ పర్యటనకు వెళ్లడం మంచిదేనని, దాని కంటే ముందు అయోధ్య ఆలయాన్ని దర్శించుకోవాలని సూచించారు. చదువు, సంస్కారం, విద్యావంతుడైన నాయకుడు ఉంటే దేశం పురోగతి సాధిస్తుందని, 75 ఏళ్ల తర్వాత అలాంటి వ్యక్తి ఆధ్వర్యంలో భారత్ ముందుకు వెళుతోందని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని మోదీ ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన పాలనలో దేశం గర్వపడే రోజులు వచ్చాయన్నారు. విలువలతో కూడిన విద్యను సరస్వతి శిశుమందిర్‌లో అందిస్తున్నారని కొనియాడారు. దాదాపు 500 ఏళ్ల తర్వాత రాముడు వచ్చాడని, త్వరలోనే రామ రాజ్యం కూడా వస్తుందని చెప్పారు. చదువు సంపాదన కోసమే అనే భావన నేటి విద్యార్థుల్లో ఉన్నదని, సమాజ హితం కోసం కూడా అని వారు తెలుసుకోవాలని పేర్కొన్నారు. విద్యాభారతి వంటి పాఠశాలలు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. ఆరెస్సెస్ నేతలు సునీల్ అంబేకర్, సుధీర్, భరత్, విద్యాభారతి విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు రమేశ్‌గుప్తా, 14 ఎకరాల స్థలదాత భీమిడి పెద్దనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అబద్ధాల ప్రొఫెసర్ కేసీఆర్

ఆయన ఇంటిపేరులో కల్వకుంట్ల తీసేయాలి.. అబద్ధాల కేసీఆర్ అని చేర్చాలి

» పదేళ్లు ప్రజలకు అందుబాటులో ఉన్నారా?

» విపక్షంలోకి వచ్చాక 'ఎక్స్' ఖాతానా?

» రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 14 సీట్లు ఇవ్వండి

» రాహుల్ ప్రధాని అవుతారు: జగ్గారెడ్డి

హైదరాబాద్/వెంగళరావునగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఒక అబద్ధాల ప్రొఫెసర్ అని, ఆయన ఇంటిపేరులో కల్వకుంట్ల తీసేసి.. అబద్ధాల కేసీఆర్ అని పెట్టాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్ బాధ కరెంటు గురించి కాదని, పొలిటిక్ పవర్ లేదని ఆయన దిగులు పడుతున్నారని చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో భోజనం చేసేటప్పుడు కరెంటు మూడు సార్లు పోయిందంటూ కేసీఆర్ చెప్పిన మాటను ఎవరూ నమ్మబోరన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. రాష్ట్రం ఎప్పుడు విడిపోతే అప్పుడు ముఖ్యమంత్రి కావాలని కేసీఆర్ అనుకునేవారన్నారు. రాష్ట్ర విభజన జరిగి.. ముఖ్యమంత్రి అయిన తర్వాత.. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడైనా సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉన్నారా అంటూ ప్రశ్నించారు. పదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్‌కు 'ఎక్స్' ఖాతా లేదని, ప్రతిపక్షంలోకి వచ్చాక 'ఎక్స్' అవసరం వచ్చిందన్నారు. కేసీఆర్ కుటుంబానికి ప్రజలు పొలిటికల్ పవర్‌ను కట్ చేశారని, గత్యంతరం లేక ఆయన లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి 14 ఎంపీ సీట్లు ఇవ్వాలని, రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని జగ్గారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, తటస్థులు తమ పార్టీలో చేరుతున్నారని జగ్గారెడ్డి అన్నారు. హైదరాబాద్ వెంగళరావునగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్, వివిధ పార్టీల నాయకులు జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.





గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి; కాంగ్రెస్‌లో చేరుతున్న దేవిరెడ్డి నాగార్జున రెడ్డికి కండువా కప్పుతున్న పార్టీ చేరికల కమిటీ సభ్యుడు జగ్గారెడ్డి

దేశ ప్రతిష్ఠను తాకట్టు పెట్టిన మోదీ

» కేసీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదు: మంత్రి పొంగులేటి

» ఖమ్మంలో కాంగ్రెస్‌కు అత్యధిక మెజారిటీ: తుమ్మల



సత్తుపల్లి/ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 28: గత పదేళ్లలో దేశ పరువు ప్రతిష్ఠలను ప్రధాని మోదీ ఇతర దేశాల వద్ద తాకట్టు పెట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గంటకో ఖరీదైన దుస్తులు వేసుకొని దేశాలు తిరగటం తప్ప దేశానికి మోదీ ఏం చేశారని ప్రశ్నించారు. నల్ల చట్టలాకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 800 మంది రైతులను పొట్టనబెట్టుకుందన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించి మాజీని చేశారని, అయినా ఆయనలో అహంకారం ఇంకా తగ్గలేదన్నారు. ముఖ్యమంత్రిగా పదేళ్లలో ఏనాడూ ప్రజలను, ప్రజాప్రతినిధులను కలవని కేసీఆర్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. రూ.7లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించినందుకు వేయాలా.. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల్లో రూ.లక్షన్నర కోట్ల అవినీతి చేసిందుకు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలా? అని ప్రశ్నించారు. దేశంకోసం ప్రాణ త్యాగం చేసి ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ కుటుంబాలకు అండగా ఉండి రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురామిరెడ్డికి అత్యధిక మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. రాష్ట్రంలో 15 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలోపేతం అవుతుందన్నారు.

కూరగాయల మార్కెట్‌లో రఘురాంరెడ్డి ప్రచారం

"బరువులు మోయగలను.. మీ బాధ్యతలను మోయగలను" అంటూ ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని రాపర్తినగర్ కూరగాయల మార్కెట్‌లో ఆయన ఆదివారం ప్రచారం నిర్వహించారు. హమాలీలతో కలిసి ఉల్లిపాయల బస్తాను భుజంపై వేసుకుని మోశారు. అందరిలో ఒకడిగా ఉంటానని, ప్రజాసేవలో మమేకమై పనిచేస్తానని పేర్కొన్నారు.

మోదీ మళ్లీ వస్తే.. రిజర్వేషన్లు ఎత్తేస్తాడు: వీహెచ్

హైదరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశంలో మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లతో పాటు ముస్లిం రిజర్వేషన్లనూ ఎత్తేస్తాడని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు ఆరోపించారు. ఈ పదేళ్లలో అయోధ్యలో రామాలయం కట్టడం తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ కులగణన చేస్తామని చెప్పడంతో బీజేపీ మరింత దిగజారి మాట్లాడుతోందని ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. మోదీ ఆలోచనంతా కార్పొరేట్ స్థాయేనని, కాంగ్రెస్‌కు ఓటేస్తేనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కాగా, గాంధీభవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరారు. చేరికల కమిటీ సభ్యుడు, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌కే మా మద్దతు: మాల, మాదిగ సంఘాలు

పంజగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, హస్తం పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని తెలంగాణ మాల, మాదిగ సంఘాలు ప్రకటించాయి. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన వేరు వేరు సమావేశాల్లో మాల, మాదిగల సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. వర్గీకరణ పేరుతో కాలయాపన చేస్తున్న బీజేపీని చిత్తుగా ఓడిస్తామని మాదిగ ఉపకులాల ఫ్రంట్ పేర్కొంది. వర్గీకరణ పేరుతో దళితుల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్న పార్టీలకు తగిన విధంగా బుద్ధి చెబుతామని టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పోరాడుతామని మాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. మంద కృష్ణ మాదిగ.. బీజేపీకి ఏజెంటుగా పనిచేస్తున్నారని ఆరోపించారు.

ఖబడ్దార్ రేవంత్.. నోటికొచ్చింది మాట్లాడొద్దు

» మైనారిటీ, దళిత, ఆదివాసీ బిడ్డలను రాష్ట్రపతులను చేసిందే బీజేపీనే: ఈటల



పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందన్న సీఎం రేవంత్ ఆరోపణలపై ఆ పార్టీ సీనియర్ నేత, మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. "ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి.. నోటికి ఏది వస్తే అది మాట్లాడటం మంచిది కాదు" అంటూ హెచ్చరించారు. "మైనారిటీ బిడ్డ అబ్దుల్‌కలామ్, దళిత బిడ్డ రామ్‌నాథ్ కోవింద్, ఆదివాసీ బిడ్డ ముర్మును రాష్ట్రపతులను చేసిన బీజేపీ గురించా నువ్వు మాట్లాడేది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబీసీని ప్రధానిని చేసిన ఘనత బీజేపీదేనని చెప్పుకొచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొంపల్లి మున్సిపల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈటల ప్రసంగించారు. కేంద్ర మంత్రివర్గంలో 27 మంది ఓబీసీలు, 12 మంది దళితులు, 8 మంది గిరిజనులు, ఐదుగురు మైనార్టీలు ఉన్నారని గుర్తు చేశారు. వందేళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ ఏనాడైనా ఇలా అన్ని వర్గాలకు అవకాశం కల్పించిందా అని ప్రశ్నించారు. దీనిపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేసి తీరుతామన్నారు. రేవంత్ విమర్శలను ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు. "కేసీఆర్ అక్షింతలు పంచితే.. జైశ్రీరామ్ అంటే.. కడుపు నిండుతుందా.. అని అడుగుతున్నారు. కరీంనగర్‌లో హిందూగాళ్లు.. బొందుగాళ్లు అని మాట్లాడినందుకే ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టారని ఈటల అన్నారు.

రిజర్వేషన్ల రద్దు.. పెద్ద అబద్ధం

కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోంది.. షా ప్రసంగాన్ని మార్ఫింగ్ చేశారు.. అబద్ధాలే కాంగ్రెస్ గ్యారెంటీ: కిషన్‌రెడ్డి

» ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల రద్దని దుష్ప్రచారం

» మతపర రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్సే

» మేం వచ్చాక రద్దు: బండి సంజయ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ రద్దు అన్నది దశాబ్దంలోనే అతి పెద్ద అబద్ధమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సిద్దిపేటలో చేసిన ప్రసంగాన్ని కాంగ్రెస్ మార్ఫింగ్ చేసిందని చెప్పారు. ఆ పార్టీ దిగజారుడుతనానికి ఇది పరాకాష్ఠ అని.. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. అమిత్ షా వీడియోను మార్ఫింగ్ చేయడం ద్వారా కొన్ని వర్గాలను భయభ్రాంతులను చేసేందుకు, కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనకు, మోదీ పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని.. అవినీతి విషయంలో ప్రధాని మోదీని తప్పు పట్టే అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. దీంతో, బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దుచేస్తుందంటూ కాంగ్రెస్ దుష్ప్రచారానికి తెరలేపిందని మండిపడ్డారు. అబద్ధాలే కాంగ్రెస్ గ్యారెంటీలని విమర్శించారు.

కాంగ్రెస్ బీసీలను అణచివేస్తోంది: లక్ష్మణ్

కాంగ్రెస్ మతపరమైన రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం బాగ్ అంబర్‌పేటలో నిర్వహించిన గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. బీసీల కులవృత్తులను బీజేపీ అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ, వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.



కాంగ్రెస్‌కు ఓటమి భయం: సంజయ్

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తుందని కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మండిపడ్డారు. బీజేపీని ఎదుర్కొనే దమ్ము లేక ఎస్సీ, ఎస్టీల్లో భయాందోళనలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందడానికి కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. ఆదివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఇంటింటా బీజేపీ పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సంజయ్ విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు వద్దన్న మతపరమైన రిజర్వేషన్లు తెచ్చి కాంగ్రెస్ పేదల పొట్ట కొట్టిందని అన్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లను రద్దు చేసి పేదలకు పంచుతామని తెలిపారు. రాజ్యాంగాన్ని మారుస్తానని కేసీఆర్ ప్రకటిస్తే కాంగ్రెస్ కనీసం నోరు మెదపలేదన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్‌పై వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే బీజేపీపై బురదజల్లుతున్నారని విమర్శించారు. ఓడిపోతామన్న భయంతోనే బీజేపీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ లేనిపోని విమర్శలు చేస్తున్నాయని సంజయ్ తెలిపారు.

నేడు రాష్ట్రానికి జేపీ నడ్డా

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం ఉదయం 11 గంటలకు కొత్తగూడెం, మధ్యాహ్నం 12.30 గంటలకు మహబూబాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు సెగ్మెంటు పరిధిలోని నిజాంపేటలో నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. మాజీ గవర్నర్ తమిళి సై సోమవారం నుంచి రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.


30న మెదక్ జిల్లాలో మోదీ సభ

ఈ నెల 30న మెదక్ జిల్లా అల్లాదుర్గంలో నిర్వహించనున్న జన సభకు ప్రధాని మోదీ హాజరుకానున్నారు. ఆదివారం సభా ప్రాంగణాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి పరిశీలించారు.

బీజేపీలోకి పెద్దిరెడ్డి..

మాజీ మంత్రి పెద్దిరెడ్డి నేడో, రేపో బీజేపీలో చేరతారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన రెండుసార్లు హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలిచారు. హుజూరాబాద్ ఉపఎన్నిక ముందు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు.





కాంగ్రెస్	8,17,279
బీఆర్ఎస్	5,60,002
బీజేపీ	74,882

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

పోరాటాల పురిటిగడ్డ. వామపక్ష ఉద్యమాలకు ఊపిరులూదిన నేల. రావి నారాయణరెడ్డి లాంటి తెలంగాణ సాయుధ పోరాట యోధుడికి దేశంలోనే అత్యధిక మెజారిటీ కట్టబెట్టి పార్లమెంటుకు పంపించిన ప్రాంతం. నియోజకవర్గాల పునర్విభజనతో 2009లో లోక్‌సభ స్థానంగా మారిన భువనగిరి.. ఈసారి ఎన్నికల్లో ప్రతిష్ఠాత్మక పోరుకు వేదిక కాబోతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని కొనసాగించాలనే ప్రయత్నం చేస్తుండగా, భువనగిరిలో గెలిచి పూర్వ వైభవం సాధించాలని బీఆర్ఎస్, కేంద్రంలో తమకున్న సానుకూలత, అభ్యర్థి ఇమేజ్ ఆధారంగా గెలవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నాయి.

భువనగిరి ఎవరిదో!



ప్రధాన పార్టీల మధ్య ప్రతిష్ఠాత్మక పోరు

- కోమటిరెడ్డి బ్రదర్స్‌కు సవాల్‌గా ఎన్నిక
- చామలను గెలిపించే బాధ్యత వారిపైనే
- బీఆర్ఎస్ తరపున బరిలో క్యామ మల్లేష్
- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ బీజేపీ నుంచి
- అపరిష్కృత సమస్యలే ఎజెండాగా ప్రచారం





(ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఐదు కొత్త జిల్లాలు.. యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగామ జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తుండగా, బీఆర్ఎస్ పార్టీ కురుమ సామాజికవర్గానికి చెందిన క్యామ మల్లేశ్‌ను బరిలోకి దించింది. ఇక బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్.. కమలం గుర్తుపై పోటీ చేస్తున్నారు. ఈ ముగ్గురు అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల అగ్రనేతలు పలువురు ప్రచారంలో పాల్గొంటున్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటించారు. క్యామ మల్లేశ్ తరఫున బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, బూర నర్సయ్య తరఫున కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తదితర నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ, ప్రియాంకగాంధీ వంటి అగ్రనేతలు కూడా ప్రచారానికి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం..

రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. భువనగిరి స్థానాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా ఆ పార్టీ భావిస్తోంది. ఎన్నికలు హోరాహోరీగా సాగుతున్న నేపథ్యంలో.. పంద్రాగస్టులోగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ భువనగిరి వేదికగానే ప్రకటించారు. సాగునీటి ప్రాజెక్టు, కాల్వలతో పాటు భువనగిరి అభివృద్ధి బాధ్యతను తానే తీసుకుంటానన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్డు రానుండటంతో భువనగిరి, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల మధ్యలో పారిశ్రామిక వాడలు, ఐటీ హబ్ నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. అయితే భువనగిరి నియోజకవర్గం కోమటిరెడ్డి బ్రదర్స్‌కు సవాల్‌గా మారింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆయన సోదరుడు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో ఇక్కడి నుంచి ఎంపీలుగా పని చేసినందున పార్టీ అభ్యర్థిని గెలిపించే బాధ్యతను అధిష్ఠానం వీరిద్దరికి అప్పగించింది.

నర్సయ్యగౌడ్ ఈసారి బీజేపీ నుంచి..

2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలైన మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్.. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. 2014 నుంచి 2019 వరకు ఎంపీగా పనిచేసిన సమయంలో నియోజకవర్గానికి ఎయిమ్స్, కేంద్రీయ విద్యాలయం, ఎంఎంటీఎస్, పాస్‌పోర్టు కేంద్రం, 524 కిలోమీటర్ల జాతీయ రహదారులు, గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, తదితర ప్రాజెక్టులను తీసుకొచ్చానని, మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బూర నర్సయ్యగౌడ్ ప్రచారం చేస్తున్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఒక్క జనగామలో తప్ప మిగతా ఆరు చోట్లా పరాజయం పాలైన బీఆర్ఎస్.. పూర్వ వైభవం చాటుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే అన్ని సెగ్మెంట్లలోనూ సమీక్ష సమావేశాలు పూర్తిచేసింది. అధినేత కేసీఆర్ ఇటీవలే భువనగిరిలో రోడ్‌షో నిర్వహించారు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో..

కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
5,32,495	5,27,578	65,451
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	డాక్టర్ బూర నర్సయ్యగౌడ్	పీవీ శ్యాం సుందర్‌రావు

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

కాంగ్రెస్	ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి, నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరు
బీఆర్ఎస్	జనగామ

పురుషులు	8,96,219
మహిళలు	9,08,632
ఇతరులు	79
మొత్తం ఓటర్లు	18,04,930

అపరిష్కృత సమస్యలే ప్రధాన ఎజెండాగా..

లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అపరిష్కృత సమస్యలే ప్రధాన ఎజెండాగా మూడు ప్రధాన పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. భువనగిరి ఖిల్లా అభివృద్ధి, బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్ల నిర్మాణం, రాయగిరి వరకు ఎంఎంటీఎస్ కొనసాగింపు, సాగునీటి కాల్వల పునరుద్ధరణ, ధర్మారెడ్డి, పిలాయిపల్లి, బునాదిగాని కాల్వ ఆధునికీకరణ, మూసీ ప్రక్షాళన, టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి తదితర అంశాలను ప్రచారం చేస్తున్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లు కీలకం

భువనగిరి నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ఓటు బ్యాంకు చాలా కీలకమైంది. సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే గౌడ్, ముదిరాజ్, పద్మశాలీ, గొల్ల, కురుమలు, ఎస్సీలు అధికంగా ఉన్నారు. తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కురుమ కులస్తుడైన క్యామ మల్లేష్‌ను, బీజేపీ నుంచి బూర నర్సయ్యగౌడ్‌ను ఆయా పార్టీలు బరిలో దింపాయి. కాంగ్రెస్ పార్టీ మాత్రం మరోసారి రెడ్డి సామాజికవర్గానికే అవకాశం కల్పించింది.



అసెంబ్లీకి ఒకలా..

పార్లమెంటుకు మరోలా.!

- లోక్‌సభ ఎన్నికలకు తగ్గుతున్న ఓటింగ్
- 2018లో ఎమ్మెల్యే ఎన్నికలకు 73.74%
- 2019 ఎంపీ ఎన్నికలకు 62.77% నమోదు
- శాసనసభ ఎన్నికలతో పోలిస్తే..
- అభ్యర్థుల ప్రచారం, ప్రాధాన్యం తక్కువే
- ఎండలు మండుతుండడమూ కారణం!
- ఈసారి మరింత తీవ్రంగా ఉన్న ఎండలు



హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలపై తెలంగాణ ఓటర్లు.. అసెంబ్లీ ఎన్నికల పట్ల చూపించినంత ఆసక్తి చూపడంలేదా? ఎమ్మెల్యేను ఎన్నుకునేందుకు ఇచ్చిన ప్రాధాన్యం.. ఎంపీని ఎన్నుకునేందుకు ఇవ్వడంలేదా? అంటే.. ఆయా ఎన్నికల్లో నమోదవుతున్న ఓటింగ్ శాతాన్ని బట్టి చూస్తే ఇది నిజమేననిపిస్తోంది. ప్రతిసారీ శాసనసభ ఎన్నికలతో పోలిస్తే.. పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండేవారు సైతం స్వస్థలాలకు వచ్చి ఓటు వేస్తున్నారు. కానీ, ఎంపీ ఎన్నికలకు మాత్రం ఆ స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వడంలేదు. 2018 డిసెంబరు 7న జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం 73.74గా నమోదు కాగా, ఆ తరువాత నాలుగు నెలలకు 2019 ఏప్రిల్ 11న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం 62.77 శాతమే నమోదైంది. ఏకంగా 11 శాతం తగ్గింది. ఇందుకు రకరకాల కారణాల్లో ఎండాకాలం కూడా ఓ కారణమేనని స్పష్టమవుతోంది. 2019 ఏప్రిల్ రెండో వారంలో రాష్ట్రంలో 42-43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ ఉష్ణోగ్రతలకే పోలింగ్ శాతం అంతగా తగ్గిందంటే.. ఈసారి ఇప్పుడే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటేస్తున్నాయి. ఇక పోలింగ్ జరిగే మే నెల రెండోవారం నాటికి ఇంకెంతగా పెరుగుతాయో, ఎండలు ఎంతగా మండిపోతాయో చెప్పలేని పరిస్థితులున్నాయి. అయితే పోలింగ్ తగ్గడానికి ఎండలతోపాటు ఇతర కారణాలు కూడా లేకపోలేదు.

ఆ స్థాయిలో ఉండని ప్రచారం..

రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వేర్వేరు సమయాల్లో జరుగుతున్న విషయం తెలిసిందే. 2014లో జమిలి ఎన్నికలు జరిగినా.. 2018లో నాటి సీఎం కేసీఆర్ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతో ఈ పరిస్థితి వచ్చింది. తొలుత జరిగే శాసనసభ ఎన్నికలతో రాష్ట్రంలో అధికారం ఏ పార్టీదో తేలిపోతుండడంతో.. పార్లమెంటు ఎన్నికలతో రాష్ట్రంలో మారిపోయే సమీకరణాలేవీ ఉండవన్న అభిప్రాయం ఓటర్లలో నెలకొంటోంది. ఆ ఉద్దేశంతోనే 2019 పార్లమెంటు ఎన్నికలపై ఓటర్లు పెద్దగా ఆసక్తి కనబరచలేదన్న అభిప్రాయాలున్నాయి. అంతేకాకుండా.. ఎంపీ అభ్యర్థులు, పార్టీలు గడగడపకు ప్రచారం చేయడం, మద్యం, డబ్బు పంపిణీ, ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తరలించడం లాంటివి ఎమ్మెల్యే ఎన్నికల స్థాయిలో జరగవు. ఇక అసెంబ్లీ ఎన్నికల కోసం హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో ఉన్నవారిని ప్రత్యేకంగా ఇళ్లకు రప్పించి ఓటేయించుకునే విధానం ఎంపీ ఎన్నికల్లో కనిపించదు. ఇది కూడా పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడానికి ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది.


ఎండకు బయటకొస్తారా? ఓటేస్తారా?

ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 7 గంటలకే 30 డిగ్రీలతో మొదలై మధ్యాహ్నం 12 గంటల వరకే 40 డిగ్రీలకు చేరుతోంది. జనం బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరిగే మే 13 నాటికి ఇది ఇంకెంత తీవ్రంగా ఉంటుందోనన్న ఆందోళన ఉంది. గతేడాది మే 18న ఖమ్మం జిల్లా జూలూరుపాడులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కొన్నిసార్లు మే నెలలో తెలంగాణలో 48 డిగ్రీలకు చేరుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ ఏడాది కూడా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. దీంతో ఓటర్లు ఓటేసేందుకు బయటకొస్తారా? అన్న సందేహాలు వస్తున్నాయి.

పారాచ్యూట్ పరేషాన్!

జంపింగ్‌లకు టికెట్లు ఇచ్చిన కాంగ్రెస్, బీజేపీ.. కార్యకర్తల నుంచి సహకారం కరువు

- కొన్నిచోట్ల టికెట్లు ఆశించిన సీనియర్లూ ప్రచారానికి దూరం
- కాంగ్రెస్‌కు ఐదు, బీజేపీకి ఏడుచోట్ల ఇబ్బందులు
- అసంతృప్త నేతలకు పార్టీ నేతల బుజ్జగింపులు



హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు వచ్చాయి! నాయకులు పార్టీలు మారారు! కండువాలు మార్చుకున్నారు! ఆయా పార్టీల నుంచి ఎన్నికల బరిలో నిలిచారు! మరి, పారాచ్యూట్ నాయకులకు శ్రేణులు సహకరిస్తున్నాయా!? అంటే.. కొన్ని చోట్ల లేదన్నదే జవాబు! దాంతో, సొంత పార్టీ నుంచే వారు ప్రతికూలతలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎన్నికల ముంగిట కాంగ్రెస్, బీజేపీల్లో చేరిన పలువురు నేతలు ఎన్నికల బరిలో నిలవడం తెలిసిందే. కాంగ్రెస్‌లోకి ఐదుగురు, బీజేపీలోకి ఏడుగురు బీఆర్ఎస్ నేతలు చేరి టికెట్లు దక్కించుకున్నారు. ఇప్పుడు వీరికి ఆయా పార్టీల్లోని కింది స్థాయి శ్రేణులు చికాకులు సృష్టిస్తున్నారు.

అప్పుడు కేసులు పెట్టినోళ్లకు సహకరించాలా?

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆ పార్టీ ప్రజా ప్రతినిధులపై పోరాటాలు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి వారితోనే కలిసి పని చేయాల్సి రావడం రుచించట్లేదు. చేవెళ్ల, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, మెదక్, వరంగల్ సీట్లలో ఇదే పరిస్థితి. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. వెన్వెంటనే ఆయనకు ఎంపీ టికెట్టూ దక్కింది. దీంతో, ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న కేఎల్ఆర్ సహా స్థానిక నాయకులు అసంతృప్తితో ఉన్నారు. ఇక, చేవెళ్ల టికెట్ హామీ మీదనే కాంగ్రెస్‌లో చేరిన వికారాబాద్ జడ్పీ చైర్మన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డికీ అక్కడ సీటు దక్కలేదు. పార్టీ నాయకత్వం ఆమెకు నచ్చజెప్పి మల్కాజ్‌గిరి టికెట్ ఇచ్చింది. దీంతో, చేవెళ్లలో కొంత పట్టున్న మహేందర్‌రెడ్డి దంపతులు మల్కాజ్‌గిరికి పరిమితమవ్వాల్సి వచ్చింది. ఇక, నియోజకవర్గంలోని కాంగ్రెస్ క్యాడర్ కూడా రంజిత్‌రెడ్డికి పూర్తి స్థాయిలో సహకరించట్లేదు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తమపై కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టిన వారికి ఇప్పుడు ఎలా సహకరిస్తామని ప్రశ్నిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి పోటీ చేస్తున్న దానం నాగేందర్‌కూ నగర నేతల నుంచి పెద్దగా సహకారం అందట్లేదు. నగరంలోని సీనియర్ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, విహనుమంతరావు తదితరులు ప్రచారంలో పెద్దగా కనిపించట్లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో దానం చేతిలో ఓడిన పీజేఆర్ తనయ విజయారెడ్డి కూడా అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. ఇక, మెదక్‌లోనూ నీలం మధుకు స్థానిక నేతల నుంచి పూర్తి సహకారం అందట్లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటమికి కారణమయ్యారనే కోపంతో పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్ వర్గం మనస్ఫూర్తిగా సహకరించడం లేదని అంటున్నారు. బీఆర్ఎస్ టికెట్ వదులుకుని వరంగల్ కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్న కడియం కావ్యకూ ఇదే పరిస్థితి. ఇక్కడ టికెట్ ఆశించిన నేతలతోపాటు మంత్రి కొండా సురేఖ వర్గం పూర్తిస్థాయిలో సహకరించడం లేదనే ఆరోపణలున్నాయి. స్థానిక నాయకుల నుంచి పూర్తిస్థాయి సహకారం అందకపోయినా రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండడం, ఐదు గ్యారెంటీల అమలు, కేంద్రంలోని బీజేపీ విధానాలపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతే తమను గెలిపిస్తుందని పారాచ్యూట్ అభ్యర్థులు నమ్ముతున్నారు.

ప్రచారానికి రాజాసింగ్ దూరం

హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి మాధవీలత ప్రచారానికి హ్యాట్రిక్ ఎమ్మెల్యే రాజాసింగ్ దూరంగా ఉన్నారు. పాతబస్తీలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్న మాధవీలత.. గోషామహల్ సెగ్మెంట్‌లో ఇంకా ప్రచారం ప్రారంభించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాజాసింగ్ నివాసానికి వెళ్లి, ఆయన సతీమణితో కూడా మాధవీలత భేటీ అయ్యారని పార్టీవర్గాలు తెలిపాయి.

బీజేపీ పారాచ్యూట్ అభ్యర్థులకూ సంకటమే

బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చి టికెట్లు దక్కించుకున్న బీజేపీ అభ్యర్థులు కూడా కొన్నిచోట్ల సంకట పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వారి అభ్యర్థిత్వాలను ఆది నుంచీ వ్యతిరేకిస్తున్న కొంతమంది సీనియర్లు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. మరికొన్నిచోట్ల సదరు అభ్యర్థులు కూడా పార్టీ కేడర్‌ను కలుపుకొని వెళ్లడం లేదు. ఎక్కడి నుంచో వచ్చిన వారికి ఇంకెంతకాలం సహకరించాలని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దాంతో, వారిని బుజ్జగిస్తున్న ముఖ్య నేతలు.. అధిష్ఠానం నిర్ణయానికి అనుగుణంగా పని చేయాలని, మోదీ కోసం సహకరించాలని కోరుతున్నారు. జహీరాబాద్‌లో బీఆర్ఎస్ సిటింగ్ ఎంపీగా బీబీ పాటిల్ తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారని, ఆయనకు టికెట్ ఇవ్వవద్దంటూ చేరికకు ముందే పలువురు జహీరాబాద్ నాయకులు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆందోళన చేశారు. దీనిని పక్కనబెట్టిన నాయకత్వం పాటిల్‌కే అవకాశం ఇచ్చింది. దాంతో, ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన కొంతమంది సీనియర్లు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న వెంకటరమణా రెడ్డికి, పాటిల్‌కు పొసగడం లేదన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉంది. అయితే, పాటిల్ సామాజికవర్గం ఆయనకు అండగా నిలిచిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆదిలాబాద్ టికెట్ కోసం సిటింగ్ ఎంపీ సోయం బాపూరావుతోపాటు మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ చివరి వరకూ ప్రయత్నించారు. కానీ, ఇక్కడ బీఆర్ఎస్ నుంచి వచ్చిన నగేశ్‌కు బీజేపీ అవకాశం ఇచ్చింది. దాంతో, బాపూరావు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. రమేశ్ రాథోడ్ నామినేషన్ దాఖలు చేశారు. పోటీలో ఉంటారా? లేదా? అనేది చర్చనీయాంశమైంది. అలాగే, నల్లగొండలో సైదిరెడ్డికి టికెట్ ఇవ్వొద్దంటూ మొదట్లోనే అధినాయకత్వానికి విజ్ఞప్తి చేసిన పలువురు సీనియర్లు ఇప్పటికీ అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గిరిజనుల హక్కుల కోసం తాము పోరాటం చేస్తే నాడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న సైదిరెడ్డి తమపై లాఠీచార్జి జరిపించి, అక్రమంగా కేసులు పెట్టించడంతోపాటు సీనియర్లను 50 రోజులపాటు జైల్లో ఉంచారని, ఆయనకు ఎందుకు సహకరించాలని సీనియర్ నేతలు, పార్టీ ముఖ్యులను ఒకరిద్దరు నిలదీసినట్లు సమాచారం. పెద్దపల్లిలో గోమాస శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని పలువురు సీనియర్లు, క్యాడర్ ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. కొన్నిచోట్ల ప్రచారం కూడా చేపట్టలేదని రాష్ట్ర పార్టీ నాయకత్వం జాతీయ పార్టీకి నివేదించింది.



వామపక్షం..

వెనకబాటు

ఒకప్పుడు సంకీర్ణాలకు మూలస్తంభంగా లెఫ్ట్ పార్టీలు

- 2009 నుంచి సీట్లు.. ఓట్ల శాతంలో భారీగా పతనం
- గత ఎన్నికల్లో కేవలం ఐదు స్థానాలకే పరిమితం
- బెంగాల్, త్రిపురలో నామమాత్రం.. కేరళలోనే ఉనికి
- తెలుగు రాష్ట్రాల్లోనూ అంతా గత వైభవం గుర్తులే
- సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తేనే పునరుజ్జీవం

(ఆంధ్రజ్యోతి, హైదరాబాద్)

ప్రజా సమస్యలను భుజానికెత్తుకుంటూ, ప్రభుత్వాల్లోని అవినీతిపై గళమెత్తుతూ, ఉద్యమాలే ఊపిరిగా ప్రస్థానం సాగించిన వామపక్షాల ప్రాభవం క్రమంగా క్షీణిస్తోంది. ఒకనాడు కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో కీలకంగా వ్యవహరించి.. పలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కమ్యూనిస్టులు నేడు ఉనికి చాటుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. 'యునైటెడ్ ఫ్రంట్', 'యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్' కూటములకు ఇరుసుగా వ్యవహరించిన లెఫ్ట్ పార్టీలు నేడు సాధారణ పార్టీలుగా మారిపోయాయి. 15 ఏళ్లలో కంచుకోటలైన బెంగాల్, త్రిపురను చేజార్చుకున్నాయి. కేరళలో మాత్రమే పట్టు నిలుపుకొంటున్నాయి. గత ఎన్నికల ఫలితాల అనంతరం అత్యంత నిరుత్సాహానికి గురైనవి ఏవైనా ఉన్నాయంటే అవి లెఫ్ట్ పార్టీలే. ఎందుకంటే.. 60 ఏళ్లలో అతి తక్కువ సీట్లు సాధించినది ఈ ఎన్నికల్లోనే.

59 నుంచి 5కు.. అదీ దక్షిణాదిలోనే..

సీపీఎం, సీపీఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్‌పీ.. వామపక్షాల్లో పేరున్నవి. ఇవికాక మరికొన్ని కూడా ఉన్నాయి. 2004 లోక్‌సభ ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలు 59 స్థానాల్లో గెలిచి యూపీఏ ప్రభుత్వాన్ని శాసించాయి. వీటిలో అధికం బెంగాల్, కేరళ, త్రిపురలోనివే. కాగా, 2008లో కూటమి నుంచి వైదొలిగాయి. 2009 ఎన్నికల్లో 24 స్థానాలకు పడిపోయాయి. ఇక అప్పటి నుంచి కోలుకున్నది లేదు. 2014లో 10కి పరిమితమయ్యాయి. 2019లో అయితే 5తో సరిపెట్టుకున్నాయి. వీటిలోనూ.. అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రమైన కేరళలో సాధించింది ఒకటే సీటు. తమిళనాడులో డీఎంకే చలవతో సీపీఎం, సీపీఐ రెండేసి స్థానాల్లో నెగ్గాయి. అంటే మొత్తం స్థానాలు దక్షిణాది నుంచి గెలిచినవేనన్నమాట.

పడిపోతున్న ఓట్ల శాతం

2014 ఎన్నికల్లో అధికారం లేనప్పటికీ బెంగాల్‌లో 30.1 శాతం ఓట్లు సాధించాయి లెఫ్ట్ పార్టీలు. రెండు సీట్లలో గెలుపొందాయి. ఇది 2019కి వచ్చేసరికి 7.5 శాతానికి పడిపోయింది. ఒక్క సీటూ నెగ్గలేదు. త్రిపురలో 1996 నుంచి 2019 వరకు ఆరు ఎన్నికల్లో సీపీఎం అన్ని స్థానాలను కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ 1993 నుంచి 2018 వరకు ఆధిపత్యం చాటింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి మాణిక్ సర్కార్ ప్రభుత్వం ఓటమితో బీజేపీ అధికారంలోకి వచ్చింది. 20 ఏళ్ల కిందట త్రిపురలో 68.8 శాతం ఓట్ షేర్ ఉన్న కమ్యూనిస్టులు 2019లో 17.3 శాతానికి పరిమితమయ్యారు. కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ కూటమి 2014లో 8 స్థానాలను సొంతం చేసుకున్నా.. 2019లో ఒక్కచోటనే నెగ్గింది. 31.9 శాతం ఓట్లను సాధించడమే కాస్త ఊరట.

తెలుగు రాష్ట్రాల్లో మరీ దారుణం

తెలుగు రాష్ట్రాల్లో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ 38, సీపీఎం 68 స్థానాల్లో పోటీ చేసి చెరొకటి గెలిచాయి. సాధించిన ఓట్లు 1 శాతం లోపే. 2018 తెలంగాణ ఎన్నికల్లో సీపీఐ 3 చోట్ల, సీపీఎం 26 స్థానాల్లో బరిలో దిగినా ఒక్కటీ దక్కలేదు. అర శాతం ఓట్లు కూడా పడలేదు. ఇటీవలి ఎన్నికల్లో సీపీఎం 17 చోట్ల పోటీ చేసి 0.22 శాతం ఓట్లను పొందింది. సీపీఐ కొత్తగూడెంలో సీపీఐ గెలిచింది. 0.34 శాతం ఓట్లు సాధించింది.

ఎందుకు ఈ దుస్థితి?

కొత్త తరానికి తమ సిద్ధాంతాలను చేరవేయలేకపోవడం, ఎలాగూ అధికారంలోకి రాలేవనే భావన ప్రజల్లో పెరగడం, క్షేత్రస్థాయిలో బలమైన నాయకత్వం కొరవడడం లెఫ్ట్ పార్టీలకు గడ్డు పరిస్థితి తెచ్చిపెట్టాయి. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తుండడం, ఆర్థిక సంస్కరణలతో మారిన ప్రజల జీవన విధానాలు లెఫ్ట్ పార్టీల సిద్ధాంతాలకు సవాల్ విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో కాలానికి అనుగుణంగా పంథాను మార్చుకోవాలని, అప్పుడే చట్టసభల్లో ప్రశ్నించేందుకు అవకాశం దక్కుతుందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

కొడంగల్ ఎత్తిపోతలకు టెండర్ల ఆహ్వానం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 1.30 లక్షల ఎకరాలకు సాగునీటిని, ఆయా ప్రాంతాలకు తాగునీటిని అందించడానికి వీలుగా రూ.1894 కోట్లతో చేపడుతున్న కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. టెండర్ల దాఖలుకు మే 31 వరకు అవకాశం కల్పించింది. ఈ పథకానికి 2014లోనే ఉమ్మడి రాష్ట్రంలో పరిపాలన పరమైన అనుమతులు లభించాయి. అయితే తెలంగాణ ఏర్పడ్డాక దీన్ని పక్కన పెట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకంపై దృష్టి సారించింది. దీని ద్వారా మక్తల్, నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద, కొడంగల్, దౌల్తాబాద్, కోస్గి, మద్దూరు, బొమ్మరాసిపేట తదితర ప్రాంతాల్లోని సాగుభూములకు నీరందించనున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తులు షురూ

» మే 7 వరకు దరఖాస్తుకు అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ - 2024కు దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. మెయిన్‌లో అర్హత సాధించిన వారిలో 2.50 లక్షల మందికి జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అవకాశం కల్పించారు. వీరంతా మే 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.3,200గా నిర్ణయించారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.1,600 చెల్లించాల్సి ఉంటుంది. మే 17 నుంచి 26వ తేదీ వరకు అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంటాయి.

ముగిసిన గురుకుల ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు, బీసీ గురుకులంలోని ఇంటర్ కాలేజీలో అడ్మిషన్లకు ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా 18,989 మంది దరఖాస్తు చేసుకోగా 16,564 మంది హాజరయ్యారని, ఇంటర్‌లో ప్ర వేశాలకు 47,463 మంది దరఖాస్తు చేసుకోగా 41,775 మంది హాజరయ్యారని బీసీ గురుకుల సెక్రటరీ, టీజీ ఆర్డీసీ సెట్ కన్వీనర్ బడుగుల సైదులు తెలిపారు.

రిజర్వేషన్లను నీరుగార్చిన బీజేపీ: జాజుల

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక వివక్ష, సాంఘిక అసమానతలు రూపుమాపడానికి భారత రాజ్యాంగం కల్పించిన సామాజిక రిజర్వేషన్లను బీజేపీ నీరుగార్చిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. రాజ్యాంగంలోని మూల సిద్ధాంతాన్ని, లక్ష్యాన్ని దెబ్బతీసి ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికగా అగ్రకుల రిజర్వేషన్లను తీసుకొచ్చిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీకి బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కులగణన చేపట్టి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలి: ఎల్.రమణ


హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో రాష్ట్రంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు పెరిగాయని.. వారి ఇబ్బందులను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలను ఆదుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ కోరారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించడం.. హత్యచేసిన వాళ్లు సంతాప సభకు వెళ్లినట్లుగా ఉందని విమర్శించారు. కాగా, అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ నేతల్లో అహంకారం పెరిగిందని, వారి చర్యలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్‌నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు.

కాళేశ్వరం కహానీ

ఈ ప్రాజెక్టు.. బీఆర్ఎస్ ప్రభుత్వ ఇంజనీరింగ్ తప్పిదమే

» కాళేశ్వరం లోపాలపై కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్

దశాబ్దాల తెలంగాణ కల 2014లో సాకారమైంది. తెలంగాణ ఉద్యమ నినాదమైన 'నీళ్లు, నిధులు, నియామకాలు'లో మొదటిది, అతి ముఖ్యమైనది.. నీళ్లు అనేది అందరికీ తెలిసిందే. దాదాపు 980 టీఎంసీల గోదావరి జలాల కేటాయింపులున్న తెలంగాణ రాష్ట్రానికి గతపాలకులు ఏమీ చేయలేదంటూ నిందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది. ఇలాంటి నిందల కంటే.. ప్రాజెక్టులకు సంబంధించి మంచి ప్రణాళికలు రూపొందించి, సక్రమంగా అమలు చేసి రాష్ట్రప్రజలకు నీటిని అందించడమే ముఖ్యం. కానీ, నీటి విషయంలో, కాళేశ్వరం నిర్మాణం విషయంలో పదేళ్ల బీఆర్ఎస్ సర్కారు అసమర్థ ప్రణాళికల కారణంగా భారీగా ప్రజాధనం వృథా కావడమే కాక రాబోయే తరాలూ తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. నిజానికి 2014కు ముందు తెలంగాణలోని 16.4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో 165 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా ప్రాణహిత-ఎల్లంపల్లి-చేవెళ్ల (పీసీఎస్) ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద నిర్మించాలని గత పాలకులు తలపెట్టారు. కానీ, రాష్ట్రం ఏర్పాటయ్యాక కొలువుదీరిన బీఆర్ఎస్ సర్కారు 152 మీటర్ల ఫుల్ రిజర్వాయర్ లెవెల్‌పై మహారాష్ట్రను ఒప్పించలేకపోయింది. ఇది కచ్చితంగా ఆ ప్రభుత్వ వైఫల్యమే. వాస్తవం ఇది కాగా.. తుమ్మిడిహట్టి వద్ద 165 టీఎంసీల నీరు అందుబాటులో లేదని సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) పేర్కొందంటూ.. 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పింది. కానీ అక్కడ 165 టీఎంసీల లభ్యత ఉంటుందని సీడబ్ల్యూసీ విస్పష్టంగా, చెప్పింది. అయినా బీఆర్ఎస్ సర్కారు అదే అబద్ధంతో ప్రాజెక్టును రీ-ఇంజనీరింగ్ చేసి లోకేషన్‌ను మేడిగడ్డకు మార్చింది. ప్రాణహిత చేవెళ్లతో పోలిస్తే కాళేశ్వరం నిర్మాణ ఖర్చు చాలా ఎక్కువ. కానీ.. పెరిగిన ఆయకట్టు మాత్రం 2 లక్షల ఎకరాల్లోపే.



केन्द्रीय जल आयोग
जल विज्ञान (दक्षिण) निदेशालय

विषय:–: Detailed Project Report of Dr. B.R. Ambedkar Pranahita – Chevella Sujala Sravanthi Project

संदर्भ:– (i) CWC I.D. No. 6/266/10-PA(S)/ 85 dated 09-02-2015
(ii) Lr No. Dr. BRAPCSS/DEE/AEE-9/CWC/2014 dated 31-01-2015
(iii) This office letter dated 24-10-2014

(xii) As evident from detailed water availability studies carried out by project authorities and this office in last few years, the net water availability at the barrage location is about 165 TMC at 75 percent dependability which includes perceived surpluses from the share of u/s states (i.e. assuming the utilization of u/s states limited to 75 percent availability) of 63 TMC. It is seen

తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల లభ్యత ఉందంటూ 2015లో సీడబ్ల్యూసీ నుంచి అందిన సమాచారం

ప్రధాన కారణం..

ఏ ప్రాజెక్టుకైనా.. ప్రణాళిక (ప్లానింగ్), దర్యాప్తు (ఇన్వెస్టిగేషన్), సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ, మోడలింగ్, డిజైనింగ్, నిర్మాణం, నాణ్యత, అమలు-నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్- ఓ అండ్ ఎం).. ఇలా ఒక క్రమం ఉంటుంది. కానీ, 2016లో కాళేశ్వరం డీపీఆర్ తయారీయే చాలా హడావుడిగా జరిగింది. సాధారణంగా బ్యారేజీల డిజైన్లు, ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర అంశాలపై తుది నిర్ణయం తీసుకోవడానికి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) నోడల్ యూనిట్‌గా ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సరైన డిజైన్లు రూపొందించడానికి సీడీవోకు తగినంత సమయం ఇవ్వలేదు. దానికితోడు 'ఉన్నతాధికారుల' ప్రభావం, నిరంతరజోక్యం సరేసరి! అంతే కాదు.. డీపీఆర్‌లో పేర్కొన్న అనేక సాంకేతిక అంశాలను క్షేత్రస్థాయిలో సరిగా పరిశోధించలేదు. సరైన దర్యాప్తు లేకపోవడంతో ప్రాజెక్టుకు సరైన ప్రణాళిక లేకుండా పోయింది. తగినంత సమయం ఇవ్వకుండా ప్లానింగ్, ఇన్వెస్టిగేషన్ హడావుడిగా చేయడంతో ప్రాజెక్టుకు సరైన డిజైనింగ్ జరగలేదు. అలాగే.. బ్యారేజీల నిర్మాణంలో కొన్ని కీలక డిజైన్ అంశాలు సరిగ్గా కార్యరూపం దాల్చలేదు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కూడా ఉన్నతాధికారులు నిరంతరం జోక్యం చేసుకోవడంతో నిర్మాణ ప్రక్రియపై ప్రభావం పడింది. మోడలింగ్ ఏజెన్సీ అయిన తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రిసెర్చ్ లేబొరేటరీస్ (టీఎస్ఈఆర్ఎల్)లో సరైన పద్ధతిలో మోడలింగ్ చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు. నిర్మాణ ప్రక్రియలో సీడీవో, టీఎస్ఈఆర్ఎల్‌తో ప్రాజెక్టు నిర్మాణ విభాగం సరిగా సమన్వయం చేసుకోకపోవడంతో మూడు బ్యారేజీల నిర్మాణం, అమలు, నిర్వహణలో సమన్వయం దెబ్బతింది. బ్యారేజీలు ప్రారంభమయ్యాక.. అమలు, నిర్వహణ (ఓ అండ్ ఎం) ప్రొఫెషనల్‌గా జరగలేదు. సీపేజీ, పైపింగ్, సీసీ బ్లాకులకు నష్టం కలగడం, ఇతర లోపాలు మొదట్లోనే కనిపించినా.. వాటి తీవ్రతను అర్థం చేసుకునే సీరియస్‌నెస్, ప్రొఫెషనలిజం లేకపోవడంతో వాటిని పరిష్కరించలేకపోయారు. నిర్మాణ సమయంలో ఉపయోగించిన కాఫర్ డ్యాములు, షీట్ పైల్స్‌ను 5 సీజన్లుగా తొలగించకపోవడం వల్ల బ్యారేజీలో నది సహజ ప్రవాహానికి అడ్డంకి ఏర్పడింది. ఈ వైఫల్యాలన్నీ విపత్తుకు కారణమయ్యాయి.

సమయమే ఇవ్వలేదు..!

ప్రాజెక్టు కట్టే చోట జియోటెక్నికల్ పరిశోధనలు చేయడం, నాణ్యత, పర్మియబిలిటీని (రాళ్ల గుండా నీరు ప్రవహించే సామర్థ్యం) పరీక్షించడం, ఆ డేటాతో నిర్మాణాలను ప్లాన్ చేయడం.. వీటన్నింటికీ 8 నెలల నుంచి ఏడాది దాకా పడుతుంది. కానీ.. డీపీఆర్ తయారీకి 4నెలల సమయమే ఇచ్చారు. జియోటెక్నికల్ పరిశోధనకూ తగిన సమయం ఇవ్వలేదు. ఇవన్నీ ప్లానింగ్, డిజైన్లపై తీవ్రప్రభావం చూపాయి. అంతేనా.. డీపీఆర్ తయారీకి ముందే బ్యారేజీల నిర్మాణం ప్రారంభమైంది.

పరిశోధన ఒకచోట.. నిర్మాణం మరోచోట

డీపీఆర్‌లో పేర్కొన్న పలు కీలక అంశాలు కూడా డిజైనింగ్, నిర్మాణంలో కార్యరూపం దాల్చలేదు. ఉదాహరణకు.. మూడు బ్యారేజీలను కట్టాలని భావించిన చోట జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ చేసి డీపీఆర్‌లో పొందుపరిచారు. కానీ.. నాటి సర్కారు డీపీఆర్‌ను సమర్పించిన తర్వాత అన్నారం, సుందిళ్ల బ్యారేజీ స్థలాలను మార్చేసింది. అలా ఒక ప్రాంతంలో చేసిన జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ మరో ప్రదేశానికి పనికిరాదు. కొత్త చోట మళ్లీ కొత్తగా జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ చేయాల్సిందే. కానీ.. అలా చేయకుండానే డిజైన్, నిర్మాణ ప్రక్రియను కొనసాగించారు. బ్యారేజీలను సరిగ్గా నిర్మించలేదనడానికి ఇది ప్రధాన ఆధారం. అలాగే.. నిర్మాణంలో షీట్ పైల్స్‌ను వినియోగించాలని సూచించినప్పటికీ.. డిజైన్లలో వాటిని సీకెంట్ పైల్స్‌గా మార్చారు. ఇక.. సీడీవో సిఫారసులు నిర్మాణ యూనిట్‌పై ప్రభావం చూపాల్సి ఉండగా.. ప్రాజెక్టు నిర్మాణ యూనిట్ అభ్యర్థనలకు అనుగుణంగా సీడీవో పలు డిజైన్ మార్పులు చేసింది. అలాగే.. తగిన మోడలింగ్ అధ్యయనాలను నిర్వహించడానికి టీఎస్ఈఆర్ఎల్‌కు తగినంత సమయం ఇవ్వలేదు. మోడలింగ్ అధ్యయనాలను ప్రొఫెషనల్ పద్ధతిలో నిర్వహించడానికి తగిన మౌలిక సదుపాయాలు టీఎస్ఈఆర్ఎల్‌కు లేవు. వాటిని బలోపేతం చేసేందుకు అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ప్రవాహ పరిస్థితులను క్రమబద్ధీకరించడం, ప్రతి బ్యారేజీకీ గేట్ ఆపరేషన్ షెడ్యూల్ వంటి టీఎస్ఈఆర్ఎల్ చేసిన పలు సిఫారసులను ప్రాజెక్టు నిర్మాణ విభాగం విస్మరించింది. టీఎస్ఈఆర్ఎల్ సిఫారసులను ఆ విభాగం పాటించడానికి బదులు.. నిర్మాణ యూనిట్ అవసరాలకు అనుగుణంగా టీఎస్ఈఆర్ఎల్ పనిచేసింది. ఇది వ్యవస్థాగత లోపంగా కనిపిస్తోంది.

నాలుగు చర్యలు..

కాళేశ్వరం ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో.. ప్రభుత్వం నాలుగు అంశాలను ప్రాధాన్య ప్రాతిపదికన పరిశీలించాలి. అవి..

- బ్యారేజీలు మరింత క్షీణించకుండా ఉండటానికి తీసుకోవాల్సిన మధ్యంతర చర్యలు.
- జరిగిన నష్టాన్ని తెలుసుకోవడానికి చేయవలసిన పరిశోధనలు, పరీక్షలు.
- ఆ పరిశోధనలు, పరీక్షల ఫలితాల ఆధారంగా చేయాల్సిన మరమ్మతులపై దృష్టి సారించడం.
- బ్యారేజీలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సక్రమంగా ఉపయోగించుకోవడానికి అవసరమైన శాశ్వత చర్యలను గుర్తించడం.

థర్డ్ పార్టీ ఆడిట్ ఏదీ?

సాధారణంగా ఇంత పెద్ద ప్రాజెక్టు నాణ్యతను థర్డ్‌పార్టీతో ఆడిట్ చేయించడం ఆనవాయితీ. కానీ ఇక్కడ అలాంటిదేదీ నిర్వహించలేదు. నిర్మాణ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాల్లో కూడా అలాంటి నిబంధనలేవీ పెట్టలేదు. కాగా.. మేడిగడ్డ బ్యారేజీలో 2019లో వర్షాకాలం ప్రారంభమైన వెంటనే కటాఫ్ వాల్ దిగువన ఉన్న సీసీ బ్లాకుల దిగువ ప్రాంతంలో నీరు బయటకు రావడం ప్రారంభమైంది. అయినా రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీటిని మరమ్మతుల కోసం ఖాళీ చేయకుండా అవసరాలకు వాడుకుంటూ వచ్చారు. సంబంధిత ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాకపోవడంతో రిజర్వాయర్ మరమ్మతులకు నోచుకోలేదు. మరమ్మతులు, కాలానుగుణ నిర్వహణ ప్రొటోకాల్ పూర్తిగా లేకపోవడంతో.. ఏటా క్రమంగా క్షీణించి, చివరికి మేడిగడ్డ బ్యారేజీ అతిపెద్ద వైఫల్యంగా మారింది. ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా మేడిగడ్డ లాగా ఒకే రకమైన డిజైన్లు, నిర్మాణ పద్ధతులను కలిగి ఉండడంతో అవి కూడా తీవ్ర విపత్కర పరిస్థితులు, నష్టాలను చవిచూశాయి. వీటిలో ఏ బ్యారేజీకీ అమలు, నిర్వహణ నిబంధనావళి (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మాన్యువల్) లేదు.

వచ్చేది హంగ్.. మనమే కింగ్

ఈ మోకాను వదలొద్దు.. 14-15 సీట్లివ్వండి: కేసీఆర్

వరంగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "కేంద్రంలో వచ్చేది హంగ్.! ఏ పార్టీకి మెజారిటీ వచ్చే అవకాశం లేదు..! హంగ్ వస్తే.. మనమే కింగ్ అవుతాం. నరేంద్ర మోదీకి 200 సీట్లకు మించి రావు. ఈ మోకా(అవకాశం)లో తెలంగాణలో 14-15 ఎంపీ సీట్లిస్తే.. పేగులు తెగేదాకా కొట్లాడేది మనమే" అని బీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. కేంద్రంలో కీలకంగా మారితే.. తెలంగాణ హక్కుల కోసం కొట్లాడవచ్చని వ్యాఖ్యానించారు. ఆదివారం రాత్రి ఆయన హనుమకొండ చౌరస్తాలో జరిగిన బీఆర్ఎస్ రోడ్ షోలో మాట్లాడారు. గోదావరి నీళ్లను తమిళనాడు, కర్ణాటకకు తరలించేందుకు ప్రధాని మోదీ కుట్రలు చేస్తున్నారని, ఆ మేరకు నోటీసులు పంపితే.. రాష్ట్ర ప్రభుత్వం నోరుమూసుకుని కూర్చోవడంలో మతలబేంటని ప్రశ్నించారు. "ఇప్పటికే కృష్ణా నీళ్లను కేఎంబీఆర్‌కు అప్పగించారు. బీజేపీకి ఓటేస్తే మోసపోతాం. కాంగ్రెస్ వాగ్దానాలను నిలబెట్టుకోలేదు" అని విమర్శించారు. ప్రజల తరఫున కొట్లాడే పంచ్ ఎవరు? అని కేసీఆర్ ప్రశ్నించగా.. ప్రజలు ముక్తకంఠంతో "మీరే.." అని బదులిచ్చారు. దానికి కేసీఆర్ స్పందిస్తూ.. "మొన్న ఎలక్షన్లలో నన్ను పడగొట్టారు. ఇప్పుడు మళ్లీ 'పంచ్' అవ్వమంటారా? అయితే.. మీరు బలం ఇస్తేనే నేను కొట్లాడతా. వచ్చే ఎన్నికల్లో సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి" అని కోరారు. బీజేపీ ప్రమాదకరమైన పార్టీ అని.. పదేళ్ల కింద నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి, జన్‌ధన్ ఖాతాల్లో ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షల చొప్పున జమచేస్తానని హామీ ఇచ్చారని.. అది జరగలేదని విమర్శించారు. అమృత్‌కాల్.. అచ్చేదిన్ రాలేదని, సచ్చేదిన్ మాత్రం వచ్చిందని ఎద్దేవా చేశారు. కాజీపేటకు కోచ్‌ఫ్యాక్టరీ వస్తే.. దాన్ని ప్రధాని తన సొంత రాష్ట్రానికి తరలించారని మండిపడ్డారు. రూపాయి విలువ దారుణంగా పడిపోయిందని, 18లక్షల కేంద్ర ప్రభుత్వోద్యోగాలు ఖాళీగా ఉంటే.. భర్తీ చేయడం లేదని ఆరోపించారు.

సీఎం రేవంత్‌పై ఆగ్రహం

కేసీఆర్ సీఎం రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. "అసెంబ్లీలో మన ఎమ్మెల్యేలు హామీలపై నిలదీస్తే.. కేసీఆర్.. నీ గుడ్లు పీకి గోలీలు ఆడుకుంటా అన్నాడు. పేగులు తీసి మెడలో వేసుకుంటా అన్నాడు. ఆఖరికి నా చెడ్డీ కూడా గుంజుకుంటా అన్నాడు. నేను పదేళ్ల సీఎంగా ఉన్నప్పుడు ఇలాంటి మాటలు మాట్లాడానా? నా నోట ఇలాంటి మాటలు ఎప్పుడైనా విన్నారా? ఇదేనా సీఎం మాట్లాడే భాష?" అని నిలదీశారు. తనను చర్లపల్లి జైలులో వేస్తానని సీఎం అంటున్నారని గుర్తుచేశారు. "గీ జైళ్లకు.. తోకమట్టకు నేను భయపడతానా? కేసీఆర్ జైళ్లకు భయపడితే తెలంగాణ వచ్చేదా? తెలంగాణ కోసం ఎన్ని దెబ్బలు తిన్నాం? ఎన్ని నిరాహార దీక్షలు చేశాం? ఎన్ని రాజీనామాలు చేశాం? ఎన్నిసార్లు పదవులను ఎడమకాలి చెప్పులా విసిరేశాం? మేంగిట్ల భయపడి ఉంటే.. తెలంగాణ వచ్చేదా?" అని ప్రశ్నించారు. రేవంత్‌కు తెలంగాణ చరిత్ర, భూగోళం తెలియదని.. ఇటీవల ఎక్కడో మాట్లాడుతూ కృష్ణానదిని కూడా తానే కట్టినట్లు చెప్పారని, ఎక్కడైనా ఎవరైనా నదులను కడతారా? అని ప్రశ్నించారు. రేవంత్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో భయంకరంగా ట్రోలింగ్ జరిగిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమం అయిపోలేదని, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం మరో ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు.



హనుమకొండ చౌరస్తాలో మాట్లాడుతున్న కేసీఆర్

కాంగ్రెస్ హామీలపై నిలదీత

"ఓ మహిళ ఏరికోరి మొగుడిని తెచ్చుకుంటే.. ఎగిరెగిరి తన్నిండంట..! అడ్డగోలుగా హామీలిచ్చిన కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే దేప జరుగుతోంది. నాలుగు నెలల్లో తెలంగాణకు ఏం జబ్బు చేసింది? కరెంటు ఎక్కడికి పోయింది? సాగునీళ్లు ఏమయ్యాయి? పంటలు ఎందుకు ఎండిపోతున్నాయి? తాగునీటికి ఎందుకు కరువొచ్చింది? పదేళ్లలో ఇవన్నీ ఉండేవా? కాంగ్రెస్ ఒక్కటంటే ఒక్క హామీని కూడా అమలు చేయలేదు" అని విమర్శించారు. రైతుబంధు వస్తుందా? మహిళలకు రూ.2,500 ఇస్తున్నారా? అని ప్రజలను ప్రశ్నించారు. తాము రూ.30 వేల కోట్లతో రూ. లక్ష వరకు రుణమాఫీ చేశామని, కాంగ్రెస్ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు.

మూణ్నెల్లలో ఉప ఎన్నిక

కడియం శ్రీహరి చేసిన మోసానికి శాశ్వతంగా ఆయన రాజకీయ జీవితాన్ని సమాధి చేసుకున్నారని కేసీఆర్ విమర్శించారు. ఇంకో మూణ్నెల్లలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రాక తప్పదన్నారు. రాజయ్య ఎమ్మెల్యే కాక తప్పదని పేర్కొన్నారు.

నేడు, రేపు ఉమ్మడి ఖమ్మంలో..

కేసీఆర్ బస్సుయాత్ర సోమ, మంగళవారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరగనుంది.

బీజేపీ, బీఆర్ఎస్‌లను సమాధి చేయాలి

» ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశాన్ని దోచుకున్న బీజేపీని, రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్‌ను పార్లమెంటు ఎన్నికల్లో సమాధి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకికవాద రక్షణకు 'ఇండియా' కూటమిని గెలిపించాలని కోరారు. హైదరాబాద్ అల్వాల్ దగ్గర్లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి కాంగ్రెస్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డితో కలిసి కూనంనేని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల్లో ఒకరిపై ఒకరు పోరాడుతున్నట్లు కనబడుతున్నాయని, కానీ వాస్తవానికి అవి కలిసి పనిచేస్తూ ప్రజలను మోసగిస్తున్నాయన్నారు. అందుకే మతం పేరుతో ఓట్లడిగే బీజేపీని, అవినీతి బీఆర్ఎస్‌ను ఈ ఎన్నికల్లో ఓడించి, 'ఇండియా' కూటమి బలపరిచిన పట్నం సునీత మహేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. భారతదేశ ఎన్నికలను హిందూ - ముస్లిం యుద్ధంగా మార్చాలనే ప్రధాని మోదీ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారని ఆరోపించారు. రోజురోజుకు పెరుగుతున్న నిరుద్యోగం, రైతుల కష్టాలపై చర్చించని మోదీ.. ప్రతిపక్ష నేతలను జైళ్లకు పంపడం, దేశ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శులు డి.జి సాయిలూగౌడ్, ఎస్.ఛాయాదేవి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి బరిలో మేమే

మిగతా 16 స్థానాల్లో కూటమికి మద్దతు: తమ్మినేని

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పార్లమెంటు స్థానంలో సీపీఎం పార్టీ బరిలో కొనసాగనుంది. పార్టీ స్వతంత్ర రాజకీయ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి మహ్మద్ జహంగీర్‌ను బలపర్చాలంటూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే భువనగిరిలో తాము పోటీలో ఉంటున్న నేపథ్యంలో మిగిలిన 16 స్థానాల్లో మతోన్మాద బీజేపీని ఓడించేందుకు 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను బలపర్చాలని ఆయన ప్రజలను కోరారు. కాగా పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సీపీఎం కార్యదర్శివర్గం ఆదివారం సమావేశమైంది. మతోన్మాద శక్తుల ఓటమి కోసం అనుసరించవలసిన వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

10-12 స్థానాలు గెలిస్తే ఏడాదిలోగా

కేసీఆర్ తెలంగాణను శాసిస్తారు

» అప్పుడు అధికారులూ.. మాట వింటారు
» అసెంబ్లీ ఎన్నికల్లో మనమే ఓడించుకున్నాం
» అధికారం లేక ఊళ్లో సుంకరి కూడా పలకట్లే
» పార్టీ కార్యకర్తలతో సమావేశంలో కేటీఆర్

వేములవాడ/కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 28: బీజేపీ, కాంగ్రెస్ కుట్రల నుంచి తెలంగాణను కాపాడుకోవాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 10 నుంచి 12 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అదే జరిగితే ఏడాదిలోగా మళ్లీ కేసీఆర్ తెలంగాణను శాసించే రోజు వస్తుందని చెప్పారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, కరీంనగర్‌లో బీఆర్ఎస్ బూత్ కమిటీల సభ్యులు, ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ జూన్ 2తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్నందున హైదరాబాద్‌ను కనీసం పదేళ్లపాటు ఉమ్మడి రాజధాని చేయాలని, కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని బీజేపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పేరిట దక్షిణాది రాష్ట్రాల్లో స్థానాలు తగ్గించి అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను ఇక్కడి అవసరాలకు ఇవ్వకుండా కర్ణాటకు తరలించేందుకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారన్నారు. ఇలాంటి కుట్రలు సాగకుండా, తెలంగాణకు అన్యాయం జరగకుండా అడ్డుకునే శక్తి ఒక్క గులాబీ కండువాకే ఉందన్నారు. కేంద్రంలో మళ్లీ మోదీ ప్రభుత్వం వస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, దీనిపై బీజేపీ, కాంగ్రెస్ సన్నాసులు నోరు తెరుస్తారా అని ప్రశ్నించారు. రిజర్వేషన్ల రద్దును అడ్డుకునేది కేసీఆర్ మాత్రమేనని అన్నారు. గత పదేళ్లలో 'బడే భాయ్' ప్రధాని మోదీ అనేక విధాలుగా ప్రజలను మోసం చేశారన్నారు. నల్లధనం వెలికితీసి ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షలు ఖాతాల్లో జమ చేస్తామని, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీలిచ్చి మోసగించారన్నారు. ఇక రాష్ట్రంలో 'ఛోటా భాయ్' రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీల పేరుతో తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలూ మాయమవుతాయని పేర్కొన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మనల్ని ప్రజలు ఓడించలేదని, మనల్ని మనమే ఓడించుకున్నామన్నారు. నాయకుల మధ్య విభేదాలు, పంచాయతీలతో పార్టీకి తీవ్ర నష్టం జరిగిందని, కేవలం 2% ఓట్లతో అధికారం కోల్పోయామని చెప్పారు. అధికారం లేకపోవడంతో ఊళ్లల్లో సుంకరి కూడా పలకని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు తొత్తులుగా మారిన అధికారులు, తోకజాడిస్తున్న పోలీసులు మళ్లీ మన మాట వినాలంటే కనీసం 10-12 ఎంపీ సీట్లు సాధించుకోవాలన్నారు. పంచాయితీలు, పగలు పక్కనపెట్టి, పనిచేయాలని కార్యకర్తలను కోరారు.



ఫస్ట్ జంప్ జిలానీ రేవంత్ రెడ్డే

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు రాగానే జూన్ 4న మొట్టమొదటి 'జంప్ జిలానీ' అయ్యేది చోటా భాయ్ రేవంత్ రెడ్డేనని కేటీఆర్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కరీంనగర్, మల్కాజిగిరి, నిజామాబాద్, చేవెళ్ల, మరికొన్ని స్థానాల్లో డమ్మీ అభ్యర్థులను రేవంత్ రెడ్డి పోటీలో నిలిపారని ఆరోపించారు. జీవన్ రెడ్డి కరీంనగర్ టికెట్ అడిగితే ఆయనకు ఇష్టంలేని నిజామాబాద్‌లో పోటీకి దింపారని, స్థానికంగా ఉండే మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డికి టికెట్ ఇవ్వకుండా డమ్మీ అభ్యర్థిని నిలబెట్టారన్నారు. ఇది బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కోసం రేవంత్ రెడ్డి చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, అదే జరిగి ఉంటే మన ఇంటి ఆడపడుచును జైలులో పెడతారా అని ఆయన అడిగారు.

బండి సంజయ్.. చర్చకు సిద్ధమా?

ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్‌కు ఏమీ చేయలేదని కేటీఆర్ విమర్శించారు. వేములవాడ, కొండగట్టు ఆలయాలకు ఒక్క రూపాయి కూడా తీసుకు రాలేదని, ఐదేళ్లలో చేసిన పనులపై చర్చకు సిద్ధమా? అని సంజయ్‌కు సవాల్ విసిరారు. సంజయ్ ఐదేళ్లలో జడ్పీ, మునిసిపల్, మండల సమావేశాలకు హాజరు కాలేదని, చివరకు పార్లమెంట్‌కు కూడా వెళ్లి మాట్లాడేందుకు ఆయనకు ఏ భాషా రాదని ఎద్దేవా చేశారు. శ్రీరాముడు అందరివాడని, మనం కూడా జై తెలంగాణ, జై భారత్‌తో పాటు జై శ్రీరామ్ అందామని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే పోటీ ఉందని ఆయన చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.